ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కడప
: fb.com/vaartha Digital
Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-4-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 72 పేజీలు: 10+4 వెల: 6.50

యుఎస్ సందర్శన ఓ హక్కుకాదు
విదేశాంగ మంత్రి మార్కో రుబియో
ఆఫ్ఘన్ శరణార్థులను తిప్పి పంపిస్తున్న పాకిస్థాన్
5లో

# విశ్వనగరంగా 'అమరావతి'

## రూ. 31 వేల కోట్ల పనులకు టెండర్లు

### రాజధానికి అదనంగా 30 వేల ఎకరాలు: సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అత్యంత ఆధునీకంగా ప్రపంచంలో అత్యుత్తమ నగరం నిర్మిస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు.ఇందుకు కోసం దాదాపు అన్ని దశలలో విస్తృత కార్యచరణ చేపట్టినట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. భవనాల నిర్మాణం వేగవంతంగా అవుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోడీతో రాజధాని పనులు పునర్‌ప్రారంభిస్తామన్నారు.ఆ మేరకు సిఎం చంద్రబాబు ఒక సమాచార పత్రాన్ని విడుదల చేసారు.రాజధాని నిర్మాణానికి సంబంధించి తీసుకుంటున్న చర్యల కార్యచరణ వివరించారు.ఈ పత్రంలోని అంశాలను అనుసరించి అభివృద్ధి చేస్తూనే మరోవైపు విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేసేలా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.మరో 30వేలఎకరాల మేర సమీకరించేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్టు తెలుస్తోంది. అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్లకు అనుసంధా నంగా ఏర్పాటు అయ్యే ప్రాజెక్టుల కోసం ఈ స్థాయిలో భూ సమీకరణ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కోర్ క్యాపిటల్‌కు చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో ఈ సమీకరణ ప్రక్రియ చేపట్టేందుకు సీఆర్డీఏ ప్రణాళికలు చేస్తోంది. రాజధాని భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణ పనులతో పాటే విస్తరణ కోసం అమరావతి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. కొత్తగా మరో 30 వేల ఎకరాలకు పైగా సమీకరణ చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టింది. అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టుతో పాటు అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం ఈ స్థాయిలో భూ సమీకరణ అవసరంఅని సీఆర్డీఏ భావిస్తోంది. కోర్ క్యాపిటల్‌కు చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో ఈ సమీకరణ ప్రక్రియ చేప్టటేందుకు ప్రణాళికలు సిద్ధం అవు తున్నాయి. ఇప్పటికే 33 వేల ఎకరాల్లో నిర్మాణం పనులు ప్రారంభించిన సీఆర్డీఏ, రాజధాని భవిష్యత్ అవసరాల దృష్ట్యా అదనంగా భూమిని సమీకరించనున్నట్టు తెలుస్తోంది.

రాజధాని విస్తరణపై దృష్టిపైనే ప్రభుత్వంపై పూర్తి దృష్టి పెట్టింది,.రాజధాని అభివృద్ధి చేస్తూనే రెండో వైపు విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేసుకునే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇటీవలే రూ.31 వేల కోట్ల విలువైన పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులను వివిధ ఏజెన్సీలకు సిఆర్‌డిఏ అప్పగించింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులు కూడా పనుల ఆధారంగా విడతలవారీగా నిధుల్ని మంజూరు చేస్తున్నాయి. రాజధాని పనులు వేగం అందుకోగానే ఈ విస్తరణపై కూడా దృష్టి పెట్టాలని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగానే రాజ ధానిలో భవిష్యత్ ప్రాజెక్టుల కోసం మరో 30 వేల ఎకరాలకుపైగా భూసమీకరణ చేసేందుకు ఆలోచన చేస్తోంది.

అమరావతి ఇన్నర్ రింగు రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా ఈ భూముల సమీకరణకు ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. రాజధాని నగరం విస్తరణతో పాటు, భవిష్యత్ అవసరాల నిమిత్తం భూ సమీకరణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. కోర్ క్యాపిటల్‌కు వెలుపల ఉన్న 20కిపైగా గ్రామాల్లో ఈ భూసమీకరణ ప్రక్రియ చేపట్టాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ సమీకరణకు సంబంధించి సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేస్తోంది.

అమరావతి రాజధానిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు ఎపి ఏవియేషన్ కార్పొరేషన్ టెక్నో ఫీజిబిలిటీ నివేదికను సిద్ధం చేసేందుకు టెండర్లను ఆహ్వానించింది. ఈ నివేదికను త్వరిత గతిన రూపొందించి కేంద్రానికి పంపనుంది. కేంద్ర పౌర విమానయాన శాఖ నుంచి దీనిపై గ్రీన్ సిగ్నల్ వచ్చాక ప్రభుత్వం తదుపరి కార్యాచరణ చేపట్టనుంది. అమరావతిలోని ఇ13 రోడ్డుని చెన్నై కోల్‌కతా జాతీయ రహదారి (ఎన్‌హెచ్16)తో అనుసంధా నించేందుకు, ఇ15 రోడ్డుని మంగళగిరి లోని పాతబస్టాండ్ వరకు విస్తరించేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) టెండర్లు పిలిచింది. ఇ15కి రూ.70 కోట్లు, ఇ13కి రూ.384.78 కోట్లు అంచనా వ్యయంగా పేర్కొంది. రాజధాని మాస్టర్ ప్లాన్ ప్రకారం ఈ రహదారుల్ని జాతీయ రహదారి వరకు పొడిగించే ప్రతిపాదన >>2



## గడువు దాటితే 30 రోజుల్లో వెళ్లిపోవాలి

### హోంల్యాండ్ సెక్యూరిటీ హెచ్చరిక

**వాషింగ్టన్, ఏప్రిల్ 13:** అమెరికాలో ఎక్కువ కాలం నివసిస్తున్న విదేశీ జాతీయులు తప్పనిసరిగా ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకోవాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ హెచ్చరికలు జారీ చేసింది. 'అమెరికాలో 30 రోజులకు మించి నివసిస్తున్న వారు కచ్చితంగా ఫెడరల్ గవర్నమెంట్ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే.. నేరం కింద పరిగణించి అపరాధ రుసుం, జైలు శిక్షలు విధిస్తారు. అందుకే ఇప్పుడే సొంతంగా వెళ్లిపోండి' అని ఎక్స్‌లో సందేశం ఉంచింది. 'సొంతంగా అమెరికాను వీడటమే ఉత్తమమైన మార్గం. మీ సామాను సర్దుకొని విమానం ఎక్కండి. మీకు ఎటువంటి నేర నేపథ్యం లేకపోతే అమెరికాలో సంపాదించుకున్న సొమ్మును దాచుకొని బయల్దేరండి' అని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వెల్లడించింది. ఇలాంటి వారు విమాన టికెట్ సొమ్మును భరించలేకపోతే.. రాయితీ ఇచ్చేందుకు అమెరికా ఏర్పాట్లు చేసింది. ఈ నిబంధనలు పాటించకపోతే తక్షణమే దేశం నుంచి పంపిచేస్తామని పేర్కొంది. అంతేకాదు.. ఫైనల్ ఆర్డర్ అందుకున్న >>2

## ఐఏఎస్‌ల బదలీలు

### ఆర్పీ సిసోడియా స్థానంలో జయలక్ష్మి

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో తొమ్మిది మంది సీనియర్ ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం బదలీ చేసింది. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా బదలీ అయ్యారు. చేనేతశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సిసోడియాను నియమించారు. రెవెన్యూశాఖలో విభాగపరంగా అనేక అభియోగాలు ఆర్పీ సిసోడియా పైవచ్చాయి. రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సైతం సీసోడియా పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం,.ఈ క్రమంలో ఆయనను చేనేతశాఖకు బదలీ చేసారంటున్నారు. పలువురు సీనియర్ ఐఎఎస్ సిసిఎల్ఎ ప్రత్యేక >>2



పేలుడు ధాటికి పూర్తిగా ధ్వంసమైన బాణాసంచా కేంద్రం

## బాణాసంచా పరిశ్రమలో భారీ పేలుడు

### 8 మంది మృతి, 8 మందికి గాయాలు

### అనకాపల్లి జిల్లాలో ఘోర ప్రమాదం

**అనకాపల్లి, ఏప్రిల్ 13, ప్రభాత వార్త :** అనకాపల్లి జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. కోటివురట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాద సంఘటనలో 8 మంది మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. స్థానికులు పరుగున వెళ్లి చూసేసరికి బాణా సంచా తయారీ కేంద్రం తునా తునకలై క్షతగాత్రుల రోదనలతో భయానకంగా ఉంది. విషయం తెలుసుకున్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. వారికి స్థానికులు సహకారం అందించారు. క్షతగాత్రులను హుటాహుటిన కోరవురట్ల పీహెచ్ సీకీ, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అసలు ప్రమాదం ఏ విధంగా జరిగిందని ఎవరూ చెప్పలేకపోతున్నారు. విషయం తెలుసుకున్న హోం మంత్రి వంగలపూడి అనిత సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మరణించిన మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం 15 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం జరిగిందని, క్షతగాత్రులను మెరుగైన వైద్య నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి మరియు విశాఖపట్నం కె.జి.హెచ్. తరలించడం జరిగిందని వారి పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని ఆమె తెలిపారు. ప్రమాద సంఘటన ప్రదేశాన్ని ఎంపీ సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎమ్. జాహ్నవి, సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ తుహిన్ సిన్హా సందర్శించారు. దురదృష్టకర సంఘటన పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని, సహాయక చర్యలపై ఆరా తీశారని, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.



గాయపడినవారిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

**బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి అచ్చెన్నాయుడు**

అనకాపల్లిజిల్లాలో బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాద ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై అనకాపల్లిజిల్లా అధికారులతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. >>2



## భూమన ఆరోపణలపై క్రిమినల్ కేసు!

### టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు

**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** గత వైఎస్సార్సీ ప్రభుత్వంలోని టిటిడి పాలకమండలి పూర్వ ఛైర్మన్‌గా వ్యవహరించిన భూమన కరుణాకర్‌రెడ్డి కమీషన్‌లు తీసుకుని పనులు చేశాడని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సంచలన ప్రకటన చేశాడు. భూమన పెద్ద అవినీతిపరుడని, గతంలో టిటిడిలో అన్నీ స్కాంలకే పాల్పడ్డాడన్నారు. అసలు భూమన కరుణాకర్‌రెడ్డి హిందువే కాదని చెప్పడం హాట్‌టాఫిక్‌గా మారింది. ఆయన హయాంలో గోవులకు పురుగుల దాణా పెట్టారని, అనారోగ్యం, వృద్ధాప్యంతో గోవులు మృతి చెందాయే తప్ప టిటిడి సిబ్బంది నిర్లక్ష్యం లేదని తెలిపారు. సస్పెన్షన్‌కు గురైన మాజీ గోశాల డైరెక్టర్ హరనాధరెడ్డితో కలసి మాజీ ఛైర్మన్ మార్ఫింగ్ ఫోటోలు విడుదల చేయడం భక్తుల మనోభావాలు దెబ్బతీశారన్నారు. >>2



## రాజకీయాల్లోకి వస్తున్నా!

### ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఎబివి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 13( ప్రభాతవార్త):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్మోహన్ రెడ్డి ప్రజావ్యతిరేక విధానాలు వల్ల అనేక వ్యవస్థలు, ఎంతో మంది తీవ్రంగా నష్టపోయారని అందుకే ఇకపై జగన్ నెవర్ ఎగైన్ అన్నదే తన నినాదంతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు మాజీ ఇంటిలిజెన్స్ ఛీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన పలు ఆసక్తికరమైన అంశాలు ప్రస్తావించారు. జగన్ మళ్లీవస్తే రాష్ట్రం అధోగతి పాలవుతోందన్నారు. త్వరలోనే తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు వెంకటేశ్వరరావు ప్రకటించారు. తన జీవితంలో కాళ్ళ, చేతులు >>2

## అందరికీ అందుబాటులో ఆధునిక వైద్యం

### యేడాదిలోగా 100 పడకల ఆసుపత్రి

### మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆధునీక వైద్యం ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకుని రావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం కీలక లక్ష్యమని మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రజలకు వైద్యంతో పాటు, ఆయా వ్యాధులు నిర్ధారించే పరీక్షాశాలలు(ల్యాబ్స్)ను అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు.ఈ క్రమంలోనే మంగళగిరి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని అనుసరించి 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్నారు.ఏడాదిలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకుని రావడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భారతదేశానికే ఆదర్శంగా మంగళగిరి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని తీర్చిదిద్దుతామని విద్య, ఐటీ శాఖలమంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా మంగళగిరి సమీపం చినకాకాని వద్ద వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా శంకుస్థాపన ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు కూటమి నేతలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేద మంత్రోఛ్ఛారణల మధ్య కూటమి నేతలతోకలిసి మంత్రి నారా లోకేష్ భూమి



ఆదివారం టిడ్కో కాలనీలో మినరల్ వాటర్ ప్లాంట్ శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి లోకేష్

పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భవన నమూనా చిత్రాలను పరిశీలించి నేతలకు వివరించారు. కూటమి నేతలతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

1984లో స్వర్గీయ నందమూరి తారకరామారావు గారు వైవీసీ(యార్లగడ్డ వెంకన్న చౌదరి) క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకం వద్ద మంత్రి నారా లోకేష్ సెల్ఫీ దిగారు. మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కల నేరవేరుతుందని వ్యాఖ్యానించారు.మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కల. ఆ కలను నెరవేర్చే అవకాశం మనకు వచ్చింది. అందరి సహకారంతో నిర్మిస్తాం. మంగళగిరి 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా చేయాలని ఇక్కడి ప్రజలను నన్ను కోరడం జరిగింది. ఇప్పుడున్న స్థలంలో కాకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సువిశాలప్రాంగణం ఉండాలనేఆలోచనతో ఈ ప్రాంతాన్ని >>2

## అనకాపల్లి ఘటన మృతులకు రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియా

### పేలుడు ఘటనపై సమగ్ర విచారణ: హోంమంత్రి అనిత

**విశాఖపట్నం,ఏప్రిల్, 13 ప్రభాతవార్త:** అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణాసంచా పరిశ్రమలో పేలుడు ఘటనపై సమగ్ర విచారణ జరుపుతామని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ప్రమాద ఘటనలో ఎనిమిది మంది మృతి చెందడం తీవ్ర విషాదకరమని ఆమె పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించినట్లు సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం హోంమంత్రి అనిత మీడియాతో స్పష్టం చేశారు. అగ్నిప్రమాదంలో మరణించిన ఒక్కొక్కరికీ రూ.15 లక్షలు చొప్పున ఆయా కుటుంబాలకు పరిహారంగా అందించనున్నట్లు హోంమంత్రి అనిత ప్రకటించారు. ఈ ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర



మోడీ కూడా స్పందించినట్లు హోంమంత్రి స్పష్టం చేశారు. ప్రమాద బాధితులకు కేంద్రం మరణించిన ఒక్కొక్కరికీ రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు స్పష్టంచేశారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ సాయానికి అదనమన్నారు. కోటవురట్ల మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో >>2

## కుమారుడితో హైదరాబాద్ చేరుకున్న డి.సిఎం పవన్

**విజయవాడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ చేరుకున్నారు. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పవన్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ గాయపడి అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకుంటున్న సంగతి తెలిసిందే. పవన్ తన సతీమణి అన్నాలెజినోవా, కుమారుడు మార్క్‌శంకర్, కుమార్తె పొలెనా అంజనా పవనోవాతో కలిసి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. తన కుమారుడిని పవన్ ఎత్తుకుని ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మార్క్ శంకర్ ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తూ తాజాగా పవన్ కల్యాణ్‌ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. బాబు ఆరోగ్యం నిలకడగా ఉందని కోలుకుంటున్నాడని పేర్కొన్నారు. ప్రమాదం గురించి తెలిసి మార్క్ శంకర్ క్షేమాన్ని ఆకాంక్షించిన రాజకీయ నాయకులు, జనసేన నేతలు, అభిమానులు, కుటుంబసభ్యులు, స్నేహితులకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. క్లిష్ట సమయంలో వారి సందేశాలు, ప్రార్థనలు తమ కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయన్నారు. ముఖ్యంగా ప్రధాని మోడీకి పవన్ కృతజ్ఞతలు చెప్పారు. సింగపూర్ అధికారులు సింగపూర్‌లోని భారత హైకమిషన్ అధికారులు సమన్వయంతో అందించిన సాయం క్లిష్ట సమయంలో ఎంతో భరోసా ఇచ్చిందన్నారు. ఇవాళ అన్నా లెజినోవా శ్రీనివాసుడికి మొక్కులు చెల్లించుకునేందుకు తిరుపతి >>2



## మండుతున్న ఎండలు

### ఒక మోస్తరు వర్షాలున్నాయంటున్న వాతావరణ శాఖ

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. జనం బయటకు రావాలంటే భయపడుతున్నారు.ఎండ తీవ్రత రోజురోజుకు మరింత పెరుగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిస్తోంది. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరినట్టు వెల్లడించింది. గడచిన 24 గంటల్లో పల్నాడు జిల్లా రావిపాడులో 43.7 డిగ్రీలు, ప్రకాశం జిల్లా దరిమడుగులో 43.4 డిగ్రీలు, బాపట్ల జిల్లా ఇంకొల్లులో 43 డిగ్రీలు, తిరుపతి జిల్లా రేణిగుంటలో 42.8డిగ్రీలు,, తూర్పు గోదావరి జిల్లా చిన్నాయిగూడెంలో 42.6 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదైంది. ప్రకాశంలో 22 చోట్ల, బాపట్లలో 18, పల్నాడు 17, నెల్లూరు 13, ఎన్టీఆర్ 8, ఏలూరు 7, గుంటూరు 7, తిరుపతి 7, కృష్ణా జిల్లాల్లో 6 ప్రాంతాల్లో, తదితర జిల్లాల్లో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 119 ప్రాంతాల్లో 41 డి కు పైగా ఉష్ణోగ్రతలు రికార్డ్ అయినట్లు ఎపిఎస్ డిఎంఎవెల్లడించింది. ఆదివారం మొత్తం 30 మండలాల్లో తీవ్ర వడగాలులు, 67 మండలాల్లో వడగాలుల నమోదయ్యాయినట్లు >>2



రాజస్థాన్‌లోని కోటలో నిర్మించ తలపెట్టిన రాజ్యాంగపార్క్ స్థల పరిశీలన చేస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా

# పరిశ్రమలో భారీ పేలుడు

>> క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. సహాయక చర్యలు మరింత వేగవంతం చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**పేలుడుపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపండి: మంత్రి కొల్లు రవీంద్ర**

కోటవురట్ల బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదంపై ఇంఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో కార్మికుల మరణం పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. క్షత గాత్రులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని, ప్రమాద స్థలంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. మృతులు మరింతగా పెరిగే అవకాశం ఉందనడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పేలుడుపై సమగ్ర దర్యాప్తు జరుపుతామని అన్నారు.

**అనకాపల్లి విషాదం పై ప్రధాని దిగ్భ్రాంతి**

అనకాపల్లి జిల్లాలో జరిగిన బాణాసంచా పేలుడు ఘటనలో 8 మంది మృతి చెందడం పట్ల ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జరిగిన ఘటన దురదృష్టమని, బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని తెలిపారు. కేంద్రం తరపున మృతి చెందిన కుటుంబాలకు 2 లక్షలు, గాయపడిన కుటుంబాలకు 50 వేల రూపాయలు చొప్పున అందచేస్తామని హామీ ఇచ్చారు. కాగా మృతుల కుటుంబాలకు 15 లక్షల రూపాయలు సాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

# రాజకీయాల్లోకి వస్తున్నా!

>> ఆడినంత వరకు సమాజంకోసం పనిచేస్తానని తన రిటైర్మెంట్ పంక్షన్‌లో చెప్పానని, అదే కొనసాగిస్తానన్నారు. రాజకీయాల్లోకి రావడం వెనుక ప్రజల మెరుగైన భవిష్యత్తు కోసం ప్రయత్నిస్తానన్నారు. గత అయిదేళ్లపాలనలో జగన్ పార్టీ విధ్వంసం సృష్టించిందన్నారు.జగన్ పాలనలో రాష్ట్రం కోలుకోలేని దెబ్బ తిందని, ఆర్ధిక సామాజిక విధ్వంసం కొనసాగిందన్నారు. వైసీపీ వాళ్లకు సంఘంలో ఏమాత్రం గౌరవం లేదన్నారు. జగన్ ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ రాకూడదని, ప్రజల అయిదేళ్ల ఎంతో పోగొట్టుకున్నారన్నారు. రాజకీయాలు అంటే కేవలం సంపాదన అనుకనే వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి జగన్ అంటూ విమర్శించారు. జగన్ ఒక మోనాస్టార్ అంటూ అక్రమాలు చేసే వారికి ఆయన పెద్దపీట వేశారని తెలిపారు. కులాలు, వర్గాలుగా ప్రజలను విడదీశాడని, కేవలం తన స్వార్ధం కోసం బలిపెడతాడని ఇంతటి విపరీత మనస్తత్వం కలిగిన జనగ్‌ను ఆయన వెంట ఉన్న నేతలు వీడాలని సూచించారు. తను ప్రస్తుతం ఏపార్టీలోనూ లేనని, అలా అని పార్టీ పెట్టే ఆలోచన కూడా లేదన్నారు. కోడికత్తి శ్రీనుకు తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు. తన అనుభవంతో నిలబెడతానని, జగన్ బాధితులకు అండగా ఉండడంతోపాటు జగన్ అక్రమాలు, అన్యాయాలు బట్టబయలు చేస్తానన్నారు. జగన్‌పై పోరాడే విషయంలో వ్యక్తిగతమైనది ఏమీ లేదని, జగన్ సమాజానికి చేసిన కీడుపై మాత్రమే పోరాటం చేస్తానన్నారు.

# ఐఎఎస్‌ల బదలీలు

>> ప్రధాన కార్యదర్శి జయలక్ష్మికి రెవెన్యూ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా ఐటీశాఖ కార్యదర్శి కె.భాస్కర్‌కు ఎపిహెచ్‌ఆర్డీఐ డైరెక్టర్‌గా పూర్తి బాధ్యతలు ఇచ్చారు. ఐటి కార్యదర్శి కాటంనేని భాస్కర్‌కు ఎపి హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా ముత్యాలరాజును నియమించారు. రైతు బజార్ల సిఇఒగా మాధవీలతకు,ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సంస్థ సంఘ కార్యదర్శిగా గౌతమి,ఆయుష్ డైరెక్టర్‌గా దినేష్‌కుమార్, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ నీలకంఠారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# విశ్వనగరంగా 'అమరావతి'

>> లేదు. అమరావతిలోకి బయటి ప్రాంతాల నుంచి సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుగా ఇ5, ఇ11, ఇ13, ఇ15 రహదారుల్ని విస్తరించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. డీపీఆర్‌లు రూపొందించే బాధ్యత లీ కన్సల్టెన్సీకి అప్పగించింది.

రాజధానిలో పశ్చిమ బైపాస్ రహదారి నుంచి మొదలయ్యే ఇ15 రోడ్డుని మంగళగిరిలోని పాతబస్టాండ్ వద్ద పాత మద్రాసు రహదారితో అనుసంధానిస్తారు. రాజధాని సరిహద్దు నుంచి మంగళగిరిలోని పాత బస్టాండ్ వరకు రోడ్డు పొడవు 2.3 కి.మీ.లు వస్తుంది. దీన్ని మంగళగిరిలో పాత మద్రాసు రహదారితో అనుసంధానించేందుకు అక్కడో ఫ్లైఓవర్ నిర్మిస్తారు. దానితో కలిపి మొత్తం పొడవు 3.52 కి.మీ.లు వస్తుంది.

ఇ13 రహదారి రాజధాని మాస్టర్ ప్లాన్ ప్రకారం యర్రబాలెం దగ్గర ఆగిపోతుంది. ఆ రోడ్డును ఇప్పుడు ఎయిమ్స్‌కు ఉత్తరం దిక్కు సరిహద్దుని ఆనుకుని జాతీయ రహదారి వరకు పొడిగిస్తారు. డీజీపీ ఆఫీసుకు దగ్గర్లో ఎన్‌హెచ్16తో దీన్ని అనుసంధానిస్తారు. అక్కడ ట్రంపెట్ ఆకారంలో ర్యాంప్‌లు, లూప్‌లు నిర్మిస్తారు. వాటితో కలిపి మొత్తం 7.2 కి.మీ. పొడవున రోడ్డు వస్తుంది. ఇ13, ఇ15 రహదారుల్ని రాజధాని వెలుపల భాగంలో కూడా వరద నీటి డ్రెయిన్‌లు, యుటిలిటీ డక్ట్‌లు వంటి అన్ని సదుపాయాలతో నిర్మిస్తారు.

**ఇ5, ఇ11 రహదారుల విస్తరణ :**

ఇ5, ఇ11 రహదారుల విస్తరణకు మలి దశలో టెండర్లు పిలవనున్నారు. ఈ రెండు రోడ్లను ఎన్‌హెచ్16తో అనుసంధానిస్తారు. భూసేకరణ అవసరం లేకుండా ఈ రహదారుల్ని తాడేపల్లిలోని కొండల్ని ఆనుకుని తీసుకెళ్లి ఎన్‌హెచ్16లో కలపాలన్నది ఆలోచన. ఇ5 రహదారి ప్రతిపాదిత మార్గంలో కొంత అటవీ భూమి ఉంది. అక్కడ రోడ్డు వేయాలంటే కేంద్ర అటవీ, పర్యావరణశాఖ అనుమతి కావాలి. ప్రస్తుతం సంప్రదింపుల ప్రక్రియ జరుగుతుంది. అటవీశాఖ అనుమతివ్వడాన్ని బట్టి ఆ రహదారి అలైన్‌మెంట్‌ను సిద్ధం చేయనున్నారు. ఇ11 రహదారికి సంబంధించి డిపిఆర్ సిద్ధమవుతోంది. ఆ వెంటనే దానికీ టెండర్లు పిలుస్తారు. ఇక రాజధానిలో ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించి సీఆర్‌డీఏ (క్రడా) అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలలో అమరావతి పనుల పునఃప్రారంభానికి ప్రధాని మోదీ రానున్నారు. ఈ నేపథ్యంలో సిఆర్‌డిఎ తరఫున పర్యవేక్షణ కోసం నోడల్ అధికారిగా అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌ను నియమించారు. పర్యటనకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను వేగంగా చేయడంతో పాటు ప్రధాని, ముఖ్యమంత్రి కార్యాలయాలు, జీఏడీ, గుంటూరు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకునేందుకు నియమించారు. ఈ నెల మూడో వారంలో ప్రధాని పర్యటనకు రాజధానిలోని సచివాలయం వెనక వైపు ఉన్న 120 ఎకరాల ప్రాంతాన్ని ఎంపిక చేశారు. వేదికపై నుంచి రూ.లక్ష కోట్ల విలువైన పనుల ప్రారంభంతో పాటు పెట్టుబడులకు శ్రీకారం చుట్టనున్నారు. ఎటువంటి లోపం తలెత్తకుండా సిఆర్‌డిఎలో పలువురు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వేదిక ప్రదేశాన్ని చదును చేసే బాధ్యతలను సీఈ ధనుంజయకు, పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేసే పనిని హౌసింగ్ సీఈ శ్రీనివాసులు, శిలాఫలకాలు, ఫైలాన్ ఏర్పాటు బాధ్యతలను మరో సీఈ జీవీ పల్లంరాజుకు, ఏడీసీఎల్ సీఈ ప్రభాకర్‌రావుకు అప్రోచ్ రోడ్ల మరమ్మతుల పనులు అప్పగించారు. ఐదు లక్షల ఇళ్లకు అనుమతులు ఇచ్చినట్లు గృహ సముదాయాల్లో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించి, గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలని సీఎం గతంలోనే ఆదేశించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి ఇవ్వాలని సదుద్దేశంతో గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇతర దేశాల్లోనూ పలు నమూనాలు పరిశీలించి 201419 మధ్య టిడ్కో ఇళ్లను ప్రారంభించింది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఏపీకి 7,01,481 గృహాలు మంజూరు చేయగా రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల ఇళ్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసిందన్నారు.

# ప్రధాని మోడీ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** భారత ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రంలో వచ్చే వారంతం లోపు పర్యటించే అవకాశాలున్నాయి,ఆయన పర్యటన తేది ఖరారు కావాల్సి ఉంది.అయినప్పటికి ఎరాజధానిలో ప్రధాని మోడీ పర్యటనకు సంబంధించి సిఆర్‌డిఎ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నెల మూడో వారంలో ప్రధాని పర్యటనకు రాజధానిలోని సచివాలయం వెనక వైపు ఉన్న 120 ఎకరాల ప్రాంతాన్ని ఎంపిక చేశారు. వేదికపై నుంచి రూ.లక్ష కోట్ల విలువైన పనుల ప్రారంభంతో పాటు పెట్టుబడులకు శ్రీకారం చుట్టనున్నారు. ఎటువంటి లోపం తలెత్తకుండా సిఆర్‌డిఎలో పలువురు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వేదిక ప్రదేశాన్ని చదును చేసే బాధ్యతలను సిఇ ధనుంజయకు, పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేసే పనిని హౌసింగ్ సిఇ శ్రీనివాసులు, శిలాఫలకాలు, ఫైలాన్ ఏర్పాటుబాధ్యతలను మరో సిఇ జీవీ పల్లంరాజుకు, ఎడిసిఎల్ సిఇ ప్రభాకర్ రావుకు అప్రోచ్ రోడ్ల మరమ్మతుల పనులు అప్పగించారు. ఈ నెలలో అమరావతి పనుల పునః ప్రారంభానికి ప్రధాని మోడీ రానున్నారు. ఈ నేపథ్యంలో సిఆర్‌డిఎ తరఫున పర్యవేక్షణ కోసం నోడల్ అధికారిగా అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌ను నియమించారు. పర్యటనకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను వేగంగా చేయడంతో పాటు ప్రధాని, ముఖ్యమంత్రి కార్యాలయాలు, జిఎడి, గుంటూరు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకునేందుకు నియమించారు.

# గడువు దాటితే 30 రోజుల్లో వెళ్లిపోవాలి

>> వారు ఒక్కరోజు అధికంగా ఉంటే రోజుకు 998 డాలర్లు ఫైన్, సొంతంగా వెళ్లిపోకపోతే 1,000 నుంచి 5,000 డాలర్ల ఫైన్ విధించనున్నారు. జైలు శిక్షను కూడా విధించే అవకాశం ఉందని, వారికి భవిష్యత్తులో చట్టపరమైన మార్గంలో కూడా అమెరికాలోకి ప్రవేశం లభించదని చెప్పింది. ఈ నిర్ణయం నేరుగా హెచ్1బి, విద్యార్థి పర్మిట్లపై ఉండేవారికి వర్తించదు. కానీ, సరైన అనుమతులు లేకుండా అమెరికాలో ఉండిపోయే వారిపై మాత్రం దీనిని కచ్చితంగా అమలు చేయనున్నారు.



లక్నోలో ఆదివారం జరిగిన బైశాఖి మరియు ఖల్సా సజ్నా దివస్‌లో పాల్గొన్న యుపి సిఎం ఆదిత్య నాథ్

# రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియా

>> ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదానికి గల కారణం బాణాసంచా తయారు చేస్తున్నప్పుడు మంటలు చెలరేగడంతో పెద్దయెత్తున పేలుడు జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిపారు. అగ్నిప్రమాదం ఘటన గురించి తెలుసుకున్న హోంమంత్రి అనిత హుటాహుటిన అక్కడికి వెళ్లి ఘటనా స్థలాన్ని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సహా అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి హోంమంత్రి పరిశీలించారు. అగ్నిప్రమాదంపై స్థానికులు, అధికారులతో హోంమంత్రి స్వయంగా మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సహాయక చర్యలు చేపట్టారన్నారు. చోడవరం,రావికమతం,నక్కపల్లి అగ్నిమాపక సిబ్బంది తక్షణం వచ్చి ఎగసిపడే మంటలను అదుపులోకి తెచ్చారన్నారు.

అగ్నిప్రమాదంపై సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రి లోకేశ్ ఫోన్ చేసి ఆరా తీశారని హోంమంత్రి అనిత వెల్లడించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతుందని చెప్పారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు చొప్పున పరిహారం ఇచ్చేదని.. సీఎం చంద్రబాబు మానవతా దృక్పథంతో ఇచ్చిన ఆదేశాలతో రూ.15 లక్షల పరిహారం ప్రకటిస్తున్నట్లు హోంమంత్రి అనిత తెలిపారు. బాధితుల వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని హోంమంత్రి హామీ ఇచ్చారు. ఏడుగురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని హోంమంత్రి తెలిపారు. వీరిలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. స్థానికులు, అధికారులు క్షతగాత్రులను ఘటన జరిగిన వెనువెంటనే సహాయక చర్యల్లో పాల్గొని ఆసుపత్రులకు తరలించినట్లు తెలిపారు. నర్సీపట్నం, విశాఖలోని కేజీహెచ్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని హోంమంత్రి అనిత అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తో కలిసి పరామర్శించారు.

విశాఖ పరవాడ జవహర్‌లాల్‌నెహ్రూ ఫార్మాసిటీతో పాటు అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా సంస్థల్లో చోటుచేసుకుంటున్న వరుస భారీ ప్రమాదాల నేపథ్యంలో అనకాపల్లి జిల్లాలో బర్న్ ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని హోంమంత్రి అనిత వెల్లడించారు. మండే గుణం కలిగిన ఫార్మా, రసాయన కంపెనీల్లో భద్రత ఎంత ముఖ్యమో కార్మికుల క్షేమం కూడా అంతే ముఖ్యమన్నారు. కేజీహెచ్ సిఎస్ ఆర్ బ్లాక్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాల్లో చికిత్స పొందుతున్న బాధితులను హోంమంత్రి అనిత పరామర్శించారు. దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులకు ఆమె ధైర్యం చెప్పారు. ఐదుగురు క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించే విషయంలో వైద్యులు ప్రాధాన్యత తీసుకోవాలన్నారు. ప్రమాదంలో గాయపడిన ఒక్కొక్కరినీ పలకరించి వారి ఆరోగ్య పరిస్థితిపై హోంమంత్రి అడిగి తెలుసుకున్నారు.అనకాపల్లి, అచ్యుతాపురం సెజ్ వంటి పారిశ్రామిక ప్రాంతాలున్న నేపథ్యంలో జిల్లాలో త్వరలో బర్నల్ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తామని హోంమంత్రి వెల్లడించారు. ప్రభుత్వం అండగా ఉంది..త్వరలోనే క్షేమంగా బయటకి వస్తారని వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులను హోంమంత్రి ఓదార్చారు. తన సొంత నియోజకవర్గమైన పాయకరావుపేటలో భాగమైన కోటవురట్లలో జరిగిన ప్రమాదంపై పిఎం, సిఎం, డిప్యూటీ సిఎం, ఐటీ మంత్రి లోకేశ్ వెంటనే స్పందించి ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం పట్ల హోంమంత్రి అనిత ఎక్స్ వేదికగా స్పందించి కృతజ్ఞతలు తెలియజేశారు.

# సంస్కరణలతోనే మంచి ఫలితాలు

**విజయవాడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యారంగంలోను తమ ప్రభుత్వం అత్యుత్తమ సంస్కరణలను తీసుకుని వచ్చిందని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు.ఇంటర్‌లోనే ఈ ఏడాది మనం సాధించిన ఫలితాలు ప్రభుత్వ నిర్ణయాలను బలపరుస్తున్నాయన్నారు. ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు గత దశాబ్ద కాలంలోనే ఎన్నడులేనంతగా ఈ ఏడాది అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదు చేశాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇంటర్ రెండో సంవత్సరం 69 శాతం ఉత్తీర్ణతతో గతేడాది కంటే 11 శాతం, మొదటి సంవత్సరంలో 47 శాతం ఉత్తీర్ణతతో 9శాతం పెరుగుదల నమోదైందని ఎక్స్‌లో శనివారం పేర్కొన్నారు. ఉత్తీర్ణత సాధించిన ఇంటర్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్య వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేలా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు మెరుగైన ఫలితాన్ని ఇస్తున్నాయి. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం , తరగతుల వారీ వాట్సప్ గ్రూపులు, కేంద్రీకృత మదింపు, పర్యవేక్షణ, కేర్‌టేకర్ విధానం తదితరాలు విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించడానికి దోహదం చేశాయి అని పేర్కొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత పెరిగిందని సీఎం చంద్రబాబు అన్నారు.. గత పదేళ్లతో పోల్చి చూస్తే ద్వితీయ సంవత్సరంలో ఈసారే అత్యధికంగా 69% మంది పాస్ అయ్యారు. ప్రథమ సంవత్సరం పరంగా 2016లో గరిష్ఠంగా 54% ఉత్తీర్ణులు కాగా 2015లో 47%, ఈసారి కూడా 47% ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి ప్రథమ సంవత్సరంలో 50314 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 23799 మంది పాస్ అయ్యారు. సెకండియర్‌లో 39783 మందికిగానూ 27276 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర కంటే బాలికల ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉంది. జిల్లాల వారీగా చూస్తే ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా 70%,81% ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచింది. హైస్కూల్ ప్లస్ విద్యాసంస్థల్లో ఇంటర్ ఫస్టియర్‌లో కేవలం 34% ఉత్తీర్ణత నమోదైంది.

# హైదరాబాద్ చేరుకున్న డి.సిఎం పవన్

>> వెళ్లనున్నారు. సోమవారం ఉదయం తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని తన కుమారుడు మార్క్ శంకర్ అగ్నిప్రమాదం నుంచి బయటపడినందుకు స్వామి వారికి మొక్కులు తీర్చుకోనున్నారు.

**ప్రధాని మోదీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు**

మార్క్ శంకర్ క్షేమాన్ని ఆకాంక్షించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కష్ట సమయంలో తనకు అండగా నిలిచారని, సింగపూర్‌లోని అధికారుల ద్వారా అందించిన సహాయం మరువలేనిదన్నారు. క్లిష్ట సమయంలో వారి సందేశాలు, ప్రార్థనలు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయన్న పవన్, ప్రధాని మోడీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తాను విశాఖ మన్యంలోని అడవితల్లి బాట కార్యాక్రమంలో ఉండగా తనకు ప్రమాద సమాచారం అందిందని, సకాలంలో జోక్యం చేసుకుని తన కుటుంబానికి అపారమైన శక్తిని, ఉపశమనాన్ని కలిగించారంటూ ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

**హిందూ సాంద్రాయాలు పాటిస్తా:డిక్లరేషన్ ఇచ్చిన డిప్యూటీ సిఎం భార్య**

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ భార్య అన్నాలెజినోవా ఆదివారం రాత్రి కుమారుడు మార్క్‌శంకర్‌తో కలసి తిరుమలకు వచ్చారు.గాయత్రి సదన్ విశ్రాంతి భవనం వద్ద డిప్యూటీ ఇఒ హరీంద్రనాథ్ స్వాగతం పలికారు. కాగా ఆమె హిందూ సాంప్రదాయం పాటిస్తూ డిక్లరేషన్‌పై సంతకం చేశారు. ఆమె తలనీలాలు సమర్పించారు. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదం బారినుండి సురక్షితంగా బయటపడి కోలుకోవడంతో ఆమె ఆపదమొక్కులవాడికి మొక్కులు తీర్చుకునేందుకు చేరుకున్నారు.

# అందరికీ అందుబాటులో ఆధునిక వైద్యం

>> ఎంపిక చేయడం జరిగింది. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా మంగళగిరి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని తీర్చిదిద్దుతాం, వంద పడకల ఆసుపత్రి నిర్మాణంపై అనేకసార్లు సమీక్షించి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాతే భవన నమూనాలు ఖరారు చేయడం జరిగింది. జోనింగ్, స్టాఫింగ్, మెరుగైన సౌకర్యాలు అందిస్తాం. అమరావతి పనులు కూడా ప్రారంభం అయ్యాయి. ఆర్థో, డయాలసిస్ సెంటర్ వంటి వాటిని అందుబాటులోకి తీసుకువస్తాం. తలసేమియా, డీ అడిక్షన్ సెంటర్ ను కూడా ఏర్పాటుచేస్తాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించాలని నిర్ణయించారు. అందులో భాగంగా రెండో కేబినెట్ మీటింగ్ లోనే మంగళగిరికి వంద పడకల ఆసుపత్రిని కేటాయించడం జరిగింది.అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల ముందు మంగళగిరి ప్రజలకు ఇచ్చిన హామీలను పద్ధతి ప్రకారం నెరవేరుస్తున్నాం. మంగళగిరి ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తాం. అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. అందులో భాగంగానే మంగళగిరిని అభివృద్ధి చేస్తాం.

**మంగళగిరి అన్ని రంగాల్లో నెం.1గా ఉండాలి**

మంగళగిరి అన్ని రంగాల్లో నెం.1గా ఉండాలి. ప్రజలపై కూడా బాధ్యత ఉంది. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించాలి. మంగళగిరిని చెత్తరహిత నగరంగా నిలపాలి. మంగళగిరిలో వెయ్యి టన్నుల చెత్త బయటపడింది. స్వచ్ఛతలో కూడా మంగళగిరి నెం.1గా ఉండాలంటే ప్రజల సహకారం కావాలి. పారిశుద్ధ్య కార్మికులు కూడా బాగా పనిచేస్తున్నారు. ఏడాది సమయం ఇస్తున్నా. తర్వాత నేనే కర్ర పట్టుకుని తిరుగుతా. ఎవరి ఇంటి ముందైనా చెత్త ఉంటే వారితో పాటు నేను కూడా చెత్త ఎత్తుతా. స్వచ్ఛత, ఆరోగ్యంలో నెం.1గా ఉండాలంటే ప్రజల సహకారం చాలా అవసరం. మంగళగిరి ప్రజలకు డయాబెటిస్, హైపర్ టెన్షన్, కొలెస్ట్రాల్ చాలా ఎక్కువగా ఉంది. ఎన్టీఆర్ సంజీవని క్లినిక్‌ల ద్వారా ఈ విషయం తెలిసింది. ప్రతిరోజూ వాకింగ్ చేయాలని చెప్పా. పార్కులు కావాలని అడిగారు. ఇటీవల ఎస్ఎల్ఎన్ పార్కును ప్రారంభించాం. మంగళగిరిలో 30 పార్కులు, చెరువులు అభివృద్ధి చేస్తాం. కల్యాణ మండపాలు నిర్మిస్తాం. వంద పడకల ఆసుపత్రిని ఏడాదిలోగా పూర్తిచేస్తాం. నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా నిర్మిస్తాం. భారతదేశానికే ఆదర్శంగా వంద పడకల ఆసుపత్రిని తీర్చిదిద్దుతాం. మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కల. ఆ కలను నెరవేర్చే అవకాశం మనకు వచ్చింది. అందరి సహకారంతో నిర్మిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి, తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహా, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, హాస్పిటల్ డెవలప్ మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్, డాక్టర్ మాగంటి ప్రసాద్, డాక్టర్ రాజు నాయుడు, డాక్టర్ శ్రావణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 14-04-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.పాడ్యమి ఉ.8.25
స్వాతి రా.12.13
వర్జ్యం ఉ.6.30-8.18
దు.ము.12.34-1.24, 2) ము.3.04-3.54
శుభసమయం ; ఉ.9.20-10.15
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ఋణవత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి. ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

**వృషభం:** బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కారించుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం కొంత ఊరట చెందుతారు. ఖర్చులు పెరుగుతాయి.

**కర్కాటకం :** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోండి.ప్రయాణాలు. వస్తుసేకరణ.

**సింహం:** కీలక నిర్ణయాలలో నిర్లక్ష్యం తగదు. ఖర్చులు పెరిగినా అధిగమించి ముందుకుసాగుతారు.

**కన్య :** దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధన, వస్తువులు లాభిస్తాయి. వాహనయోగం.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది. కొత్తకార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు.

**వృశ్చికం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఊహించని సంఘటనలు.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మకరం:** విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

**కుంభం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**మీనం :** బంధువర్గంతో ఏర్పడిన తగాదాలు పరిష్కారించుకుంటారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మండుతున్న ఎండలు

>> శ్రీకాకుళం జిల్లాలో 7 మండలాలు, విజయనగరం 11, పార్వతీపురం మన్యం 10, ఏలూరు జిల్లాలో భీమడోలు, ఎన్టీఆర్ జిల్లాలో జి.కొండూరు మండలాల్లో తీవ్ర వడగాలులు, అలాగే 67 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఇకసోమవారం 12 మండలాల్లో తీవ్ర, 19 మండలాల్లో వడగాలులు వీచేందుకు అవకాశం ఉందన్నారు.

ఇప్పటి వరకు కడప జిల్లాలోని అట్లూరులో అత్యధికంగా 41.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ఆ తర్వాత ప్రకాశం జిల్లాలోని గుంటుపల్లిలో 41.2 డిగ్రీలు, నంద్యాల జిల్లా దొర్నిపాడు, పల్నాడు జిల్లా రావిపాడు 40.9 డిగ్రీలు, నెల్లూరు జిల్లా అయ్యపరెడ్డిపాలెంలో 40.7డిగ్రీలు,, ఏలూరు జిల్లా కామవరపుకోట, చిత్తూరు జిల్లా తవణంపల్లెలో 40.6 డిగ్రీలు, బాపట్ల జిల్లా వల్లపల్లిలో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా మరో 25 ప్రాంతాల్లోనూ 40డిగ్రీలు, పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణా సంస్థ వెల్లడించింది.

ఇదే సందర్భంలో ఆగ్నేయ మధ్యప్రదేశ్, పరిసర ప్రాంతాలలో విదర్భ మీదుగా తెలంగాణ మధ్య ప్రాంతాల వరకు ఉన్న ఉపరితల ఆవర్తనం నుండి ఒక ద్రోణి సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో కొనసాగుతోంది. కోస్తా ఆంధ్ర ప్రదేశ్, యానాం మధ్య ప్రాంతాలు, దాని పరిసర ప్రాంతాలలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో కొనసాగుతోంది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఎలా ఉన్నాయంటే .. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ - యానాంలలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 40-50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. సోమవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 30-40 కి.మీ. వేగం తో వీచే అవకాశం ఉంది.

మంగళవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఈదురు గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లలో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. సోమవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది. రాయలసీమలో ఈరోజు, రేపు, ఎల్లుండి తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో రాగల రెండు రోజుల్లో వేడి, తేమతో కూడిన వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. తరువాత మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే అవకాశముంది. రాయలసీమలో రాగల రెండు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలో గణనీయమైన మార్పులేదు. తర్వాతి మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పముగా తగ్గే అవకాశముంది.

# ఆరోపణలపై క్రిమినల్ కేసు!

>> టిటిడిని టార్గెట్ చేయడంతోదేవుడు ఆయనను శిక్షిస్తాడని వ్యాఖ్యానించారు. గత పాలకమండలి ఇంజనీరింగ్ విభాగంలో అన్నీ అక్రమాలేనని, ఇప్పటికీ కాంట్రాక్టర్లు మేము కమీషన్లు ఇచ్చాము బిల్లులు రాలేదని చెబుతున్నారని నాయుడు తెలిపారు. తిరుపతిలోని టిటిడి గోశాలలో వందల ఆవులు మృతిచెందాయని, ఈ ఘటన గోప్యంగా ఉంచారని ఇటీవల భూమన కరుణాకర్‌రెడ్డి మీడియాతో వ్యాఖ్యలు చేయడం పెద్ద సంచలనం కలిగించింది. దీనిపై ఆదివారం మధ్యాహ్నం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, రాష్ట్ర యాదవకార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, శాప్స్ ఛైర్మన్ ఎ.రవినాయుడు, టిడిపి మీడియావిభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, నగరపాలకసంస్థ ఉపమేయర్ ఆర్‌సి మునికృష్ణతో కలసి నిజనిర్ధారణ కమిటీగా ఎస్వీగోశాలను తనిఖీ చేశారు. టిటిడిపై,ఎస్వీగోశాలలో ఆవులు మృతిచెందాయనే అసత్య ఆరోపణలను ఖండించారు. గత ఐదేళ్లలో టిటిడి ధార్మికసంస్థను ధనార్జనసంస్థగా మార్చుకున్నారని ఆరోపించారు.టిటిడిని అప్రతిష్ఠ చేయడానికి వైఎస్సార్సీ నేతలు పాల్పడటం సిగ్గుచేటన్నారు.కమీషన్ల కోసం భక్తులకు వసతిసౌకర్యంగా ఉన్న భవనాలను కూలదోసిన ఘనత కరుణాకర్‌రెడ్డిదేనన్నారు. గోవుతో రాజకీయం చేయడం మంచిదికాదని హెచ్చరించారు. కల్తీనెయ్యి కేసును మరుగునపెట్టడానికి టిటిడిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవాచేశారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని టిటిడిపై, ఎస్వీ గోశాలపై, ఛైర్మన్ బిఆర్‌నాయుడుపై అసత్య ఆరోపణలు చేస్తున్న భూమనపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని తనదైన శైలిలో ప్రకటించారు.

# అబద్ధాలతో బురదజల్లితే రాజకీయజీరో అవుతావు

## దైవసంస్థపై ఆరోపణలు చేస్తే ఊరుకోను

### ఎస్వీగోశాల తనిఖీల్లో టిటిడి ఛైర్మన్ నాయుడు





**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన హిందూ ధార్మికసంస్థపై, టిటిడి ఎస్వీగోశాలలో గోవుల సహజమరణాలను సొంత రాజకీయాల కోసం కుట్రలు చేస్తే రాజకీయ జీరో అవుతావని మాజీ ఛైర్మన్,వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి తీరుపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మండిపడ్డారు. ప్రతిరోజూ అసత్యఆరోపణలు, పచ్చి అబద్దాలతో దైవసంస్థపై బురదజల్లి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తే దేవుడు క్షమించడని అన్నారు. తనపై వ్యక్తిగతంగా ఏమైనా ఉంటే ఆరోపించుకోగానీ దైవసంస్థమీద అసత్యఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. తిరుపతి ఎస్వీ గోశాలలో వంద గోవులు మరణించాయని మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై ఆదివారం మధ్యాహ్నాం టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు గోశాలను తనిఖీ చేశారు. టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, రాష్ట్ర యాదవకార్పొరేషన్ ఛైర్మన్ నరసింహాయాదవ్, శాప్స్ ఛైర్మన్ ఎ.రవినాయుడు, టిడిపి మీడియావిభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, నగరపాలకసంస్థ ఉపమేయర్ ఆర్‌సి మునికృష్ణతో నిజనిర్ధారణ కమిటీతో పరిశీలించారు. అక్కడ ఆవులను ,వాటికి అందుతున్న పచ్చిగడ్డి, దాణా, మంచినీరు తదితర వాటిని స్వయంగా గమనించారు. అంతేగాక గడ్డిని ఆవులకు తినిపించారు. ఆవుదూడను చేతిలోకి తీసుకుని రైతుబిడ్డగా నిరూపించారు. తనకు వ్యవసాయం, రైతు కష్టాలు తెలుసునని, గోమాతలను దేవునితో సమానంగా పూజిస్తామని అన్నారు. గోశాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని, గోవులకు ఎప్పటికప్పుడు దాణా, అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ఎక్కడో మృతిచెందిన గోవుల ఫోటోలను,గత పాలనలో గోశాలో మరణించిన గోవుల ఫోటోలను చూపి అసత్యప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో టిటిడి ఛైర్మన్‌గా ఉన్న ఆయన కాలంచెల్లిన మందులు, పురుగులు పడ్డదాణా పంపిణీచేసినట్లు ఆయన పాలనలో విజిలెన్స్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. ఈ సందర్భంగా అప్పటి విజిలెన్స్ నివేదికను, అందుకు సంబంధించిన ఫోటోలును మీడియాకు చూపారు. గోశాలలో గోవుల సహజమరణాలను రాజకీయాల కోసం వాడుకునే కుట్రదారుడు భూమన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు దేవుడంటే భయంలేదని, భక్తిలేక రోజూ ఏదో ఒక అబద్ధం మాట్లాడుతున్నారని, టిటిడి సంస్థపై ఏదైనా నిజాలు చెబితే సరిదిద్దుకుంటామన్నారు. తాను టిటిడి ఛైర్మన్ అయ్యాక ఒక్కరూపాయి కూడా అవినీతి మరకలేకుండా ఛైర్మన్‌గా సేవలందిస్తున్నానని బిఆర్‌నాయుడు తెలిపారు. గతంలో కమీషన్ల ఛైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి అపకీర్తి మూటగట్టుకున్నారని విమర్శించారు. గోవులన్నీ ఆరోగ్యంగానే ఉన్నాయని, వాటికి పౌష్టికాహారమైన దాణా కూడా అందిస్తున్నారని తెలిపారు.

# తిరుమల సమాచారం



## భూమనకు మంచి బుద్ధిని ప్రసాదించుస్వామి

### అవాస్తవాలు ప్రచారంచేస్తే మూల్యం చెల్లించుకోకతప్పదు

### అలిపిరిలో టిడిపి నేతలు గోపూజలు

**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** దేవుడితో రాజకీయాలు చేస్తున్న గత ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డికి మంచి బుద్ధిని ప్రసాదించాలని, అవాస్తవాలు ప్రచారంచేస్తున్న ఆయన తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని టిడిపి నాయకులు హెచ్చరించారు. ఎస్వీగోశాలలో గోవులు మరణించాయని అసత్య ప్రచారంచేసిన ఆయనకు "కరుణ" లేదని, దేవునితో కూడా రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. గోశాలలో ఆవులు మరణించాయనే ఆరోపణలపై తిరుపతి టిడిపి నాయకులు రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, బుల్లెట్‌రమణ, మధుబాబు, రఫీ, ఐఎస్ ఖాజా, లక్ష్మీ, ప్రమోద్‌తో కలసి అలిపిరి పాదాలమండపం వద్దవున్న గోశాలలో గోవులకు పూజలు చేసి నమస్కరించారు. ఆయనకు కరుణామయుడు పూనినట్లు టిటిడిపై అసత్యఆరోపణలు చేసి పాపం మూటగట్టుకున్నాడన్నారు. ఆయనకు మంచి బుద్ధిని ప్రసాదించాలని వేడుకున్నారు.

## ఆటోను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

# ముగ్గురు దుర్మరణం:11 మందికి తీవ్ర గాయాలు

### సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి





గాయపడిన వారిని పరామర్శిస్తున్న మున్సిపల్ ఛైర్మన్

**హిందూపురం ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** శ్రీసత్యసాయిజిల్లా పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొడికొండ శిర జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న 14 మందిలో ముగ్గరు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం చెందగా 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. గుడికి వెళ్లి వస్తున్న పెను ప్రమాదానికి గురైన భక్తులు వివరాలు ఇలా ఉన్నాయి. పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం దొడగట్ట గ్రామానికి చెందిన 14 మంది అపే ఆటోలో హిందూపురం మండలం కొటిపి గ్రామంలోని శ్రీ చౌడేశ్వరి దేవాలయానికి శనివారం వచ్చి పూజలు, భజనలు నిర్వహించారు. చైత్ర పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు వీరంతా ఇక్కడికి వచ్చారు. ఆలయంలోనే రాత్రి నిద్ర చేసి తెల్లవారుజామున దొడగట్ట గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో పరిగి మండలం ధనాపురం గ్రామం పరిసరాల్లోకి రాగానే ఆటోను గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. అత్యంత వేగంగా వచ్చి వాహనం ఢీకొన్నందున ఆటో నుజ్జునుజు అయి పక్కనే కంపచెట్లలో పడిపోగా అందులో ఉన్న 14 మంది చెల్లా చదురుగా పడిపోయారు. అలివేలమ్మ(40), సాకమ్మ(70), వెంకటలక్ష్మ మ్మ(60)లు ఘటనాస్థలిలోనే దుర్మరణం చెందారు. గాయపడిన 11 మందిలో ఏడుగురు పరిస్థితి విషమంగా ఉండగా నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రుల వివరాలు అంజన్ రెడ్డి(53), ప్రమీల(43), పాపమ్మ(65), విజయ్(18), బాబు(34), అభినవ్ (14), అనిల్ కుమార్(12), అంజనమ్మ(60), రూప(19), యశ్వంత్ రెడ్డి(20), సుజాత(45) ఉన్నారు. దుర్ఘటన సమాచారం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు హుటా హుటిన అక్కడికి చేరుకుని క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సహాయక చర్యల్లో పోలీసులు పాల్గొన్నారు. పరిగి ఎస్ఐ రంగడు మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టామని వివరించారు. హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ డిఇ రమేష్‌కుమార్ పలువురు నాయకులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలను అందించాలని డాక్టర్లకు సూచించారు. అదే విధంగా ఎంపీ పార్థసారథి, ఆర్.డి.ఓ. ఆనంద్ క్షతగాత్రులను పరామర్శించారు. ఘోర రోడ్డు ప్రమాదం ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

## శ్రీవారి సేవలో మీనాక్షిచౌదరి



**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సినీనటి మీనాక్షిచౌదరి అనుచరులతో కలసి దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ఆలయంలోనికి చేరుకుని స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు దర్శనానంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన మీనాక్షిచౌదరిని అభిమానులు చుట్టుముట్టి సెల్ఫీలకోసం ఎగబడ్డారు. ఇటీవల ఆమె సంక్రాంతికి వస్తున్నాం చిత్రంతో ప్రసిద్ధికెక్కింది. రానున్న రోజుల్లో పలు క్రేజీ ప్రాజెక్టులు ఎదురు చూస్తున్నాయని అన్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి





**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వ రస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కల గాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక సిజె జస్టిస్ సుజోయ్‌పాల్, మహారాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, గుజరాత్ జస్టిస్ మానవేంద్రరాయ్ వేర్వేరుగా తిరుమలకు వచ్చారు. ఉదయం ప్రోటోకాల్ విఐపి బ్రేక్ దర్శనంలో ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులుస్వామివారితీర్థప్రసాదాలు అందజేశారు.



## కుమారుడు మార్క్‌శంకర్‌తో తిరుమలలో అన్నాలెజినోవా

**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ భార్య అన్నాలెజినోవా ఆదివారం రాత్రి కుమారుడు మార్క్‌శంకర్‌తో కలసి తిరుమలకువచ్చారు. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదం బారినుండి సురక్షితంగా బయటపడి కోలుకోవడంతో ఆమె ఆపద మొక్కులవాడికి మొక్కులు తీర్చుకునేందుకు చేరుకున్నారు. గాయత్రి సదన్ విశ్రాంతి భవనం వద్ద డిప్యూటీ ఇఒహరీంద్రనాథ్ స్వాగతం పలికారు. ఆమె తలనీలాలు సమర్పించుకుని, సోమవారం ఉదయం కుమారుడుతోకలసి శ్రీవారిని దర్శించుకుంటారు. టిటిడిఅధికారులు ఏర్పాట్లు చేశారు.

## ఎంబిబిఎస్ విద్యార్థుల మాల్ ప్రాక్టీస్‌పై విచారణ

**విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** సిద్ధార్థ వైద్య కళాశాలల్లో మళ్ళీ ఎంబీబీఎస్ విద్యార్థుల మాల్ ప్రాక్టీస్ కలకలం రేపింది. ఈ వ్యవహారంపై ఎన్టీఆర్ ఆరోగ్య.వైద్యవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఇటీవల జనరల్ మెడిసిన్ పరీక్ష రాస్తూ పట్టుబడ్డ ముగ్గురు విద్యార్థులు పట్టుబడ్డారు. నిన్న కుడా కమ్యూనిటీ మెడిసిన్ పరీక్ష రాస్తూ ఇద్దరు విద్యార్థులు పట్టుబడ్డారు. మాల్ ప్రాక్టీస్ కు పాల్పడిన విద్యార్థులను ఎన్నారై, నిమ్రా కళాశాల విద్యార్థులుగా గుర్తించారు. 160 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుండగా ఇద్దరు పట్టుబడ్డారు. ఇటీవల ఘటనతో యునివర్సిటీ స్పెషల్ స్క్వాడ్‌ను రంగంలోకి దించింది. స్క్వాడ్ తనిఖీల్లో స్లిప్పులతో దొరికిపోయారు. ఇద్దరు విద్యార్థులు, విద్యార్థుల జవాబు పత్రాలను గుర్తింపు కార్డులను ఇన్విజిలెటర్లు స్వాధీనం చేసుకున్నారు. జవాబు పత్రాలను మాల్ ప్రాక్టీస్ కమిటీకి అధికారులు పంపించారు. ఈ నెల 21వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. వరుస మాల్ ప్రాక్టీసు ఘటనలతో ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఈ క్రమంలో మెడికల్ పరీక్షల్లో స్క్వాడ్,ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసారు. అయితే ఈ వ్యవహారం ఎంబీబీఎస్ పరీక్షల్లో జరగడం రివాజుగా మారింది. ముందుగానే మాట్లాడుకుని విద్యార్థులకు కొన్ని విద్యాసంస్థలు మాల్ ప్రాక్టీస్‌కు ప్రోత్సహిస్తు న్నాయనే అభియోగాలున్నాయి. ఈ వ్యవహారంపై హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ సీరియసయి విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

## భూమనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

### కూటమి నేతలు టిటిడి ఛైర్మన్ నాయుడుకు విజ్ఞప్తి



**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఎంతో పవిత్రమైన ఎస్వీ గోశాలపై తప్పుడు ఆరోపణలు చేసిన, టిటిడి ప్రతిష్టను దిగజార్చేలా ఫోటో మార్ఫింగ్‌తో అబద్ధపు వ్యాఖ్యలు గుప్పించిన మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని టిడిపి,జనసేన,బిజెపి కూటమి నేతలు కోరారు. ఈమేరకు ఆయనపై క్రిమినల్ కేసుతో బాటు విచారణ చేయించి అరెస్టుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం గోశాలను తనిఖీ చేసిన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు కూటమి నేతలు పులివర్తినాని, భానుప్రకాశ్‌రెడ్డి, నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మ, రవినాయుడు, ఆర్‌సి మునికృష్ణ ఈ మేరకు ఛైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన, ఫోటోలు మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేయడం దారుణమని,దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## బాణసంచా ప్రమాదంపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

### ఘటనపై అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీ, హోంమంత్రి అనితతో ఫోన్‌లో మాట్లాడిన సిఎం

**విజయవాడ, ఏప్రిల్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** అనకాపల్లి జిల్లా, కోటవురట్లలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని ఆరుగురు కార్మికులు మృతి చెందడంపై సీఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, హోంమంత్రి అనితతో సీఎం ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అగ్నిప్రమాద సమయంలో కర్మాగారంలో ఎంతమంది కార్మికులు ఉన్నారని, వారి పరిస్థితి ప్రస్తుతం ఎలా ఉందని సీఎం ఆరా తీశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలని అన్నారు. ఘటనపై విచారణ చేసి తనకు నివేదించాలని ఆదేశించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అధికారులు సీఎంకు వివరించారు. అత్యవసరమైన అన్ని రకాల వైద్య సేవలు బాధితులకు అందేలా చూడాలని, బాధితుల ఆరోగ్య పరస్థితిని తనకు ఎప్పటికప్పుడు నివేదించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

**బాణా సంచా వైద్య ఆరోగ్య శాఖామంత్రి దిగ్భ్రాంతి**

కోటవురట్ల బాణసంచా తయారీ కేంద్రం అగ్ని ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంపై వైద్య ఆరోగ్య శాఖామంత్రి దిగ్భ్రాంతివ్యక్తం చేసారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై ఆరా తీసిన మంత్రి సత్యకుమార్ యాదవ్అనకాపల్లి జిల్లా, కోటవురట్లలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని ఆరుగురు కార్మికులు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేసిర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలదించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుం టామన్న మంత్రి గాయ పడిన వారిలో ఆందోళనకరంగా ఉన్న ఇద్దరికి యుద్ధ ప్రాతిపదికన చికిత్స అందించాలని ఆదేశించిన మంత్రి అన్ని రకాల అత్యవసర వైద్య సేవలు బాధితులకందేలా చూడాలన్న మంత్రి సత్యకుమార్ యాదవ్బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని వైద్యాధికారుల్ని ఆదేశించారు.

## గుంటూరులో 11 మంది పోలీస్‌లను సస్పెండ్ చేయడం అరాచకానికి నిదర్శనం: పేర్ని నాని

**విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు కక్షసాధింపులకు ఇచ్చిన ప్రాధాన్యత,వాస్తవాలను గుర్తించడానికి ఇవ్వరని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) ఆరోపించారు. మచిలీపట్నం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుంటూరులో 11మంది పోలీస్‌లను సస్పెండ్ చేయడం చేస్తూ కూటమి పాలన అర్థం అవుతోందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీసులు ఈ చర్యలు గుర్తించాలని ఆయన అన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో అధికారులను వాడుకొని వదిలేయడం సర్వసాధారణమని ఎస్పై, సిఐలు గమనించాలని ఆయన అన్నారు. చంద్రబాబు ఎవరినైనా ఎర వేస్తాడు, ఎవరినైనా బలిచేస్తాడని ఘాటు వ్యాఖ్యలు చేసారు. అధికారి, బంధువు, పోలీస్, కార్యకర్త ఇలా ఎవరైనా చంద్రబాబుకి ఒకటే. కార్యకర్తను మెప్పించడానికి 11 మందికి పనిష్మెంట్ ఇవ్వడం ఏంది? రెడ్ బుక్ చూసో, లోకేష్ మాటలను చూసో చంద్రబాబు మాటలను చూసో ఓవరాక్షన్ చేసేవారు ఉన్నారని ఆయన అన్నారు. దొంగ కేసులు పెట్టడం కొట్టడం తిట్టడం చేస్తున్నారు. జాగ్రత్తగా ఉండండని ఆయన అన్నారు. ఈ తండ్రి కొడుకులను పవన్ కల్యాణ్ ను నమ్ముకుంటే మీకు ఏ గతి పడుతుందో మనకు పోలీస్‌లను చూస్తే అర్థమవుతుందని ఆయన తెలిపారు. మీరు హుందాతనం మర్చిపోయి. రెడ్ బుక్ రచయిత లోకేష్ ను చూసుకొని అడ్రస్ తెలియని పవన్ కల్యాణ్ చూసుకొని మీరు రెచ్చిపోతే తిప్పలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. కూటమి కార్యక ర్తలు మీరు జెండాలు మోయండి తప్పులేదు. పార్టీకి పనిచేయండి. కానీ మీకు విలువ లేదు, దిక్కులేదని అన్నారు. ఎమ్మెల్యేలు దోచుకునే పనిలో వారు ఉన్నారని అలాగే పవన్ కల్యాణ్ కూడా దోచుకునే పనిలో వారు ఉన్నారని పేర్ని నాని ఘాటు వ్యాఖ్యలు చేసారు.

## గోవుల మృతిపై సుప్రీంకోర్టుకు సుబ్రమణ్యస్వామి

### పిల్ దాఖలుకు కసరత్తు

**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో ఎంతో పవిత్రంగా నిర్వహిస్తున్న ఎస్వీ గోశాలలో వందల గోవులు మృతి చెందాయని, ఈ ఘటనను గోప్యంగా ఉంచారని వైసిపి నేత,మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపణలపై నిజానిజాలు కోసం సీనియర్‌న్యాయవాది, మాజీ ఎంపి సుబ్రమణ్యస్వామి సంచలన నిర్ణయం ప్రకటించాడు. గోశాలలో గోవులు ఎన్ని ఎలా మరణించాయనే వాస్తవం తెలియాలని, దీనిపై ఇప్పటికే కూటమి టిడిపి, బిజెపి, వైసిపి మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం నేపధ్యంలో సుబ్రమణ్యస్వామి సుప్రీంకోర్టుకు వెళ్ళనున్నారు. గోవుల మృతి విషయం మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డిద్వారా తెలిసిందని, దీనిపై మరింత సమాచారం సేకరిస్తున్నానని సామాజిక మాధ్యంలో ప్రకటించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 48ప్రకారం గోసంరక్షణ ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. పూర్తిసమాచారంతో త్వరలోనే పిల్ దాఖలు చేస్తానని పేర్కొన్నారు.

## బాణసంచా ప్రమాదంపై జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** అనకాపల్లి జిల్లాలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంపై వైసిపి అధినేత వైఎస్.జగన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పలువురు మరణించడం, మరికొందరు తీవ్రంగా గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు. మరణించినవారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ ప్రమాదంలో మరణించిన, గాయపడినవారి కుటుంబాలకు తోడుగా నిలవాలని వైసిపి నాయకులకు సూచించారు.

క్షతగాత్రులకు మంచి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలు తిరిగి కోలుకునేలా అన్నిరకాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో సహాయక చర్యలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు వైఎస్ జగన్ ఆదేశాలిచ్చారు.

## రేపటి నుంచి ముత్యాలమ్మ జాతర



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంలో శక్తి నిలయాలుగా బాసిల్లుతున్న ఆలయాల్లో ఒకటైన ముత్యాలమ్మ ఆలయంలో సాంప్రదాయపద్ధతుల్లో జాతర ఉత్సవం ఆదివారం రాత్రి చాటింపుతో జాతర ప్రారంభం అయ్యింది. ఈనెల 15వ తేదీన మంగళవారం ఉ.8గం.నుంచి 9గం.వరకు గెరిగ ఉత్సం, మైలముగ్గ, సాయంత్రం శేషపాన్పుముగ్గ, 16న ఉదయం 9గం.లకు పోతురాజు ముగ్గ, మద్యాహ్నం 12గంటలకు అన్నదానం, సాయంత్రం 3గం.లకు రేణుకాదేవి ముగ్గ, రాత్రి మహాకుంభం, 17న ఉదయం 8గంటలకు ముత్యాలమ్మ ముగ్గ, గంగపెట్టె ఊరేగింపు, రాత్రి 8గం.లకు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

**మైలు ముగ్గలో అమ్మవారి దర్శనం ప్రత్యేకం:** ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని మైలు ముగ్గగా తీర్చిదిద్దనున్నారు. ఈ మైలుముగ్గకు విశేష పూజలను సాంప్రదాయపద్ధతుల్లో నిర్వహించుటకు సన్నాహాలు చేపట్టనున్నారు. అమ్మవారి జాతరను పురస్కరించుకొని స్థానిక మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఆలయ ఆవరణంలో పొంగళ్ళు పెట్టి సాంప్రదాయపద్ధతుల్లో మొక్కులు చెల్లించుకోవడంతో పాటు ఆలయం ఆవరణలో విచ్చేసిన భక్తులకు అంబళ్ళు పంపిణికి ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ నలుమూలల నుండి భక్తజనాలు తరలి వచ్చి అమ్మవారి దివ్య దర్శనాన్ని దర్శించుకొని పూజలు జరిపించుకొనుటకు సన్నాహాలు చేపట్టారు.

## గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ స్వామిసేవకుడే

### భక్తులందరికీ మంచికలగాలి

### మాజీ సిఎస్ ఎల్‌వి సుబ్రమణ్యం



**తిరుమల,ఏప్రిల్ 13ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆస్థానవిద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి అన్నమయ్య కీర్తనలను స్వరపరిచిన భక్తుడని, ఆయన లేని లోటు ఊహించుకోలేనిదని మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రమణ్యం అన్నారు. ఆధ్యాత్మికభావంతో టిటిడిలో వెయ్యికిపైగా అన్నమాచార్య సంకీర్తనలకు స్వరకల్పనచేసిన ఘనత ఆయనదేనన్నారు. అన్నమయ్య రచనలను వేల సంఖ్యలో గానం చేసి బాలకృష్ణప్రసాద్ ప్రసిద్ధులయ్యారని అన్నారు. తిరుమలలో భక్తులకు సౌకర్యాలు మెరుగయ్యాయని, అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాల నాణ్యత ఎంతో మెరుగుపడ్డాయని భక్తులు ఆనందం వ్యక్తం చేయడం సంతోషంగా ఉందన్నారు. టిటిడి అధికారులు మరింతగా భక్తుల సేవలో తరించాలని ఆయన సూచించారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వార్త

శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు, అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.

-మహాత్మాగాంధీ

# కాటేస్తున్న కల్తీ పాలు


మానవుడికే కాదు పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి సంకటంగా మారుతున్న కల్తీని నిరోధించేందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. దేశంలో కల్తీ రానురాను పెరిగిపోతున్నది. తాగే నీటిలో కల్తీ, పప్పులో కల్తీ, ప్రాణాపాయం నుండి కాపాడే మందుల్లో కల్తీ, చివరకు పౌష్టికాహారంగా వయసుతో ప్రమేయం లేకుండా పసిపిల్లల నుండి వృద్ధుల వరకు సేవించే పాలల్లో కల్తీ, అదీ ఇదీ అని తేడాలేకుండా మొత్తం కల్తీమయంగా మారిపోతున్నది. మానవ మనుగడనే ప్రశ్నార్థకం చేసే సూచనలు కన్పిస్తున్నాయి. ఇంత ప్రమాదంగా మారుతున్నా పొగమంచులా అంతటా విస్తరిస్తున్నా అడిగేవారు,అడ్డగించేవారు కరవైపోతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అవినీతికి, కల్తీకి అవినాభావ సంబంధం ఉంది. దీనిని అరికట్టేందుకు ఎన్నో చట్టాలున్నాయి. ఆ చట్టాలు అమలు చేసి కల్తీ జరగకుండా నిరోధించేందుకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది అధికారులు ఉన్నారు. కోట్లాది రూపాయల జీతభత్యాలు తీసుకుంటున్నారు. కానీ కల్తీని నియంత్రించడం అటుంచి రోజురోజుకు పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఈ కల్తీ భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా మానవ జీవనానికి సవాల్‌గా మారుతున్నా మనదేశంలో అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. కొందరు దళారులు, వ్యాపారులు లాభాలకోసం పప్పుదినుసులు, మసాలాలు, నిత్యావసర వస్తువుల సరుకుల్లో కల్తీ చేస్తున్నారు. గత నెలలో హైదరాబాద్‌లో ఏకంగా కుళ్లిపోయిన మాంసం ఏకంగా క్వింటాళ్ల కొద్దీ అధికారుల దాడుల్లో పట్టుబడ్డాయి. ఈ మాంసం కుళ్లిన వాసన రాకుండా వెనిగర్ లాంటివి చల్లి హోటళ్లకు సరఫరా చేస్తున్నారు. ఇది ఏనాటి నుంచో జరుగుతున్నట్లు సమాచారం. ఇక పాలల్లో కల్తీ అదుపు లేకుండాపోతున్నది. వాస్తవంగా కల్తీ అడ్డుకట్ట ప్రమాణాల చట్టం 2006లోనే తీసుకువచ్చినా అమలు విషయం అంతగా పట్టించుకునేవారే లేకుండాపోయారు. భారత్ ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ అమలు గూర్చి దాదాపు మరిచిపోయారనే చెప్పొచ్చు. 1947లో వంటనూనెల నియంత్రణ చట్టం 1995లో నిత్యావసర సరుకుల నియంత్రణ చట్టం అన్నింటికంటే ముఖ్యంగా 1954 నాటి ఆహార కల్తీ నిరోధక చట్టాన్ని దాదాపు మరిచిపోయారనే చెప్పొచ్చు. ఇక పాలల్లో కల్తీ ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయిందనే చెప్పొచ్చు. డిమాండ్‌కు తగినట్లు ఉత్పత్తి లేకపోవడంతో ఆ వ్యత్యాసాన్ని తీర్చేందుకు రకరకాల మార్గాల్లో కృత్రిమ పాలను తయారు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ పాలు, టీ తాగడం అలవాటు కావడంతో వినియోగం పెరుగుతున్నదనే చెప్పొచ్చు. పెరుగు, మజ్జిగా నిత్యం తీసుకోవడంతోపాటు పాలపదార్థాలతో తయారయ్యే స్వీట్లవాడకం కూడా పెరిగిపోతున్నది. 2024లో విడుదలైన గృహవినియోగ వ్యయ సర్వే నివేదిక ప్రకారం పప్పులు, తృణధాన్యాల కంటే ఎక్కువ డబ్బును పాలకోసం ఖర్చు చేస్తున్నారు. కానీ వారు ఆశించిన మేరకు స్వచ్ఛమైన పాలు లభించడంలేదు. ముఖ్యంగా చిక్కగా ఉండే పాలంటే ఇష్టపడుతున్నారనే బలహీనతను సొమ్ము చేసుకునేందుకు కొందరు దళారులు భారీ ఎత్తున కల్తీకి పాల్పడుతున్న విషయం తరచుగా బయట పడుతున్నది. గ్లూకోజ్ ద్రావణం, రవ్వ,ఎసిటిక్ ఆసిడ్ వంటివి కలిపి నకిలీ పాలను తయారు చేస్తున్న ముఠా ఒకటి హైదరాబాద్‌లో పట్టుబడింది. ప్రమాదకరమైన మాల్టోడెక్స్ట్రిన్, పామాయిల్‌ను పేస్ట్‌లా చేసి పాలల్లో కలిపి అమ్ముకుంటున్న కొందరు దళారులు రాయలసీమ ప్రాంతాల్లో పట్టుబడ్డారు. తెలుగు రాష్ట్రాల్లోనేకాదు రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో అమ్ముతున్న పాలల్లో కూడా కల్తీ భారీగానే జరుగుతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కల్తీ పాలతో ముఖ్యంగా భావిభారత పౌరులుగా ఎదగాల్సిన బాలబాలికలు అనేక రుగ్మతలకు గురవుతున్నారనే ఆందోళన వ్యక్తం చేసిన అత్యున్నత న్యాయస్థానం ఈ దుర్మార్గాన్ని అణచివేసింది.తగిన మార్గదర్శకాలను దాదాపు దశాబ్ద క్రితమే జారీ చేసింది. అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న కల్తీ రాయుళ్లకు జైలు శిక్షను ఆరు నెలల నుంచి సంవత్సరానికి పెంచాలని సూచించింది. కల్తీపాలను సేవిస్తే అజీర్తి సమస్యలతో ప్రారంభమయ్యే కడుపు నొప్పితోపాటు మూత్రపిండాలు, కాలేయం, నాడీ వ్యవస్థపై ప్రభావం పడుతుందని వైద్యనిపుణులు ఏనాటి నుంచో హెచ్చరిస్తున్నారు. అంతేకాదు రసాయనికాలతో కూడిన పాలను దీర్ఘకాలం తీసుకుంటే కేన్సర్ వచ్చే అవకాశం ఉందని కూడా వైద్యులు అభిప్రాయపడుతున్నారు.ఇక పాలల్లో చిక్కదనంరావాలని, ఇటీవల కాలంలో ప్రొటెన్‌ను పెంచేందుకు ప్రమాదకరమైన మైలమన్ రసాయనిక పొడిని కలుపుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకినప్పుడు పాలు పితకకూడదు. కానీ అవేమీ పాటించడం లేదు. ఇలాంటి పాలద్వారా చేసే రకరకాల తీపి పదార్థాలు కూడా కలుషితమైపోతున్నాయి. ఈదురాఘాతాలను నివారించడంలో విఫలమవుతున్న అధికారగణంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ప్రశ్నించిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా పాలకులు కల్తీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త చట్టాల సంగతి దేవుడెరుగు. ఉన్న చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేసేందుకు ప్రయత్నం చేయాలి. అంతేకాదు మామూళ్ల కోసమో, అలక్ష్యంతోనో ఈ కల్తీని నిరోధించడంలో విఫలమవుతున్న అధికారులపై కూడా పటిష్టమైన చర్యలు చేపట్టాలి.

నేరస్తులను శిక్షించుటే ప్రధానం కాదు. నేరం చేయడానికి ఏ పరిస్థితులు పురికొల్పుతున్నాయో వాటిని తొలగించడం ముఖ్యం.



ఆల్బర్ట్ కామూ

మనిషి జ్ఞానం కోసం అన్వేషించాలి తప్ప జ్ఞానం అతని కోసం అన్వేషించదు.



పాస్కల్

# ప్రజావాక్కు



### అతివేగం ప్రమాదకరం

**అతివేగం**,మద్యంసేవించి వాహనంనడపడం ఇలా ఎన్నో ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. సీసీటీవీ కెమెరాలు,ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇలాంటిప్రమాదాలకు సంబంధించిన ఎన్నో వీడియోలు సోషల్ మీడియాలో వేదికగా వైరల్ అవుతున్నాయి.అయినా ప్రజలలో మార్పు రావడంలేదు. ఈ మధ్య కాలంలో యువత బైక్‌లపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ అనేక ప్రమాదాలకుకేంద్రబిందువుగా నిలుస్తుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. అతివేగం అనర్థదాయకం వంటి బోర్డులను రాష్ట్ర రవాణా శాఖవారు ఎన్ని పెట్టినా వాటిని పెడచెవిన పెడుతూ యువత అత్యంత వాయు వేగంతో తమ మోటార్ బైక్‌లను నడుపుతూ పలు ప్రమాదాలకు కారణమవుతున్నారు. సెల్‌ఫోన్‌డ్రైవింగ్,ముగ్గురు, నలుగురుప్రయాణించడం వంటివి సర్వ సాధారణమైపోయాయి.

- సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### సుప్రీం తీర్పు

**గవర్నర్‌కు** రాష్ట్రాలకు మధ్యజరుగుతున్న ఘర్షణ పూర్వక వాతావరణంలో సుప్రీమ్‌కోర్టు ఒకతీర్పునుఇచ్చింది. అయితే ఇది ఒంటెద్దు పోకడపోతున్న కేంద్ర ప్రభుత్వానికి షాక్ లాంటిది. తమిళనాడు, ఢిల్లీ,కాశ్మీర్,కేరళ, లాంటి రాష్ట్రాలలో అపరిమితమైన అధికారాలు చేలాయించవచ్చు అని, తామే సర్వం అని భావించి పని చేసిన గవర్నర్‌ల తీరుపై విమర్శలు గుప్పిస్తూనే వారి అధికార పరిమితులను మరొకసారి గుర్తు చేసింది, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలే మిన్నఅని తన తీర్పు ద్వారా మరొకసారి రుజువు చేసింది అందుకుతనకుగల అసామ్యమైన అధికరణ142ను వాడుకొని తీర్పును ఇవ్వడం గొప్పతనాన్ని స్ఫూర్తిని చాటింది.

-భారత అవినాష్, జనగామ

### మద్దతు ధర కల్పించాలి

**తెలంగాణ** రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన కందులు, వేరుశనగ మార్కెట్ యార్డ్‌లకు తీసుకు రావడం జరిగింది.రైతులు మార్కెట్ యార్డులలో మద్దతుధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎదురు చూస్తున్నారు. కానీ సరైన ధరలేదని వాపోతున్నారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి రైతులనుంచి మద్దతుధరకుకొనుగోలు చేసేవిధంగా సంబంధించిన అధికారులకు ఆదేశాలు ఇవ్వాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### బస్సులకు అనుమతి ఇవ్వాలి

**హన్మకొండ** జిల్లా నయీమ్ నగర్ పెద్ద మోరీపై ఏడు కోట్లతో నిర్మితమైన బ్రిడ్జి పనులు పూర్తయి ఆటోలు, కార్లు, ప్రైవేట్ వాహనాలు నెలరోజుల నుండి రాకపోకలుసాగిస్తున్నాయి. కానీ అధికారులు ఆర్టీసీ బస్సులను ఈబ్రిడ్జి మీద నుండి నడపకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హనుమకొండ నుంచి నిజామాబాద్, ఆదిలాబాద్, సిద్ధిపేట, సిరిసిల్ల, కరీంనగర్ వేములవాడకు వెళ్లే బస్సులు వయా ములుగు రోడ్డు పెద్దమ్మ గడ్డ హనుమాన్ నగర్ నుండి వెళ్లడం వల్ల అదనంగా డబ్బులు చెల్లించడంతోపాటు సమయం అంతా వృధా అవుతుంది. బ్రిడ్జి పనులు పూర్తయి అన్ని వాహనాలు నడుస్తుంటే ఆర్టీసీ బస్సులు ఎందుకు అనుమతించడం లేదో అర్థంకావడం లేదు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి నయీమ్ నగర్ బ్రిడ్జి మీద నుండి బస్సులు నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలి.

-కామిడి సతీష్‌రెడ్డి, భూపాలపల్లి జిల్లా

### పెన్షన్ పెంచండి

**పంతొమ్మిదివందల** యాభైనాలుగు చట్టం పార్లమెంట్ సభ్యులకు జీతాలు పెన్షన్ పెంచుటకు రూపొందించబడినది. సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేరాయితీలను పునరుద్ధించుటకుఇప్పటికే రైల్వే టికెట్లలలో ఎక్కువ రాయితీలు కల్పిస్తున్నామనిపలు సందర్భాల్లో తెలియజేస్తున్నారు.ఉద్యోగుల జీతభత్యాలు పెంచుటకు రకరకాల కమిటీలను వేసి వాటి నివేదికలను పరిశీలించి పెంచుట సాధ్యంకాదని తెలియజేస్తుంటారు.కనీసం కరవు భత్యం కూడా సమయానికి ఇవ్వడంలేదు.1998 బొగ్గు గనుల ప్రావిడెంట్ ఫండ్ చట్టాన్ని అమలు చేయటంలో శ్రద్ధ చూపడం లేదు. ప్రతి మూడేళ్లకు ఒకసారి పెన్షన్ సమీక్ష చేసి పెంచుటకు నిర్ణయం తీసుకున్నా 27సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు ఒక్కసారి కూడా పెన్షన్ పెంపుదల చేయలేదు.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

### కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

**కరీంనగర్** కార్పొరేషన్‌లోని ఆయా రోడ్లప్రాంతాల్లోఉన్న ప్రమాదకరమైన కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని వాటి స్థానంలో మంచిపూలు, పండ్లమొక్కలు నాటాలన్నారు. పచ్చదనం కోసం మొక్కలు నాటడం బాగుందని, కానీ కోనో కార్పస్ వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వీటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

-సింగు. లక్ష్మీనారాయణ చింతకుంట, కొత్తపల్లి, కరీంనగర్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సాంకేతిక ప్రపంచం సంభ్రమాశ్చర్యం

**ప్రపంచ జనాభాలో సుమారు 60 శాతం మంది సోషల్ మీడియా ఉపయోగిస్తున్నట్టు తాజా నివేదికలు సూచిస్తున్నాయి. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడానికి శతవిధాలా ప్రయత్నించినా దక్కని ఫలితం సోషల్ మీడియాకు మాత్రం దక్కింది. డిజిటల్ ప్రపంచంలో నిరక్షరాస్యులు కూడా భాగస్వామ్యం వహించడం ఆశ్చర్యకరమైనా, ప్రజల ఆసక్తి డిజిటల్ ప్రపంచాన్ని అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్లను ఎలా వినియోగించుకోవాలో, అలా వినియోగించుకోవడం లేదు. విలాసాలకు, వినోదాలకు, రాజకీయ కార్యకలాపాలకు, శృంగార దృశ్యాల వీక్షణకు, బెట్టింగులకు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న సాంకేతిక వ్యవస్థలను, మొబైల్ ఫోన్లను, నిర్మాణాత్మకంగా, సమాజ ప్రగతికి, వ్యక్తి గత అభివృద్ధికి, విద్యకు, ఉపాధికి, ఉన్నతమైన కెరీర్ నిర్మాణానికి సక్రమమైన పద్ధతిలో వినియోగించుకోవచ్చు.**



సుంకవల్లి సత్తిరాజు

చందమామ,బొమ్మరిల్లు కథల పుస్తకాల్లో చదివిన ఊహాత్మకమైన కథలు, కల్పనలు,మన చిన్నతనంలో మన పెద్దలు చెప్పిన విచిత్రమైన కథలు వర్తమానంలో వాస్తవ రూపం ధరిస్తున్నాయి. సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నాయి. వైర్‌లెస్ టెలీకమ్యూనికేషన్ వ్యవస్థలు మానవాళిని ఒక అద్భుతమైన ప్రపంచంలోకి తీసుకుపోతున్నాయి.కొన్నిదేశాలకు, కొన్ని నగరాలకు మాత్రమే పరిమితమైన అత్యాధునిక సాంకేతిక సేవలు నేడు ప్రపంచమంతా చక్కర్లు కొడుతున్నాయి. సాంకేతిక రంగం అందిస్తున్న పలు సేవలను ఆస్వాదిస్తున్న ప్రజల అనుభవాలను, అనుభూతులను గురించి వర్ణింపశక్యంకాదు. ఒకప్పుడు ఉత్తరాలద్వారా సమాచారం తెలుసుకునేవారు. టెలిఫోన్ ఆవిష్కరణతోకొంత వరకు సమాచార సేకరణ సాధ్యమైనప్పటికీ, అది కూడా పూర్తిగా అందరికీ అందుబాటులో ఉండేదికాదు. ఏది ఏమైనప్పటికీ టెలిఫోన్ ఆవిష్కరణ తర్వాత కాలక్రమంలో కమ్యూనికేషన్ వ్యవస్థలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ప్రస్తుత ప్రపంచం డిజిటల్ యుగంలోకి ప్రవేశించింది. కృత్రిమ మేథ (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్) వేళ్ళూనుకుంటున్నది. డీప్ సేక్ ఎన్ విడియాకు పోటీగా సాంకేతిక విప్లవం సృష్టిస్తున్నది. గ్రోక్ సాంకేతికంగా ఇతర కృత్రిమ మేథస్సు సంబంధించిన సంస్థలకు సవాళ్లు విసురుతున్నది. ఎన్నో యూట్యూబ్ ఛానెళ్లు విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఫుడ్ యాప్‌లు,రోడ్డు, రైల్వే, విమాన ప్రయాణాల కోసం ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థకు మొబైల్ ఫోన్లు వినియోగపడుతున్నాయి. ఆర్థిక వ్యవహారాల కోసం బ్యాంకులకు వెళ్ళవలసిన అవసరం లేదు. ఎ.టి.యం కార్డులతో పనిలేదు. బ్యాంకులకు వెళ్లి గంటల తరబడి క్యూలలో నిలబడే అవసరం అంతకంటే లేదు. ఆన్లైన్ ట్రాన్సాక్షన్ల కోసం నెట్ బ్యాంకింగ్, పేటీయం, ఫోన్ పే,గూగూల్ పేలు అందుబాటులోకి వచ్చి, అరక్షణం ఆలస్యం కాకుండా ఆర్థిక వ్యవహారాలు చక్కగా జరిగిపోతున్నాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో ఫేస్బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్, ఎక్స్ మొదలైనవి ప్రపంచాన్ని క్షణాల్లో మన ముందుంచుతున్నాయి. జరిగిన, జరుగుతున్న సంఘటనలపై ప్రపంచ ప్రజల అభిప్రాయాలను పంచుకోవడంలో సామాజిక మాధ్యమాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. నేడు సోషల్ మీడియాను ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు వినియోగిస్తున్నారు. ఇది ప్రపంచ జనాభాలో సగం కంటే ఎక్కువ. ఇంత బహుళ ప్రాచుర్యం పొందిన సోషల్ మీడియాను సుమారు 59శాతం మంది వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. 80శాతం పైగా అమెరికన్లు సాంఘిక మాధ్యమాన్ని ఉపయోగిస్తున్నారు. చైనాలో 100కోట్లమంది సోషల్ మీడియా యూజర్లున్నారు. చైనాలో ఫేస్‌బుక్ యూజర్ల సంఖ్య మిలియన్ల సంఖ్యలో ఉంది. అయితే ఇతర దేశాల్లో దీని వినియోగం ఎంతో అధికం. సోషల్ మీడియా ప్లాట్ ఫాం వ్యాపారాభివృద్ధి కోసం, వాణిజ్య ప్రకటనల ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం కోసం, ఉపాధి అవకాశాల కోసం, కెరీర్‌ను తీర్చిదిద్దుకోవడం కోసం ఉపయోగపడుతున్నది. తమ ప్రతిభ కేవలం నాలుగు గోడల మధ్య నలిగిపోకుండా ప్రపంచానికి పరిచయం చేయడం కోసం చాలామంది సాంఘిక మాధ్యమాలను వినియోగిస్తున్నారు. సాంఘిక మాధ్యమాల ద్వారా ధనార్జన చేస్తున్న వారు కోకొల్లలు. అవకాశాల కోసం ఎదురు చూసే వారికి సోషల్ మీడియా ఒక కొంగుబంగారం. స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడు ప్రతీ రోజు సగటున సుమారు 2 గంటల సమయం వెచ్చిస్తున్నాడు. ప్రతీనెలలో సుమారు 70 గంటల సమయాన్ని సోషల్ మీడియాయాప్స్ కోసం వినియో



గిస్తున్నారు. 448కోట్ల జనాభా అనగా ప్రపంచ జనాభాలో సుమారు 55శాతంమంది ప్రజలు సోషల్ మీడియా ఎక్కౌంట్లు కలిగిఉన్నారు. ప్రతీరోజు బిలియన్ల సంఖ్యలో ప్రపంచంలోని పలువురితో ఆత్మీయంగా కలిసే అవకాశం సోషల్ మీడియా సుసాధ్యం చేస్తున్నది. యాపిల్ ఐ ఫోన్ సోషల్ మీడియా జాతకాన్ని ఓ మలుపుతిప్పింది. ఇప్పుడు దాదాపు అన్నిబ్రాండెడ్ ఫోన్లలో వివిధ అప్లికేషన్లు యూజర్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. సోషల్ నెట్‌వర్కింగ్ యాప్స్ ద్వారా లభిస్తున్న రెవిన్యూలో సగానికిపైగా ఫేస్‌బుక్, ఇన్ స్టాగ్రామ్ లదే. యు.ఎస్‌లో ఫేస్‌బుక్ తర్వాత స్థానం ఇన్‌స్టాగ్రాందే. సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, యూ ట్యూబ్, టిక్‌టాక్, వాట్సప్,స్నాప్‌చాట్, ట్విట్టర్, పిన్ టెరెస్ట్,లింక్‌డ్ ఇన్‌లు బాగాప్రాచుర్యం పొందాయి. ఎవరికి వారు సోషల్ మీడియా సామ్రాజ్యానికి రారాజుల్లా వెలిగిపోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలను సృష్టించి, తమ వ్యాపారాలను బిలియన్ల కోట్ల డాలర్లకు పెంచేసుకుంటూ కుబేరులుగా మారిపోయిన వారిని ఊహించుకుంటూ, మన సమయాన్ని వృథా చేస్తున్నాం. జి.బి.ల కొద్దీ డేటాను కొనుగోలు చేసి, అవసరం లేకున్నా మన ఖర్చులను పెంచేసుకుంటున్నాం. ఒకప్పుడు కారు చౌకగా లభించిన మొబైల్ డేటా నేడు విపరీతంగా పెరిగింది. అపరిమితమైన వాయిస్ కాల్స్ నేడుఖరీదైన వ్యవహారంగా మారిపోయాయి.సెల్‌ఫోన్ ఖర్చులు సామాన్య ఫోన్ వినియోగదారులకు, స్మార్ట్‌ఫోన్ వినియోగ దారుల జేబులకు చిల్లులుపెడుతున్నాయి.దూరాన్ని దగ్గర చేసి, టెక్నాలజీ సహాయంతో ప్రపంచాన్ని మన చెంతకు చేర్చి, మన అభిప్రాయాలను, మన సంస్కృతీ సాంప్రదాయాలను, మన ఆచార వ్యవహారాలను మిగతా ప్రపంచానికి తెలియ చేసే దగ్గర దారి సోషల్ మీడియా.సాంఘిక మాధ్యమాలను వినియోగించడానికి మనకొక ఎలక్ట్రానిక్ పరికరం అవసరం. అది కంప్యూటర్ కావచ్చు. ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ కావచ్చు లేక ట్యాబ్,మొబైల్ కావచ్చు.ఏదిఏమైనా నేటి కాలానికి అత్యంత సౌకర్యవంతమైన సాంకేతిక సాధనంగా మొబైల్ జన హృదయాలను దోచుకుని, మనల్ని ఒక అద్భుతమైన ప్రపంచానికి తీసుకుపోయింది.ఈ సంవత్సరం ప్రారంభానికి ప్రపంచంలో 5.5 బిలియన్ల మంది ఇంటర్నెట్ వినియోగిస్తున్నారని ఒక అంచనా. ఇది ప్రపంచ జనాభాలో 64శాతంగా ఉంది. ప్రపంచ జనాభాలో సుమారు 60 శాతం మంది సోషల్ మీడియా ఉపయోగిస్తున్నట్టు తాజా నివేదికలు సూచిస్తున్నాయి. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడానికి శతవిధాలా ప్రయత్నించినా దక్కని ఫలితం సోషల్ మీడియాకు మాత్రం దక్కింది. డిజిటల్ ప్రపంచంలో నిరక్షరాస్యులు కూడా భాగస్వామ్యం వహించడం ఆశ్చర్యకరమైనా, ప్రజల ఆసక్తి డిజిటల్ ప్రపంచాన్ని అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్లను ఎలా వినియోగించుకోవాలో, అలా వినియోగించుకోవడం లేదు.విలాసాలకు, వినోదాలకు, రాజకీయ కార్యకలాపాలకు, శృంగారదృశ్యాల వీక్షణకు, బెట్టింగులకు వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న సాంకేతిక వ్యవస్థలను, మొబైల్ ఫోన్లను, నిర్మాణాత్మకంగా, సమాజ ప్రగతికి, వ్యక్తిగత అభివృద్ధికి, విద్యకు, ఉపాధికి,ఉన్నతమైన కెరీర్ నిర్మాణానికి సక్రమమైన పద్ధతిలో వినియోగించుకోవచ్చు. వర్తమాన ప్రపంచంలో చోటుచేసుకుంటున్న నేరాల్లో అత్యంత ఆధునిక నేరంగా 'సైబర్ క్రైమ్' పేరుగాంచింది. ఈ మాట వింటుంటే ముచ్చెమటలు పట్టకమానవు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం సైబర్ నేరగాళ్ళకు కాసుల పంటగా మారింది. కోట్లు దండుకునే ఘరానా మోసానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఎక్కడో విదేశాల్లో కూర్చుని, చెమట పట్టకుండా, విద్యాధికులకు సైతం ముచ్చెమటలు పట్టించే వికృతమైన క్రీడా విన్యాసానికి పర్యాయపదంగా 'సైబర్ క్రైమ్' పేరుగాంచింది. అశ్లీల దృశ్యాలను సాంఘిక మాధ్యమాల్లో పెడతామని బ్లాక్ మెయిల్‌చేసి, సామాన్యుల నుండి సెలబ్రిటీలను సైతం మోసం చేసి,డబ్బులు గుంజుకోవడం చూస్తున్నాం. ప్రభుత్వ పథకాలపేరుతో, బ్యాంకు అధికారుల పేరుతో వివిధరకాలుగా బెదిరింపులకు పాల్పడుతూ, ఎటియం పిన్ చెప్పమంటూ అజ్ఞాత వ్యక్తులు మాయమాటలు చెప్పడం, కెవైసి అప్ డేట్ కోసమంటూ ఓటిపి అడగడం, మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు పంపడం,వాట్సాప్‌లలోలింకులు పంపించి, క్లిక్ చేయమనడం ద్వారా డబ్బులు కాజేయడం వంటి సంఘటనలు పలుచోట్ల చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలి కాలంలో డిజిటల్ అరెస్టుల ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ వలన లాభాల కంటే నష్టాలే అధికమని చెప్పక తప్పదు.భవిష్యత్తులో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ మనిషిని మనిషిగా కాకుండా మరమనిషిగా మార్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు కళ్ళు తెరవాలి. మనిషిని మానసికంగా నాశనం చేసి, మరమనిషిగా తయారు చేస్తున్న సాంకేతిక పరమైన ఆవిష్కరణల విషయంలో జాగరూకత వహించాలి. ●

# ఆర్థిక వనరుల సమీకరణకు ఏది దారి?

గుర్రం రాంమోహన్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక వనరులు సమీకరణకు దారి కన్పించడంలేదు. ఎన్ని మార్గాలు అన్వేషించినప్పటికి మార్గాలు దొరకడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా పీకలలోతు కష్టాలు ఎదుర్కొంటోంది.రూపాయి, రూపాయి ఓడిసి పట్టుకొని ఆర్థిక వనరులు ఖర్చుచేసినప్పటికీ నెల వచ్చేసరికి ఖజాన పెట్టే ఖాళీ ఏర్పడుతోంది.అప్పులు కట్టేందుకు మళ్ళీ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్థిక క్రమశిక్షణ పాటించి ఖర్చులు గణీయంగా తగ్గించుకున్నప్పటికీ, ఖజానాలో మిగులు కన్పించేపరిస్థితిలేదు.సంక్షేమ పథకాల అమలు కోసం, అప్పులకు వడ్డీ కట్టేందుకు ప్రభుత్వంకు అప్పులు తప్ప వేరేమార్గం కన్పించడంలేదు. వచ్చే ఆదాయం, ఖర్చులకు వ్యత్యాసం భారీగా ఉంటుంది. మార్కెట్లో అప్పులు పుట్టడంలేదు. అప్పులు ఇచ్చేందుకు ఎవరు ముందుకు రావడం లేదని రాష్ట్ర ప్రభుత్వం రథసారధి స్వయంగా ఆర్థిక పరిస్థితి ఎంత క్లిష్టపరిస్థితి ఉందో విశిదమోతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి నెలనెల వచ్చే 18 వేల కోట్ల రూపాయలు వస్తోంది. ఖర్చు మాత్రం అధికంగా అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి నెలనెలకు 25వేల కోట్లనుంచి 30వేల కోట్లకు పైగా ఆదాయం వస్తే తప్ప ప్రభుత్వాన్ని నడిపించే పరిస్థితి లేదు. ప్రభుత్వం అబ్కారిశాఖ, రిజిస్ట్రేషన్స్ స్టాంపు శాఖ, వాణిజ్య పన్నులశాఖ, రవాణశాఖ నుంచి మాత్రమే ఆదాయం సమకూరుతోంది. ప్రభుత్వానికి వస్తున్న 18వేల కోట్ల ఆదాయంలో అప్పులకు వడ్డీ రూపేణ నెలనెల 6వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు నెలనెల 6వేల కోట్లు అంటే ఇక్కడే 12 వేల కోట్ల రూపాయలుపోతుంది. మిగిలిన 6 వేల కోట్ల రూపాయలు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్, ఇతర సంక్షేమ పథకాల కోసం, నీటి పారుదలు, విద్యా, వైద్యం, పంచాయతిరాజ్, రోడ్ల భవనాల శాఖ వంటి అభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చుఅవుతుంది. గత ప్రభుత్వం 7లక్షల 50వేల కోట్ల రూపాయలు అప్పులు




తేవడం వల్ల అప్పులు పెరిగాయని వడ్డీ భారం అధికంగా పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలకాలం వరకు దాదాపు ఒక లక్ష 52వేల కోట్లు తెచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. తెచ్చిన అప్పుల్లో 80 వేల కోట్ల రూపాయలు అప్పులకు వడ్డీ చెల్లించగా, మిగత 72వేల కోట్ల రూపాయలు వివిధ ప్రభుత్వ పథకాలకు ఖర్చుచేసింది. నాలుగు శాఖల్లో అధిక ఆదాయం అబ్కారి శాఖ నుంచి వస్తోంది. రమారమి 36 వేల కోట్లనుంచి 40వేల కోట్ల రూపాయలు అబ్కారి నుంచి ఆదాయం వస్తున్నట్లు తెలుస్తోంది. భూముల క్రయ, విక్రయాలు తగ్గిపోవడం, రియల్ ఎస్టేట్ రంగం కుదేలు కావడంతోపాటు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ 6వేలకోట్ల రూపాయలు తగ్గిపోయాయి. విద్యార్థులకు ఫీజు రియాంబర్స్మెంట్ క్రింద 5వేల కోట్లు రైతు భరోసా, రైతు రుణమాఫి క్రింద ఇంకా రైతులకు చెలించాల్సివుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రతినెల 1000 మందికి పైగా పదవి విరమణ పొందుతున్నారు. ఉద్యోగులకు 8వేల కోట్ల రూపాయలు చెల్లించాల్సిఉంది. వేతన సవరణ, డి.ఎ.లు చెల్లించాలంటే వేలకోట్ల రూపాయలు కావాల్సిఉంటుంది. రాష్ట్రప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత రవాణ సౌకర్యం కల్పిస్తోంది. ప్రతిరోజు రోడ్డు రవాణ సంస్థకు 14 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుండగా ఉచిత బస్సుప్రయాణంవల్ల ఆర్.టి.సి.కి ప్రతిరోజు 4కోట్ల రూపాయలు ఆదాయం వస్తోంది. ఆర్.టి.సికి రాష్ట్ర ప్రభుత్వం నెలకు 300కోట్ల రూపాయలు అంటే ఇప్పటివరకు దాదాపు 4వేల కోట్లరూపాయలు చెల్లించడంతో భారంగా మారింది.3లక్షల కోట్ల రూపాయలు భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పటికి ఆదాయ మార్గం మాత్రం కన్పించడంలేదు. ఆదాయం లేకపోవడంవల్ల కేటాయింపులు,వ్యయంలో సైతం వ్యత్యాసం కనిపిస్తోంది. ఆదాయం సమాకూర్చుకోవడానికి అన్నిమార్గాలను ప్రభుత్వంసీరియస్‌గా అన్వేషించినప్పటికి ద్వారాలు కన్పించడంలేదు.భూములు విక్రయించడం,లీజుకు ఇవ్వడం,అప్పులు తెచ్చుకోవడం ప్రభుత్వానికి అనివార్యమైంది.గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని వేలంవేసి వనరులు సమీకరించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించగా,ఆదిలోనే హంసపాదంఅన్నట్టుగా అవరోధాలు ఎదురవుతున్నాయి. ఆదాయ మార్గాలు కన్పించడంలేదు.ఎన్నిమార్గాల్లో ప్రయత్నించినా ఆదాయంలేక ప్రభుత్వానికి వనరులసేకరణ గుదిబండగా మారింది. ●

# మాటల్లోనే మహిళా రక్షణ!



నాదెండ్ల శ్రీనివాస్

మహిళలపై జరుగుతోన్న హింస ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఎత్తున సాగుతోన్న మానవ హక్కుల ఉల్లంఘన అంటోంది ఐక్యరాజ్య సమితి. ప్రతి పదకొండు నిమిషాలకు ఓ మహిళ లేదా బాలిక మరణంఆమె సన్నిహితుల చేతుల్లోనే జరుగుతోం దంటున్నాయి ఐరాస నివేదికలు. మహిళలపై అనేక రూపాలలో జరిగే హింసలో అంతగా చర్చకు రానిది మాతృత్వ హింస. భారతదేశంలో అనవసరమైన సిజేరియన్ ఆపరేషన్లు ఆందోళనకర స్థాయికి పెరిగాయి. దీనివల్ల గౌరవప్రదమైన మాతృత్వహక్కు ప్రమా దంలో పడుతున్నది. మద్రాసు ఐఐటి జరిపిన ఒక పరిశో ధన ప్రకారం (ప్రైవేట్ ఆస్పత్రులలో సిజేరియన్ ప్రసవాలు 40.9శాతం నుండి 47.4శాతానికి 6.6 శాతం పెరిగాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం అసోం, ఒడిశా, తెలంగాణ,పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని (ప్రైవేట్ అనుపత్రు లలో ఇవి 70శాతాన్ని మించిపోయాయి. సిజేరియన్ ప్రాణ రక్షక చికిత్సకానీ అనవసరపు సిజేరియన్ వల్ల తల్లీబిడ్డలకు పలు సమస్యలు ఎదురవుతాయి. రక్తం కోల్పోవడం, ఇన్ఫె క్షన్, కోలుకోవడానికి ఎక్కువ రోజులు పట్టడం, బిడ్డలకు పాలివ్వడంలో ఆలస్యం, తరువాతి గర్భధారణలో సమస్యలు వంటివి. ప్రతి వైద్యశాలలో గత సంవత్సరం సిజేరియన్ ప్రసవాల శాతాన్ని నోటీసు బోర్డుపై ప్రదర్శించాలన్న నిబంధన విధిస్తే ఈ అంశంపై గర్భవతి విజ్ఞతతో కూడిన నిర్ణయం తీసుకొనే అవకాశం కలుగుతుంది. అయితే మహిళలపై భౌతికంగానే కాదు ఆన్లైన్లోనూ వేధింపులు పెరుగుతున్నాయి. కట్టుబొట్టు నడత అన్నింటినీ జడ్జ్‌చేస్తూ ట్రోలింగ్ చేస్తున్నారు. ఈ తరహా వేధింపులు స్త్రీలను మానసికంగా కుంగదీస్తూ, కొన్నిసార్లు చావుఅంచుల వరకూ తీసుకెళ్తున్నాయి. కృత్రిమ మేధస్సు(ఎఐ)ను కూడా మహిళలను వేధించేందుకు దుర్వినియోగం చేస్తున్నారు. ఇందుకు డీప్ ఫేక్‌ట్రెండ్ ఒక ఉదాహరణ.నగ్నచిత్రాలతో వేధింపులు ఎక్కువ కావటం వల్ల మహిళలు,ముఖ్యంగా బాలికలు,ఆత్మహత్య



చేసుకుంటున్న ఉదంతాలు పెరుగుతున్నాయి. భారతదేశంలోని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ఆర్థిక నేరాలతోపాటు నగ్నచిత్ర వేధింపులపై కూడా మరింత దృష్టి పెట్టాలి. సోషల్ మీడియాను ఒక సాధనంగా వాడుకుంటూ మహిళలను రాజకీయాల నుంచి దూరం చేయాలనే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.అజ్ఞాతంగా కామెంట్ చేయగలిగే అవకాశం ఉండటంతో, ట్రోలర్లు ధైర్యంగా ఎలాపడితే అలా రాస్తున్నారు. మహిళల గురించి రాసేప్పుడు ఈధైర్యం ఇంకా ఎక్కురు ప్రదర్శిస్తున్నారు.కొత్తగా తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టంలో యువత తమ జీవిత భాగస్వామిని స్వేచ్ఛగాఎంపిక చేసుకునే హక్కును హరించారు. కులం లేదా ఆస్తి కారణంగా ప్రేమ వివాహాల విషయంలో మోసం చేసినా నేరంగా పరిగణించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.లవ్ జిహాద్ పేరిట మతాంతర వివాహాలపై కేసులు నమోదుచేసి జైలుకు పంపుతున్నారు. ఉత్తరప్రదేశ్తోపాటు దేశంలో,మన రాష్ట్రంలో కూడా పరువు హత్యలు పెరిగాయి. కుల,మత ఉన్మాదాలు వ్యాప్తి చెందుతున్నాయి. స్త్రీలపై అత్యాచారాలు, హింస పెరుగుతున్నాయి. దాంతో ఆడపిల్లల చదువుకు, ఉపాధికి ఆటంకాలు వస్తున్నాయి. యునెస్కో ప్రకారం ఆడపిల్లలు చదువును మానేయడానికి ముఖ్యమైన కారణం హింస అనిచెప్పింది. ఆడపిల్లలు చదువుకోవడానికి మంచి విద్యావ్యవస్థ, భద్రత అవసరం.స్త్రీలపై ఆధిపత్యం కుటుంబ హింసను పెంచుతోంది. ఫలితంగా స్త్రీలు హింసకు గురవుతున్నారు. పైగా కుటుంబ నిర్వహణ భారం కూడా మహిళలపైనే పడుతోంది.దానితో వారుఅప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇక చట్టాల విషయానికి వస్తే సెక్సువల్ అఫన్సివ్ యాక్ట్ 2012, క్రిమినల్ లా అమండ్ మెంట్ యాక్ట్2013, నిర్భయ చట్టం2013,పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013, లైంగిక నేరాల నుంచి బాలలకు రక్షణ చట్టం 2012, బాల్య వివాహ నిరోధక చట్టం 2006, ఇలా ఎన్నోచట్టాలు.అయితే ఇవన్నీ ఎంతవరకు ప్రభావవంతంగా పనిచేస్తున్నాయన్నది ప్రశ్నార్థకమే. మన రాజ్యాంగం మత విశ్వాసాల ఆధారంగానే స్త్రీలకు పర్సనల్ లా హక్కులు కల్పించింది. పితృస్వామ్యం, మతం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి రూపంలో మహిళల పట్ల అమలవుతున్న వివక్షనుకాదని స్త్రీలకు సమానత్వ హక్కులను కల్పించలేకపోయింది. వీటన్నిటికీ లోబడే చట్టాల రూపకల్పన జరుగుతోంది. అందుకనే గృహహింస నుండి రక్షణ చట్టం మొదలు నిర్భయ చట్టం దాకా ఎన్ని చట్టాలు చేసినా వివక్షను తొలగించలేకపోతున్నాయి. ●

# కాలుష్య కాసారాలుగా భారత్‌నగరాలు

## వర్షపాతం సైతం ఆమ్లభరితంచేస్తున్న వాయుకాలుష్యం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** వాయు కాలుష్యం దేశంలోని అనేక నగరాల్లో వర్షపాతాన్ని మరింత ఆమ్లంగా మారుస్తున్నట్లు తేలింది. దేశంలోని పలు నగరాల్లో వాయు కాలుష్యంపై భారత వాతావరణ సంస్థ (ఐఎండీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరియాలజీ(ఐఐటీఎం) కలిసి కీలక విశ్లేషణ చేశాయి. విశాఖపట్నం, అలహాబాద్, మోహన్ బారి (అసోం) వంటి నగరాల్లో వాయుకాలుష్యం వర్షపాతాన్ని మరింత ఆమ్లంగా మారుస్తుందని విశ్లేషణలో తేలింది. థార్ ఎడారి నుంచి వచ్చే దుమ్ము జోధ్‌పూర్, పుణె, శ్రీనగర్‌లో వర్షపాతాన్ని మరింత క్షారంగా మారుస్తున్నట్లు అధ్యయనంలో తేలింది. దేశంలోని పది నగరాల్లో నమోదయ్యే వర్షపాతం తాలుక ఆమ్లత్వం, క్షారత్వాన్ని కొలిచే పీహెచ్ విలువలను ఐఎండీ ఖిమెట్ మోనోగ్రాఫ్‌గా తెలిపింది. వాతావరణ పరిస్థితులు, స్థానిక ఉద్గారాలు వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయని చెప్పిన ఐఎండి ఆమ్ల, క్షార వర్షం రెండూ విషపూరిత ప్రభావాలను కలిగిస్తాయని పేర్కొంది. 'ఆమ్ల, క్షార వర్షాలు జలచరాలు, వృక్షజాల జీవితంపై ప్రభావితం చేస్తాయి. చమురు శుద్ధి కర్మాగారం, విద్యుత్ ప్లాంట్, ఎరువుల కర్మాగారం వల్ల విశాఖపట్నంలో కురిసే వర్షాల్లో ఆమ్లత్వం ఉంటుంది. మోహన్ బారిలో అక్కడి నేల ఆమ్ల స్వభావాన్ని కలిగి ఉంది. థార్ ఎడారి నుంచి వచ్చే దుమ్ము వల్ల జోధ్ పూర్, శ్రీనగర్‌లోని వర్షపు నీరు ఆమ్ల స్వభావంతో ఉంటుంది. తద్వారా ఈ నగరాల్లో వర్షాల పీహెచ్ విలువ పెరుగుతుంది. వర్షాకాలం కంటే ఎండాకాలంలో వర్షపాతం కొంచెం ఎక్కువ ఆమ్లం స్వభావంతో ఉంటుంది. అయితే దేశంలోని పది నగరాల్లో వర్షపాతం కాలక్రమేణా మరింత ఆమ్లంగా మారింది." అని పరిశోధనలో తేలింది. ఐఎండీ అనాలసిస్ ప్రకారం 1987-2021 వరకు 10 గ్లోబల్ అట్మాస్ఫియర్ వాచ్ స్టేషన్లలో నిర్వహించిన పరిశోధనలో చాలా ప్రదేశాల్లో కాలక్రమేణా వర్షపు పీహెచ్ విలువ తగ్గుతోంది. ఈ ధోరణి వర్షపు నీరు మరింత ఆమ్లంగా మారుతున్నట్లు సూచిస్తుంది. ముఖ్యంగా అధిక వాయు కాలుష్యం ఉన్న పారిశ్రామిక, పట్టణ ప్రాంతాల్లో ఈ మార్పు కన్పిస్తోంది. వైజాగ్, మోహన్ బారి, అలహాబాద్ వంటి గ్లోబల్ అట్మాస్ఫియర్ వాచ్ స్టేషన్లు ఎక్కువ ఆమ్ల సగటు పీహెచ్ విలువలను నమోదు చేస్తున్నాయి. జోధ్ పూర్, శ్రీనగర్ ఎక్కువ ఆల్కలీన్ విలువలను కలిగి ఉన్నాయి. ఇది వాతావరణ పరిస్థితులలో వైవిధ్యాన్ని, వర్షపు నీటిని ప్రభావితం చేసే విలువలను సూచిస్తుంది అని అనాలసిస్‌లో తేలింది.


# యుఎస్ సందర్శన ఓ హక్కు కాదు

## వీసా విధానంపై విదేశాంగమంత్రి మార్కో రుబియో



**వాషింగ్టన్, ఏప్రిల్ 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీసా నిబంధనలను మరింత కఠినంగా మార్చిన సంగతి తెలిసిందే. చిన్నచిన్న తప్పులను ఎత్తి చూపుతూ అక్కడి ప్రభుత్వం వీసాలను రద్దు చేస్తోంది. దీంతో ఎన్నో ఆశలతో చదువుకునేందుకు విదేశాల నుంచి అక్కడికి వెళ్లిన విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలోనే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పందించారు. వీసా విధానంపై తన వైఖరిని తెలియజేశారు. 'అమెరికా భద్రత విషయంలో ట్రంప్ విధానం సరైనదే. మా దేశాన్ని సందర్శించడం ఒక హక్కు మాత్రం కాదు. మా చట్టాలు, విలువలను గౌరవించే వారికి మాత్రమే ఇది ప్రత్యేక సౌకర్యం. విదేశాంగమంత్రిగా ఈ విషయాన్ని నేనెప్పటికీ పాటిస్తూనే ఉంటా. అమెరికా చట్టప్రకారం ఉగ్రవాద సంస్థలు, తీవ్రవాదాన్ని ప్రోత్సహిం చడం, మద్యం తాగి వాహనాలు నడపడం, చట్టవిరుద్ధంగా ప్రవర్తించడం, అమెరికన్ల రక్షణకు భంగం కలిగించినా వారి వీసాలను రద్దు చేసేందుకు హక్కు ఉంది. అమెరికా జాతీయ భద్రతను కాపాడడంతోపాటు చట్టబద్ధంగా మా దేశాన్ని సందర్శించే వారిని రక్షిస్తాం. ఎవరైనా హాని కలిగించాలని భావిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడము' అని రూబియో 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. కాగా భారత్ సహా విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు అవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పలు అమెరికా కళాశాలలు పేర్కొన్నాయి. వారిలో చాలామందికి క్యాంపస్‌లలో జరుగుతోన్న పాలస్తీనా అనుకూల ఆందోళనలతో ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ గతంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించారనే కారణం చూపించి వీసాలను రద్దు చేసినట్లు ఇటీవల మీడియా కథనాలు వెల్లడించాయి. గతంలో చేసిన తప్పులను ఎత్తి చూపి వీసాలను అక్కడి ప్రభుత్వ యంత్రాంగం రద్దు చేస్తోంది. తక్షణమే దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశిస్తోంది. దీంతో విద్యార్థుల్లో ఆందోళనలు మొదలవుతున్న నేపథ్యంలో స్పందించిన మార్కో రుబియో వీసా విధానంపై తమ వైఖరిని వెల్లడించారు.

# ట్రంప్ కేబినెట్ మీట్‌లో మస్క్ 'టాప్‌సీక్రెట్' నోట్?




**వాషింగ్టన్, ఏప్రిల్ 13:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీకి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సారిథిగా వ్యవహరిస్తున్నారన్నది తెలిసిందే. ఇటీవలే ట్రంప్ క్యాబినేట్ సమావేశం నిర్వహించగా అందులో పాల్గొన్న మస్క్ షాకింగ్ నోట్ రాశారు. ముఖ్యంగా టాప్ సీక్రెట్ అని తన నోట్ ప్యాడ్‌పై రాసి పెట్టుకున్నారు. ఇది కాస్తా మీడియా కంట్లో పడగా క్లిక్ మనిపించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. అయితే అలా ఎందుకు రాశారని మస్క్‌ను అడగ్గా.. షాకింగ్ రిప్లై ఇచ్చారు. అగ్రరాజ్యం అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ వ్యయాలను తగ్గించేందుకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ (డోజ్)ని ఏర్పాటు చేసి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ను అధినేతగా ప్రకటిం చారు. అయితే ఈశాఖ ఇచ్చిన సలహాలతో అమెరికాలోని అనేక మంది ఫెడరల్, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను తొలగించారు. ఇలా పెద్ద మొత్తంలో వ్యయాన్ని తగ్గించగల్గారు. దీంతో తమ ఉద్యోగాలు పోవడానికి మస్క్ కారణం అంటూ అనేక మంది ఆయనపై విమర్శలు గుప్పించారు. ఆయనకు సంబంధించిన టెస్లా కంపెనీలపై దాడులకు తెగబడ్డారు. టెస్లాను బహిష్కరించాలని కోరుతూనే మరోవైపు ఆ కార్లను తగులబెట్టారు. ఇంత వ్యతిరేకతగా వస్తుండగా ఆయన్ను ట్రంప్ పదవి లోంచి తొలగించ బోతున్నారంటూ పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. అయితే అవి నిజమేనని తెలుస్తోంది. ముఖ్యంగా మస్క్ పదవీ కాలం వచ్చే నెలతోనే ముగియబోతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా తాజాగా డొనాల్డ్ ట్రంప్ క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. అయితే ఆ మీటిం గ్‌కు వెళ్లిన మస్క్ మీడియా కళ్లన్నీ తనవైపుకు తిప్పుకున్నారు. అధికారులు అంతా చర్చిస్తుండగా మస్క్ మాత్రం తన వద్ద ఉన్న నోట్ ప్యాడ్ పై టాప్ సీక్రెట్ అని రాసిపెట్టారు. దాన్ని గుర్తించిన మీడియా ప్రతినిధులు ఫొటోలు తీయగా ప్రస్తుతం అవి నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇది చూసిన ప్రతీ ఒక్కరూ.. దానికి అర్థం ఏంటని అడుగుతున్నారు. మరి కొందరు అయితే కావాలనే మస్క్ ఇలా రాసిపెట్టారని, ఎప్పుడూ మీడియాను ఆడుకోవడం ఆయనకు ఇష్టం అంటూ కామెంట్లు చేస్తున్నారు. అయితే తాజాగా మస్క్ దీనిపై స్పందించారు. దీన్ని రీపోస్ట్ చేస్తూ.. నవ్వుతున్న ఎమోజీని పెట్టారు. అసలు ఆయన అలా ఎందుకు పెట్టారు, టాప్ సీక్రెట్ అని రాయడానికి కారణం ఏంటా అని అనేక మంది ఆలోచిస్తున్నారు.

# నేషనల్ హెరాల్డ్ ఆస్తుల జప్తునకు ఇడి నోటీసులు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** కాంగ్రెస్‌కు సంబంధించిన నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ, ముంబయి, లఖ్‌నవూలో ఉన్న రూ. 661కోట్ల విలువైన స్థలాలను స్వాధీనం చేసుకుంటున్నట్లు రిజిస్ట్రార్లకు నోటీసులు పంపింది. ఈ మేరకు ఢిల్లీలోని హెరాల్డ్ హౌజ్, ముంబయిలోని బాంద్రా, లఖ్‌నవూలోని బిశ్వేశర్ నాథ్ రోడ్‌లోని మూడు ప్రాంతాలకు శుక్రవారం నోటీసులు జారీ చేసినట్లు ఈడీ పేర్కొంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం 2002 రూల్ 5(1), సెక్షన్ 8 ప్రకారం జారీ చేసినట్లు వివరించింది. కాగా, 2023లోనే ఈ స్థలాలను ఈడీ అటాచ్ చేసుకుంది. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ సంబంధిచిన ఈ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నిందితులుగా ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన నేషనల్ హెరాల్డ్ పత్రిక, అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (తిరిలి) సంస్థలో మనీ లాండరింగ్ జరిగినట్లు ఈడీ గుర్తించింది. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి సంబంధించిన యంగ్ ఇండియన్ ప్రైవేట్ కంపెనీ తిరిలి సంస్థకు చెందిన రూ.2000 విలువైన స్థలాలను కేవలం రూ.50 లక్షలకే దక్కించుకున్నట్లు తేలింది. నేషనల్ హెరాల్డ్ బకాయి ఉన్న రూ.90.25 కోట్లను వసూలు చేసుకునే హక్కును పొందేందుకు యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నేరపూరితమైన కుట్ర పన్నారని బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి గతంలో ఆరోపించారు. ఇందులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన షేర్ హోల్డర్లుగా ఉన్నారు. వీరిద్దరికి 38శాతం వాటా ఉంది.

# వక్ఫ్ బిల్లుపై ఆగని నిరసనలు: బెంగాల్‌లో ముగ్గురు మృతి, 150 మంది అరెస్టు



**కోల్‌కతా, ఏప్రిల్ 13:** వక్ఫ్ బిల్లుకు పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోదం పొంది చట్టంగా మారినప్పటికీ దానిపై ఇంకా వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. మరీ ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ బిల్లు విధ్వంసం సృష్టిస్తుంది. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా రెండు రోజుల క్రితం అనగా శుక్రవారం నాడు పశ్చిమబెంగాల్.. ముర్షిదాబాద్, మాల్దా, హుగ్లీ, దక్షిణ 24 పరగణా జిల్లాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. ముర్షిదాబాద్ ప్రాంతంలో ఇప్పటికీ ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయి. విధ్వంసకర ప్రాంతాల్లో పారామిలిటరీ బలగాలు మోహరించేలా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే కేంద్ర బలగాల రాకను రాష్ట్ర ప్రభుత్వం తప్పు పట్టగా హైకోర్టు మాత్రం స్వాగతించింది. పశ్చిమ బెంగాల్లోని పలు జిల్లాల్లో జరుగుతున్న విధ్వంసం గురించి నివేదికలు అందాయి. వాటిని చూశాక కూడా కళ్లు మూసుకుని ఉండలేమని వ్యాఖ్యానించింది. ఇక ఇప్పటి వరకు జరిగిన అల్లర్లలో ముగ్గురు చనిపోయారని.. సుమారు 150 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం సుతి, ధులియాన్, సంసెర్ గంజ, జంగీపూర్ ప్రాం తాలలో పరిస్థితి ప్రశాంతంగా ఉందని పోలీసులు తెలిపారు.

నిరసనలపై బెంగాల్ ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి మాట్లాడుతూ.. రాష్ట్రంలో హిందువులు "సురక్షితంగా లేరని" ఆరోపించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శాంతి భద్రతల కోసం విజ్ఞప్తి చేస్తూనే.. కొన్ని రాజకీయ పార్టీలు" "రాజకీయ లాభ్ధి కోసం మతాన్ని దుర్వినియోగం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని" ఆరోపణలు చేయడం ఆమె వక్రబుద్ధికి నిదర్శనం అంటూ విమర్శించారు. ఇక మృతి చెందిన వారిలో ఇద్దరు తండ్రీకొడుకులు ఉండగా వారిని హార్‌గోబింద్ దాస్, చందన్ దాస్‌గా గుర్తించారు. కొందరు దుండగులు వీరిని నరికి చంపినట్లు పోలీసులు తెలిపారు. మరోక నిరసన కారుడు బుల్లెట్ గాయాలతో మరణించిట్లు పోలీసులు వెల్లడించారు. ఇక ముర్షిదాబాద్ ప్రాంతంలో 300 మంది బీఎస్‌ఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. హైకోర్టు అత్యంత సున్నిత ప్రాంతాల్లో పారామిలిటరీ బలగాలను మోహరించేలా ఆదేశాలు జారీ చేసింది.

# ఆఫ్ఘన్ శరణార్థులను తిప్పిపంపిస్తున్న పాకిస్థాన్



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 13:** తమదేశంలో అక్రమంగా నివసిస్తున్న ఆఫ్ఘన్‌దేశస్తులపై పాకిస్థాన్ బహిష్కరణ వేటు వేస్తోంది. 2023 సెప్టెంబరులో తొలిసారి ఈప్రక్రియ ప్రారంభించినప్పటినుంచి ఇప్పటివరకూ దాదాపు 8.60 లక్షల మందికి పైగా ఆఫ్ఘన్ శరణార్థులు పాకిస్థాన్‌ను వీడినట్లు తెలుస్తోంది. వీరిలో సుమారు ఐదు లక్షలమంది ఖైబర్ ఫక్తూంఖ్వాలోని రెండు సరిహద్దుక్రాసింగ్‌లద్వారా స్వదేశానికి తరలివెళ్లినట్లు పాకిస్థాన్ విదేశాంగశాఖ వెల్లడించింది. దేశంలో అక్రమంగా నివసిస్తున్న ఆఫ్ఘన్ శరణార్థులను దశలవారీగా వారి స్వదేశానికి తిరిగి పంపించేయాలని పాకిస్థాన్ నిర్ణయించింది. ఇందులో భాగంగా 2023లో మొదటిదశ ప్రారంభించింది. సరైన ధృవపత్రాలు లేకుండా అక్రమంగా ఉంటున్నవారిని మాత్రమే తొలిదశలో తిరిగి పంపినట్లు పాక్ హోంమంత్రి తలాల్ చౌదరి ప్రకటించారు. అంతర్జాతీయ వలసల సంస్థ (ఐఎంఓ) వివరాలను ప్రస్తావించిన పాక్ 2023 సెప్టెంబ 15నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకూ ఉన్న లెక్కలను పరిశీలిస్తే మొత్తం 8,61,763 మంది ఆఫ్ఘన్ దేశస్తులు పాకిస్థాన్‌ను వీడి తమ స్వదేశం వెళ్లిపోయినట్లు తేలింది. ఆఫ్ఘన్ సిటిజన్ కార్డు ఉన్నవారంతా మార్చి 31నాటికి తమ దేశం విడిచి వెళ్లాలని లేదంటే వారిపై బహిష్కరణ వేటు తప్పదని జనవరిలో పాకిస్థాన్ హెచ్చరించింది. తాజాగా వారిని బహిష్కరించే చర్యలను ఏప్రిల్ ఒకటినుంచి ప్రారంభించింది. దీనికింద ఇప్పటి వరకూ 16 వేలమందికిపైగా ఆఫ్ఘన్ సిటిజన్ కార్డుదారులు పాకిస్థాన్ వీడివెళ్లారు. వారిలో తొమ్మిదివేలమందికిపైగా స్వచ్ఛందంగానే వెళ్లపోగా ఆరువేలమందిపై పాకిస్థాన్ బహి ష్కరణ వేటువేసింది.

# కొత్తచట్టం వచ్చాక దర్గా వక్ఫ్ భూమిపై దర్యాప్తు



**సంభాల్, (యుపి), ఏప్రిల్ 13:** దేశంలో వక్ఫ్ భూముల ప్రాముఖ్యత వేరే చెప్పనక్కరలేదు. ప్రస్తుతం ఈ భూములపై చాలా సమస్యలు వెలుగు చూస్తున్నాయి. ఈ క్రమంలోనే సంభాల్ జిల్లాలోని చందౌసి వద్ద ఉన్న ఒక దర్గా వక్ఫ్ భూమి ఆక్రమణపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇటీవల సంభాల్ జిల్లాలోని జానెటా గ్రామ పంచాయతీ వద్ద ఉన్న దాదా మొజ్మియా షా దర్గా, వక్ఫ్ భూమిని అక్రమ ఆక్రమణ జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ భూమిపై షాహిద్ మియాన్ అనే వ్యక్తి అనధికారంగా ప్రవేశించి, అక్కడ వైద్య క్లినిక్ నిర్వహిస్తున్నాడని ఫిర్యాదుదారు జావేద్ తెలిపారు. 2019 నుంచి ఈ భూమి "ముతవల్లి" లేకుండా ఖాళీగా ఉందని, అక్కడ జరిగే వార్షిక ఉర్స్ పండుగ నుంచి ఆదాయం పొందుతున్నారనే విషయాలు వెల్లడయ్యాయి. సంభాల్ జిల్లా తహసీల్దార్ ధీరేంద్ర ప్రతాప్ సింగ్ ఈ అంశంపై వివరణ ఇచ్చారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం, ఈ భూమి వక్ఫ్ భూమిగా నమోదు కాలేదని ఆయన పేర్కొన్నారు. అక్కడి నుంచి జరిగే ఆర్థిక లావాదేవీలు ఇప్పుడు దర్యాప్తు దృష్టిలో ఉంటాయని తెలిపారు. అదేవిధంగా, ఈ భూమి వక్ఫ్ భూమిగా ఎందుకు క్లెయిమ్ చేయబడిందనేది కీలక ప్రశ్నగా మారింది. ఏప్రిల్ 3, 2019 నుంచి వక్ఫ్ చట్టం అమలులోకి వచ్చింది. అందులో కీలకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. వక్ఫ్ భూముల అక్రమ ఆక్రమణ, అన్యాయ వాడకంపై కఠిన చర్యలు తీసుకోవడం అనేది ఈ చట్టం లక్ష్యం. ఈ చట్టం అమలులోకి వచ్చిన తరువాత, వక్ఫ్ భూములపై వచ్చే ప్రతి ఫిర్యాదు తీసుకుని, సంబంధిత పత్రాలను పరిశీలించి, సమగ్ర దర్యాప్తు చేపట్టడం ప్రారంభమైంది. ఫిర్యాదు చేసిన జావేద్ ప్రకారం, వక్ఫ్ భూమిపై అక్రమంగా వైద్య క్లినిక్ నిర్వహించబడుతున్నప్పుడు, అది అనేక ప్రశ్నలను వెలుగులోకి తెస్తుంది. ఈ విషయంపై దర్యాప్తు కొనసాగుతున్నప్పుడు, షాహిద్ మియాన్ దగ్గర నుంచి అవసరమైన పత్రాలు సమర్పించాలని అధికారులు కోరారు. ఈ పత్రాలను పరిశీలించడంతో తరువాతి చర్యలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ విషయం దర్యాప్తు సమయంలో మరింత క్లారిటీ ఇచ్చేందుకు, భూమి గత లావాదేవీలు, అక్కడ జరిగే ఆర్థిక కార్యకలాపాలు వంటి అంశాలపై కసరత్తు చేయనున్నారు. వక్ఫ్ భూములపై జరిగిన అక్రమ ఆక్రమణలు, సమాజంలో తీవ్ర దుష్ప్రభావాలను కలిగిస్తాయి. ఇది ముస్లిం సమాజానికి సంబంధించిన ఆస్తి కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం కాకుండా, సామాజిక సేవల కోసం కూడా ఉపయోగపడాలి. కానీ, ఈ ఆక్రమణల వల్ల, నిజమైన వారికి ఈ భూములు అందుబాటులోకి రావడం లేదు.

ఈ క్రమంలో వక్ఫ్ భూముల విషయంలో సమాజంలో అవగాహన పెంచడం కూడా చాలా ముఖ్యం. ఎందుకంటే అనేకచోట్ల కూడా ఇలాంటి సంఘటనలు జరిగే అవకాశం ఉంది.

# తజకిస్థాన్‌లో భూకంపం: రిక్టర్‌స్కేలుపై 6.4గా నమోదు




**దుషాన్‌బే(తజకిస్తాన్), ఏప్రిల్ 13:** తజికిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.4గా నమోదైంది. ఉదయం 9.54 గంటలకు ఇది సంభవించింది. భూకంప కేంద్రం 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు గుర్తించారు. మయన్మార్‌లో మరోసారి భూకంపం సంభవించింది. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం, ఆదివారం ఉదయం మయన్మార్‌లోని చిన్న నగరమైన మెయిక్టిలా సమీపంలో 5.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. వాస్తవానికి గత నెలలో సంభవించిన భూకంపం ధాటికి దెబ్బతిన్న మాండలే, రాజధాని నగరం నేపిడా మధ్య తాజా భూకంప కేంద్రం ఉన్నట్లు సమాచారం. మార్చి 28న మయన్మార్‌లో 7.7 తీవ్రతతో సంభవించిన భూకంపం భారీ ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం కలిగించింది. భూకంపం ధాటికి మయన్మార్‌లో 3,649 మందికి పైగా మృతి చెందగా, 5,018 మంది గాయపడ్డారని మయన్మార్ సైనిక ప్రభుత్వ ప్రతినిధి మేజర్ జనరల్ జా మిన్ తున్ తెలిపారు. తీవ్ర భూకంపంతో అతలాకుతలమైన మయన్మార్‌లో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా మాండలే, నేపిడాలో రెస్క్యూ సిబ్బంది ముమ్మరంగా శోధిస్తున్నారు. సహాయక చర్యల కోసం ఇప్పటికే "ఆపరేషన్ బ్రహ్మను" ప్రారంభించిన భారత్, తాజాగా రెస్క్యూ ఆపరేషన్ కోసం నాలుగు కాళ్లుండే రోబోటిక్స్ మ్యూల్స్‌ను, నానో డ్రోన్లను పంపింది. వీటి సాయంతో శిథిలాల కింద వెతుకుతున్నారు. సిబ్బంది వెళ్లలేని చోటుకి వీటిని పంపి గాలిస్తున్నారు. భారత్ ఇప్పటికే ఆపరేషన్ బ్రహ్మలో భాగంగా 31 టన్నుల సామగ్రిని సీ17 గ్లోబ్‌మాస్టర్ విమానంలో మయన్మార్‌కు పంపింది. మాండలేలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన భారత ఆర్మీ ఆసుపత్రికి అవసరమైన సామగ్రిని కూడా అందజేసింది. భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ ఆసుపత్రి భూకంప క్షతగాత్రులకు వైద్య సేవలను అందిస్తోంది. భారత నౌకాదళానికి చెందిన "ఐఎన్‌ఎస్ ఘరియాల్" వందల టన్నుల ఆహారాన్ని తిలావా ఓడరేవుకు చేర్చింది. మరోవైపు క్వాడ్ దేశాలైన భారత్, ఆస్ట్రేలియా, అమెరికా, జపాన్‌లు మయన్మార్‌ను ఆదుకునేందుకు ఇటీవల 20 మిలియన్ డాలర్ల మానవతా సాయాన్ని ప్రకటించాయి.

# ఉక్రెయిన్‌లోని భారత్ మందుల కంపెనీపై రష్యాదాడులు



**కీవ్, ఏప్రిల్ 13:** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లోని భారతదేశానికి చెందిన ఓ ఔషధ కంపెనీ గోదాముపై రష్యా దాడి చేసింది. కుసుమ్ అనే కంపెనీకి చెందిన గోదాముపై శనివారం ఈ దాడి జరిగిందని ఢిల్లీలోని ఉక్రెయిన్ రాయబార కార్యాలయం పేర్కొంది. రష్యా కావాలనే ఇండియన్ కంపెనీలను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించింది. ప్రధానంగా పిల్లలు, వృద్ధుల కోసం ఔషధాలు నిల్వ చేసిన గోదాములపై రష్యా ఇలా దాడులు చేస్తోందని విమర్శించింది. భారత్‌కు తాము మిత్రులము అని చెప్పుకుంటున్న రష్యా, కావాలనే ఇలా దాడులు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించింది. అంతకుముందు ఉక్రెయిన్‌లోని బ్రిటన్ రాయబారి మార్టిన్ హారిస్ కూడా రష్యా చేసిన దాడిని ధ్రువీకరించారు. రష్యా డ్రోన్ల దాడిలో ఫార్మా కంపెనీ గోదాము పూర్తిగా ధ్వంసమైందని తెలిపారు. మరోవైపు ఉక్రెయిన్‌తో సహా 29 దేశాల్లో తమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని కుసుమ్ హెల్త్‌కేర్ వెబ్‌సైట్‌లో ఉంది. గత కొన్ని రోజులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్, రష్యాలు కాల్పులు విరమణ చేయాలని ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. అయినప్పటికీ రష్యా, ఉక్రెయిన్‌లోని అనేక లక్షిత ప్రాంతాలపై దాడులు చేస్తూనే ఉంది. కాల్పుల విరమణపై చర్చించడానికి అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కలిశారు. అమెరికా ప్రతిపాదించిన తాత్కాలిక కాల్పుల విరమణను రష్యా నిరాకరించి నేటికి సరిగ్గా నెల రోజులు అయ్యింది. దీనితో రష్యా చేస్తున్న దాడులే శాంతికి ఏకైక అడ్డంకి అని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబిహా ఆరోపించారు. జెద్దాలో అమెరికా మధ్యవర్తిత్వం వహించిన శాంతి చర్చలను సిబిహా ప్రస్తావిస్తూ, కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అంగీకరించింది. కానీ రష్యా మాత్రం దీనికి నిరాకరించింది. బదులుగా షరతులు, డిమాండ్లను మా ముందు ఉంచిందని అన్నారు. ఈ మార్చి 11 నుంచి ఏప్రిల్ 11 వరకు రష్యా, ఉక్రెయిన్‌పై ఏకంగా 70 రకాల క్షిపణులను, 2,200 కంటే ఎక్కువ షాహెద్ డ్రోన్‌లను, 6,000 కంటే ఎక్కువ గైడెడ్ వైమానిక బాంబులను ప్రయోగించిందని సిబిహా అన్నారు.

# రాజ్యాంగేతర శక్తిగా ఢిల్లీ సిఎం భర్త మనీష్ గుప్తా

## మాజీ సీఎం అతిశి సోషల్‌మీడియా ఫొటో వైరల్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** దేశరాజధాని ఢిల్లీ రాజకీయాలు ప్రస్తుతం మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖగుప్తా భర్త మనీష్ గుప్తాపై ఆరోపణలు చేసిన ప్రతిపక్ష నేత మాజీ సీఎం అతిషి సోషల్ మీడియాలో ఒక ఫోటోని షేర్ చేశారు. అందులో, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, ఢిల్లీ జల్‌బోర్డు, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ , ఢిల్లీ అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న వ్యక్తి రేఖ గుప్తా భర్త మనీష్ గుప్తా అని అతిషి పేర్కొన్నారు. మనీష్ గుప్తా ప్రభుత్వ అధికారులు సమావేశంలో పాల్గొన్నట్లు కనిపిస్తున్నారు. ఈ క్రమంలో అతిషి తన పోస్టులో ఇలా పేర్కొన్నారు. ఒక మహిళ గ్రామంలో సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి తర్వాత, ప్రభుత్వ పనులన్నీ ఆమె భర్తే చూసుకుంటారని ఇది వరకు చూశాం. కానీ ఇప్పుడు ఢిల్లీకి ఒక మహిళ ముఖ్యమంత్రి కావడం, ప్రభుత్వ పనులన్నీ ఆమె భర్తే చూసుకోవడం ఇదే మొదటిసారి అని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ఆరోపణలకు ఢిల్లీ బీజేపీ స్పందించింది. బీజేపీ నేత వీరేంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ అతిషి స్వయంగా ఒక మహిళ అయినప్పటికీ, మహిళా నాయకురాలిని అవమానించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అయితే రేఖ గుప్తా భర్త మనీష్ గుప్తా ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త. రేఖ గుప్తా ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ ప్రకారం, వృత్తిరీత్యా వ్యాపారవేత్త అయిన మనీష్‌గుప్తా సంస్థ పేరు నికుంజ్ ఎంటర్‌ప్రైజెస్. మనీష్ గుప్తా కోటక్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఏజెన్సీ అసోసియేట్ కూడా. ఈ సంవత్సరం ప్రారంభంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అయిన తర్వాత, రేఖ గుప్తా తన విజయానికి తన భర్తే కారణమని చెప్పుకొచ్చారు. ఈ వివాదం మరింత పెరుగుతుందా లేదా అనేది చూడాలి మరి.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి దుర్గేష్

# అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం: మంత్రి దుర్గేష్

**విజయవాడ ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** భారతరత్న డా. భీమ్‌రావు అంబేద్కర్ 135వ జయంతిని మంత్రి కందుల దుర్గేష్ నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో అంబేద్కర్ గారు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రపం చంలోనే గొప్ప రాజ్యాంగాన్ని రచించి ప్రజల అవసరాలు, హక్కులను తెలిపిన మహానుభావుడిగా అభివర్ణించారు. భారతదేశంలో అణగారిన కులాల సమానత్వం, సామాజిక న్యాయం కోసం తన జీవితాంతం పోరాడిన గొప్ప వ్యక్తి ప్రకటనలో పేర్కొన్నారు. అంటరానితనంపై ఎక్కుపెట్టిన ఆయుధం, దురహంకారంపై గొంతెత్తిన స్వరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని వివరించారు. న్యాయశాఖ మంత్రిగా సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి వివిధ చట్టాలు, సంస్కరణలు రూపొందించడంలో అంబేద్కర్ పాత్ర మరువలేనిది అన్నారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, సామాజిక సంస్కర్తగా నవభారత వికాసానికి బాటలు వేసిన దార్శనికుడు, సర్వసమానత్వానికి కృషిచేసిన కారణజన్ముడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన పోరాటాలు అనన్య సామాన్యమని తెలిపారు. భారతదేశ సమాజానికి అంబేద్కర్ చేసిన సేవలను గౌరవించి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం అని ఈ సందర్భంగా మంత్రి ప్రజానీకానికి సూచించారు.



సభలో మాట్లాడుతున్న పీఠాధిపతులు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

# ఆశల మాయలో జీవితం నరకప్రాయం

## సర్వాత్మానందగిరి స్వామి

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** జీవుడు ఆశల మాయలో చిక్కుకొని తన బంగారు మయమైన జీవితాన్ని నరక ప్రాయం చేసుకుంటున్నారని ఈ మాయ నుంచి బయటపడాలంటే గురుబోధనల ఆచరణ ఎంతో అవసరమని సర్వాత్మానందగిరి స్వామి అన్నారు. ఇక్కడి శుక బ్రహ్మాశ్రమంలో జరుగుతున్న గీతామకరంద రచయిత,ఆశ్రమ వ్యవస్థాపకుల 112వ జన్మదిన సందర్భంగాను ఆశ్రమ 75వ వార్షికోత్సవం సందర్భంగా సాధువుల సమ్మేళనం ఏర్పాటు చేసారు. ఆదివారం ఆశ్రమంలోని వేదికపై పలువురు పీఠాధిపతులు హాజరై మానవుడు ఎదుర్కొంటున్న సమస్యలకు మూలం స్వార్థం, ఇహలోక మోజుకు సంబందించి భక్తుల్ని చైతన్యవంతుల్ని చేసారు. ఈ సభకు ఆశ్రమ నిర్వాహకులు విద్యాస్వరూపానందగిరి స్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు పీఠాధిపతులు ఆధ్యాత్మిక ప్రవచనాలతో ఆకట్టుకున్నారు.


**మనలోని బ్రహ్మను గుర్తించాలి:** ఈ సభలో ఆశ్రమ నిర్వాహకులు విద్యాస్వరూపానందగిరి స్వామి మాట్లాడుతూ మనిషిలో తమలో నిగూడంగా దాగిని బ్రహ్మను గుర్తించలేకపోతున్నారన్నారు. కర్మ బుద్ధి అనుసారం జీవుడు నడచుకుంటాడని భగవంతుని ఆశీస్సులు లభించాలంటే కఠోర సాధన ఎంతో అవసరం అన్నారు. మనం చేసే మంచిపనులే మనల్ని కాపాడుతాయని మానవ జన్మ అత్యుత్తమైనదనే విషయం విస్మరిస్తున్నామని వివరించారు.

మనస్సును ఆదుపులో పెట్టు కున్నవాడు ప్రశాంత జీవితం గడుపుతాడన్నారు. ఈ సభలో పలు ఆశ్రమాలకు సంబంధించి పీఠాధిపతులు స్వస్వరూపానందగిరి స్వామి, విష్ణుసేవానందగిరి స్వామి శ్రీహరి తీర్థ స్వామి, శివానందగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కష్టాల కొలిమిలో మెరిసిన జాహ్నవి



**విడపనకల్లు,ఏప్రిల్ 13 ప్రభాతవార్త :** శ్రమను నమ్ము కున్న వారు ఎప్పుడూ జయిస్తారు అన్న నానుడి సాక్షాత్కారమైన కథ ఇది. గడేకల్లు గ్రామానికీ చెందిన జెట్టి జాహ్నవి ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ (ఎంపీసీ)లో అత్యుత్తమంగా 990 మార్కులు సాధించి, తన ప్రతి భను నిరూపించుకుంది. బతుకు తెరువు కోసం బొంబాయికి వలస వెళ్లిన తల్లిదండ్రులు శ్రీనివాసులు, లీలావతి దంపతులు కుమార్తె విద్యా భ్యాసానికి ఎంతో కష్టపడుతున్నారు. వీరికి జాహ్నవితో పాటు ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ, తమ పిల్లల విద్యకు ఎటువంటి రాజీ పడకుండా వారిని ఉన్నత చదువులు చదివించాలనే తపనతో వారు బొంబాయిలో కష్టపడి పని చేస్తున్నారు. వారి కష్టానికి ప్రతి ఫలంగా జాహ్నవి ఈ అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంది. అతి సామాన్య కుటుంబానికి చెందిన జాహ్నవి, తల్లిదండ్రులు దూరంగా ఉన్న ప్పటికీ, వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ చదువులో అసాధారణమైన ప్రతిభ కనబరిచింది. ఆమె సాధించిన మార్కులు ప్రతి గ్రామీణ విద్యార్థికి ప్రేరణగా నిలుస్తున్నాయి. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ నా తల్లిదండ్రులే నాకు ఆదర్శం. వారి కష్టాలే నాకు బలం. వారి కలలను నెరవేర్చే దిశగా నేనుముందుకెళ్తాను అంటూ భావోద్వేగానికి లోనయ్యింది. జాహ్నవి భవిష్యత్తులో ఇంజనీరింగ్ చదవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆమె తన కలలను సాకారం చేసుకో వడానికి మరింత కష్టపడతానని ధీమా వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జాహ్నవికి కుటుంబసభ్యులు, కళాశాల యాజమాన్యం, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.



# నదీవిహారంతో కటాక్షించిన స్వామివార్లు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 8 నుండి జరుగుతున్న చైత్రమాస బ్రహోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి నిర్వహించి స్వస్తి పలికారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్ల పవిత్ర మూర్తులకు వసంతోత్సవం జరిపారు. తదుపరి ధాన్యకోటోన్నోత్సవం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు పవిత్ర కృష్ణానదిలో శ్రీ స్వామి అమ్మవార్లకు నదీవిహారం జరపించారు. వేదపండితులు వేదనాదాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా పవిత్ర కృష్ణానదికి తీసుకెళ్ళి అక్కడ అవభధోత్సవం జరిపిన తరువాత తిరిగి శ్రీమల్లేశ్వర స్వామివార్ల మండపానికి తీసుకొచ్చి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మూకబలి, ధ్వజావరోహణం జరిగాయి. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య వి.శివప్రసాద్, దేవస్థానం కార్యనిర్వహాక ఇంజనీర్ వైకుంతరావు, పిఆర్ఓ గంగాధర్, ఆలయాధికారులు నరసింహారాజు, చందు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**అద్భుతంగా నృత్యనీరాజనం:** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన శ్రీ నటరాజ నృత్యనికేతన్ నాట్యాచార్యులు దుర్గాభవాని నేతృత్వంలో శిష్యబృందం అధ్భుతంగా నృత్యనీరాజనాలర్పించారు. 18 మంది కళాకారుల బృందం నృత్యనీరాజనాలర్పించి భక్తుల మన్ననలందుకున్నారు. అనంతరం వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు, ప్రసాదం, చిత్రపటం అందించారు.

# హిందువుల మనోభావాలతో భూమన ఆటలు: మంత్రి సవిత

**విజయవాడ.ఏప్రిల్13.ప్రభాతవార్తప్రతినిధి:** కోట్లాది మంది హిందువుల మనోభావాలతో వైకాంగ్రెస్ నాయకుడు భూమన కరుణాకర రెడ్డి ఆటలాడుకుంటున్నారని, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్రలు పన్నుతున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత,జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. ప్రజల ఛీత్కారానికి గురైనా బుద్ధి రాలేదని, అధికారం కోసం ఎన్ని అడ్డదారులైనా తొక్కడానికి వెనుకాడడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. టీటీడీ గోశాలలో వంద గోవులు మరణించాయంటూ తప్పుడు ప్రచారం చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. హిందువుల ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి వెంకన్నపై గతంలో భూమన కరుణాకరెడ్డి అవాకులు చవాకులు పేలారన్నారు. అదో నల్లరాయి...దాని మీదకు చెప్పు విసిరితే ఏమవుతుందంటూ కోట్లాది మంది హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలు ఎవరూ మరిచిపోరన్నారు. అటువంటి దిగజారుడు వ్యక్తి నేడు టీటీడీ గోశాలలో గోవులు మరణించాయంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.



ఎక్కడో మృతిచెందిన పశువుల మృతదేహాల ఫొటోలను చూపిస్తూ తిరుమలలో చనిపోయాయంటూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. హిందువుల దైవాన్ని కించపరిచిన భూమన వ్యాఖ్యలను, వైసీపీ నాయకులను ప్రజలెవరూ నమ్మ పరిస్థితిలో లేరన్నారు. తిరుమల తిరుపతిలో అన్యమత ప్రచారానికి వెన్నుదన్నుగా భూమన నిలిచిన విషయం ప్రజలకు తెలుసన్నారు. నాస్తికుడిని అని స్వయంగా ప్రకటించికున్న కరుణాకరెడ్డి టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ఫ్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, టిక్కెట్లు అమ్ముకోవడం, డాలర్లు అమ్ముకోవడం వంటి దుశ్చర్యలకు భూమన పాల్పడ్డారని మంత్రి సవిత ఆరోపించారు. తెలుగు ప్రజల కుల దైవంతో రాజకీయాలు చేయడం మానుకోవాలని, లేకుంటే సరైన గుణపాఠం నేర్పుతామని ఆ ప్రకటనలో భూమనకు మంత్రి సవిత హెచ్చరించారు.

**త్రిఫ్ట్ ఫండ్ బకాయిలు విడుదల చేయాలి**

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం 2024- 25 బడ్జెట్లో చేనేతకు త్రిఫ్ట్ ఫండ్ కింద కేటాయించిన రూ.5 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ కోరారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని జయభేరి అపార్ట్‌మెంట్‌లో రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవితను ఆదివారం సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ గత నిధులను విడుదల చేయకపోగా 202526 బడ్జెట్లోనూ రూ.5 కోట్లు కేటాయించినట్లు శాసన మండలిలో మంత్రి చెప్పారని గుర్తు చేశారు. చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్లు విడుదల చేయాలన్నారు. చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన యారన్, పావలా వడ్డీ రిబేటు కింద ఇవ్వాల్సిన రూ.156 కోట్లు ప్రభుత్వం చెల్లించాలని కోరారు. నాబార్డ్‌కు వడ్డీలు కట్టలేక సహకార సంఘాలు దివాళా తీస్తున్నాయన్నారు. చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు మార్గదర్శకాలను విడుదల చేయాలని, 30 శాతం రిబేటును ఏడాది మొత్తం కొనసాగించాలని, మగ్గం వేస్తున్న ప్రతి చేనేత కార్మికుడికి నేతన్న నేస్తం ఇవ్వాలని, సొంత స్థలం ఉన్న కార్మికులకు ఇళ్ల నిర్మాణానికి రూ.6 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రయివేట్ సెక్టార్‌లో చేనేత కార్మికులకు త్రిఫ్ట్ అమలు జరపాలని, పట్టు, జరీ నూలు ధరలను 2021 నాటి ధరలకు తగ్గించాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రద్దు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.శివదుర్గారావు, కార్యదర్శి డి.రామారావు, కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

# జయప్రద ఫౌండేషన్ సేవలు విస్తృతపర్చాలి

## నేత్ర వైద్యశిబిరానికి అనూహ్య స్పందన




జయప్రద ఫౌండేషన్ మెగా నేత్ర వైద్యశిబిర ప్రారంభోత్సవంలో ఫౌండేషన్ లోగో ఆవిష్కరిస్తున్న వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, నిర్వాహకులు తొండెపు దశరథజనార్ధన్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర.

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** ఎన్‌టి రామారావు అందించిన స్ఫూర్తితో ఆవిర్భవించిన జయప్రద ఫౌండేషన్ సేవాసంస్థ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలు మరింతగా విస్తృతపర్చాలని పలువురు నేతలు ఆకాంక్షించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణ శివారులోని పివిఆర్ ఫంక్షన్‌హాలులో ఆదివారం సాయంత్రం మాజీఎంఎల్‌సి, జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండెపు దశరథజనార్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిర ప్రారంభోత్సవంలో వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, శంకర్ నేత్ర చికిత్సాలయ ఎండి డాక్టర్ స్వాతి, రోటరీక్లబ్ ఆఫ్ అమరావతి చెన్నుపాటి వినయ్, జయప్రద ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు గౌతమి సరోజ, ఆపరేటివ్ ఆఫీసర్ చాముండేశ్వరి పాల్గొన్నారు. జయప్రద ఫౌండేషన్ చైర్మన్ దశరథజనార్ధన్ మాట్లాడుతూ తాను తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా, పొలిటికల్ సెక్రటరీగా నిత్యం పది గంటల పైబడి పనిచేస్తున్న పరిస్థితుల్లో తన కుమారుడు, కుమార్తె కలిసి ప్రజలకు సేవ చేసేందుకు ఒక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో తన సతీమణి పేరుతో స్థాపించిన ఈ సంస్థ వితరణశీలుల సహకారంతో అసంఖ్యాక సేవా కార్య క్రమాలను నిర్వర్తించుకోవటం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగివున్న జనార్ధన్ ఏ కార్యక్రమం చేపట్టినా దాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేస్తారన్నారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ జనార్ధన్ ఒక రాజకీయ నాయకుడిగానే కాకుండా ఒక ఉద్యోగిలా నిరంతరం పార్టీకి సేవ చేస్తున్నారన్నారు. ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్, ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కూడా ప్రసంగిస్తూ పేదలకు, ఆర్తులకు, విద్యార్థినీ-విద్యార్థులకు అవసరమైన విషయాలను గుర్తించి వారికి ప్రయోజనం కలిగించే విధంగా ఈట్రస్టు పనిచేస్తుండటం ప్రశంసనీయమని అభినందించారు. కాగా కార్యక్రమాల్లో జయప్రద ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు గౌతమి సరోజ, ఆపరేటివ్ ఆఫీసర్ చాముం డేశ్వరి, టిడిపి నేతలు కట్టా వెంకటనరసింహారావు, వైవిఎస్ రెడ్డి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జగన్ నెవర్ ఎగైన్.. ఇదే నా నినాదం: ఎబివి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 13ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్మోహన్ రెడ్డి ప్రజావ్యతిరేక విధానాలు వల్ల అనేక వ్యవస్థలు, ఎంతో మంది తీవ్రంగా నష్టపోయారని అందుకే ఇకపై జగన్ నెవర్ ఎగైన్ అన్నదే తన నినాదంతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు ఏపీ మాజీ ఇంటిలిజెన్స్ ఛీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన పలు ఆసక్తికరమైన అంశాలు ప్రస్తావించారు.




జగన్ మళ్లీ వస్తే రాష్ట్ర అధోగతి పాలవుతుందన్నారు. త్వరలోనే తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు వెంకటేశ్వరరావు ప్రకటించారు. తన జీవితంలో కాళ్లు, చేతులు ఆడినంత వరకు సమాజంకోసం పనిచేస్తానని తన రిటైర్మెంట్ పంక్షన్‌లో చెప్పానని, అదే కొనసాగిస్తానన్నారు. రాజకీయాల్లోకి రావడం వెనుక ప్రజల మెరుగైన భవిష్యత్తు కోసం ప్రయత్నిస్తానన్నారు. గత అయిదేళ్లపాలనలో జగన్ పార్టీ విధ్వంసం సృష్టించిందని వెంకటేశ్వరరావు అన్నారు. జగన్ ఒక మోనాస్టార్ అంటూ అక్రమాలు చేసే వారికి ఆయన పెద్దపీట వేశారని తెలిపారు.

జనుపల్లి శ్రీనివాసరావు అలియాస్ కోడికత్తి శ్రీను జగన్ వీరాభిమాని అని, అయితే ఆయన కోసం బలి అయిన మొదటి వ్యక్తి కోడికత్తి శ్రీను అని అన్నారు. జగన్ అధికారంలో వచ్చేందుకు సానుభూతికోసమే ఆయనపై దాడికి పాల్పడినట్లు శ్రీను విచారణలో తెలిపాడని, అయితే అయిదు సంవత్సరాలు జెలులో పెట్టించి అతని జీవితాన్ని నాశనం చేశాడని, కోడికత్తి శ్రీనుకు న్యాయస్థానంలో కూడా అన్యాయం జరుగుతోందన్నారు. కోడికత్తి శ్రీనుకు తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు. విజయ సాయిరెడ్డి సహకారంతో రూ.25కోట్లుతో మొదలు అయిన సండూర్ పవర్ ప్రాజెక్టు నెడు రూ.759 కోట్లకు చేరిందని, ఆతరువాత సాక్షి ఛానెల్, భారతి సిమెంట్స్ ఇంకా అనేక అక్రమ కంపెనీలకు పెట్టుబడులు ఇప్పటికే బయటపడ్డాయని, మరిన్ని అక్రమాలు బట్టబయలవుతాయన్నారు. కోకల్లులుగా ఉన్న జగన్ కేసులపై పోరాడతాన న్నారు. జగన్ తనకు వ్యక్తిగతంగా నష్టం చేశాడు. ఆ అకౌంట్ క్లోజ్ అయ్యింది. జగన్‌పై పోరాడే విషయంలో వ్యక్తిగతమైనది ఏమీ లేదని, జగన్ సమాజానికి చేసిన కీడుపై మాత్రమే పోరాటం చేస్తానన్నారు.

# బోయకొండ రోప్ వేకు గ్రీన్ సిగ్నల్

## రాష్ట్రంలోని మరో ఐదు ప్రాంతాల్లో ..





**పుంగనూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పలు పుణ్యక్షేత్రాలలో రోప్ వే ఏర్పాటుకు కేంద్ర పర్యాటక శాఖ నుంచి అనుమతులు మంజూరయ్యాయి. ప్రధానంగా చిత్తూరు జిల్లాలోని పుంగనూరు సమీపంలో శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయానికి వెళ్లేందుకు 0.68 కిలోమీటర్ల ఎత్తు వరకు రోప్ వే నిర్మించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు చోట్ల రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. ఏపీలో రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీలో కన్సల్టెన్సీ సర్వీసుల కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు నేషనల్ హైవేస్ ఏపీలోని ఐదు ప్రాంతాల్లో రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణానికి గానూ డీపీఆర్ తయారీకి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఈ ఐదులో చిత్తూరు జిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయం, కర్నూలు అహోబిలం దేవస్థానం, పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, విజయవాడలోని భవానీ ద్వీపం, తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలోని లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం ఉన్నాయి. చిత్తూరు జిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద దిగువ ఆలయం నుంచి హిల్ టాప్ వరకూ 0.68 కిలోమీటర్ల మేర రోప్‌వే నిర్మాణానికి కసరత్తు ప్రారంభం కానుంది. అలాగే అహోబిలం దేవస్థానం వద్దఎగువ అహోబిలం నుంచి జ్వాల నరసింహస్వామి ఆలయం వరకూ 1.28 కిలోమీటర్లు. కోటప్పకొండ వద్ద కొండ దిగువ నుంచి ఎగువకు, పాత దేవాలయం వరకూ 1.23 కిలోమీటర్ల మేరకు రోప్‌వే నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే విజయవాడలో కృష్ణా నది మీదుగా బెర్మ్ పార్క్ నుంచి భవానీ ఐలాండ్ వరకూ 0.85 కిలోమీటర్ల మేరకు రోప్‌వే నిర్మించాలని ప్రణాళికలు రచిస్తున్నారు. కోరుకొండ లక్ష్మినరసింహస్వామి ఆలయం వద్ద ఆలయం ముందు నుంచి శిఖరాగ్రం వరకు 0.25 కిలోమీటర్లు రోప్‌వే ఏర్పాటు చేయాలనే ఆలోచనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఐదు ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ తయారీలో కన్సల్టెన్సీ సేవల కోసం నేషనల్ హైవేస్ లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు. మరోవైపు ఏపీలోని 25 పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వేల నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ప్రణాళికలు రచిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని పర్యాటకులతో పాటుగా వివిధ రాష్ట్రాల నుంచి సందర్శకులను ఆకర్షించాలనే ఉద్దేశంతో ఏపీటీడీసీ ఈ ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా ప్రముఖ దేవాలయాల వద్ద రోప్ వేలు ఏర్పాటు చేసే ఆలోచనలో ఏపీటీడీసీ ఉంది. చిత్తూరు జిల్లాలోని ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ బోయకొండ గంగమ్మ దేవాలయం కు వెళ్లడానికి రోప్ వే త్వరలో అందుబాటులోకి రాబోతుండ డంతో అమ్మవారి భక్తులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

**ముఖ్యమంత్రికి ధన్యవాదాలు: ఎస్ కే రమణారెడ్డి**

ప్రముఖ శక్తిక్షేత్రం బోయ కొండ గంగమ్మ ఆలయానికి రోప్‌వే ఏర్పాటుకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందదాయకమైన విషయమని బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్ కే రమణారెడ్డి వర్షం వ్యక్తం చేశారు. రోప్ వే ఏర్పాటు చేయడం వల్ల మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

# మైలేజీ కోసం మాజీ ఎంపి గోరంట్ల దురుసు ప్రవర్తన?

**అనంతపురం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త బ్యూరో:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైసిపి తరపున ఫైర్ బ్రాండ్‌గా గుర్తింపు ఉన్న హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ విషయం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ సోషల్ మీడియాలో వైసిపి అధినేత సతీమణి వైయస్ భారతి పై సోషల్ మీడియాలో చేసిన కామెంట్లపై రాష్ట్రంలో కూటం ప్రభుత్వం తీవ్రంగా స్పందించి చేబ్రోలు కిరణ్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు కటకటాలోకి నెట్టింది. మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తే ఎవరిపైన అయినా కఠిన చర్యలు తీసుకుంటామని ఒక హెచ్చరిక చేసే విధంగా చంద్రబాబు సర్కార్ చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో చేబ్రోలు కిరణ్ అరెస్ట్ చేసి తీసుకొని వెళ్లే సమయంలో వైసిపి నాయకుడు, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహరించిన తీరు వివాదాస్పతమైంది. గోరంట్ల మాధవ్ గతంలో ఒక పోలీస్ అధికారిని భావించి పలు సందర్భాల్లో పోలీసులు సున్నితంగా వ్యవహరించి చేబ్రోలు కిరణ్ ను తీసుకెళ్లే సమయంలో తమకు అడ్డు రావద్దని చెప్పిన దృశ్యాలు, గోరంట్ల మాధవ్ అడ్డుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో చర్చనీ అంశం అయ్యాయి. ఈ సంఘటన నేపథ్యంలో గోరంట్ల మాధవ్ పై కేసు నమోదు చేయడం, ఆ తర్వాత అరెస్ట్ చేయడం, కోర్టుకు హాజరు పరచడం, రాజమండ్రి జైలుకు శుక్రవారం తరలించిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఎందుకు చేబ్రోలు పై దాడి విషయంలో ఎక్కువ హడావిడి చేశారు? నిజంగా తమ నేత పై ఆరోపణ చేసినందుకేనా? లేక పార్టీ పార్టీ ముఖ్యుల వద్ద క్రెడిట్ కొట్టేందుకే అన్నది ప్రశ్నాత్మకంగా ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాప్తాడు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మధ్య ఆధిపత్య పోరు ఉంది. రాప్తాడు నియోజకవర్గంలో పట్టు కోసం ఆ రెండు వర్గాలు పోటీ పడుతున్నాయి. రాప్తాడు నియోజకవర్గం లోని రామగిరి ఎంపీపీ ఎన్నికల సమయంలో టిడిపి, వైసిపి వర్గాల మధ్య గొడవలు, వైసీపీ ఎంపీటీసీలను పోలీసులు బెదిరిస్తున్నారని ఆరోపణలు వచ్చినప్పుడు పెనుగొండ పట్టణం, ఇతర ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పోలీసులపై దూసుకెల్లడం, ఇతర సమయాల్లో తనదైన శైలిలో వ్యవహరించి వైసిపి కార్యకర్తల్లో మైలేజీ సంపాదించినట్లు అభిప్రాయం ఉంది.

ఇందులో భాగంగా తాను కూడా హీరోగా వ్యవహరించి పార్టీ నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి వద్ద పేరు తెచ్చుకునేందుకు చేబ్రోలు కిరణ్ పై పోలీసుల సమక్షంలో దాడి చేసేందుకు మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ యత్నించి ఉంటాడని అభిప్రాయం ఉంది. అయితే ఈ వ్యవహారం ఎంతోమంది పోలీసులకు, పోలీసు అధికారుల మెడకు చుట్టుకోవడం గమనిం చదగ్గ విషయం.. చేబ్రోలు కిరణ్ కదలికల పైన గోరంట్ల మాధవ్ కు పోలీసుల సమాచారం ఇచ్చారని, హాస్పటల్లో, ఇతర ప్రాంతాల్లో గోరంట్ల మాధవ్ ఫోన్ మాట్లాడుతుంటే పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించాలని, ఈ వ్యవహారంలో పలు సందర్భాల్లో పోలీసు అధికారులు సరైన రీతిలో స్పందించలేదని రాష్ట్ర ప్రభుత్వం భావించి 11 మంది పోలీసులు, అధికారులపై చర్యలు తీసుకోవడం ఆ టాపిక్ గా మారింది. గోరంట్ల మాధవ్ ఎఫెక్ట్ ఎంతోమంది పోలీస్ అధికారులపై పడడం తెలుగు రాష్ట్రాల్లో చర్చిని అంశంగా మారింది. గోరంట్ల మాధవ్ వ్యవహారంలో పోలీసు అధికారుల సీరియస్....పోలీస్ సిబ్బందిపై దాడికి పాల్పడిన కేసులో నిందితుడు, వైఎస్సార్సీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను గుంటూరు కోర్టులో హాజరుపర్చే సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. దీనిపై విచారణకు గుంటూరు సౌత్ డీఎస్పీ భానోదయను నియమించారు.

మాధవ్‌ను జీజీహెచ్‌లో వైద్య పరీక్షలకు తీసుకెళ్లినప్పుడు అక్కడ ఆయన ఫోన్‌లో మాట్లాడినా బందోబస్తు సిబ్బంది అడ్డు చెప్పలేదు. మీడియా ముందు ప్రవేశపెట్టే ముందు ముసుగు వేసుకోవటానికి నిరాకరించి, తనకే ముసుగు వేస్తారా అంటూ పోలీసులపై కన్నెర చేశారు. కోర్టు వద్ద పోలీస్ వాహనంలోంచి దిగి నేరుగా న్యాయస్థానంలోకి వెళ్లిపోయారు. ఇవన్నీ పోలీసుల వైఫల్యమేనని ఉన్నతాధికారులు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో ఆ రోజు బందోబస్తు విధుల్లో ఉన్న సీఐ, ఎస్సైలు, సిబ్బంది నుంచి డీఎస్పీ భానోదయ వాంగ్మూలాలు నమోదు చేశారు. కస్టడీలో ఉన్న వ్యక్తికి మరో వైఎస్సార్సీపీ నాయకుడు ఫోన్ తీసుకొచ్చి ఇచ్చినా అక్కడున్న పోలీసులు పట్టించుకోకపోవడానికి కారణాలేంటి? ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారో ఆరా తీశారు.

# చదివింది ఆంగ్ల మాధ్యమంలో

## అన్ని సబ్జెక్ట్‌ల్లో 99శాతం, ఇంగ్లీషులో 5 మార్కులు!

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే దండే రాజేశ్వరి ఫలితాలు ఆశ్చర్యకరంగా వచ్చాయి. సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఆమెకు 530 మార్కులకు 431 మార్కులొచ్చాయి. వాస్తవంగా మిగతా అన్ని పేపర్లలో 99.06శాతం మార్కులు వచ్చాయి. కానీ ఇంగ్లీష్‌లో మాత్రం 100కు కేవలం ఐదు మా ర్కులే వచ్చాయి. దీంతో ఆ విద్యార్థిని ఫలితాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాయి. పోనీ ఆ అమ్మాయి ఇంగ్లీషు రాదమోననుకుంటే ఆమె ఇంగ్లీషు మాధ్యమంలో ఇంటర్ చదివింది. పరీక్ష పత్రం దిద్దడం, లేదంటే మార్కులు వేయడంలో పొరపాటు జరిగి ఉండొచ్చని విద్యావేత్తలు చెబుతున్నారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ 60కు 60చొప్పున వచ్చాయి. సంస్కృతం వందకు 98, మ్యాథ్స్ 2ఏ పరీక్షలో 75కి 73, మ్యాథ్స్ 2బిలో 75కి 75 మార్కులొచ్చాయి. ప్రాక్టికల్స్ 60కి 60 వచ్చాయి. కేవలం ఇంగ్లీష్‌లో మాత్రమే ఐదు మార్కులు రావడం కచ్చితంగా పొరపాటు జరగడం వల్లనేనని అంతా భావిస్తున్నారు. అయితే రీకౌంటింగ్ ప్రక్రియతో నిమిత్తం లేకుండా ఇంటర్‌బోర్డు తక్షణం స్పందించి ఈ వ్యవహారంపై ప్రకటన చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా భూభారతి

## మూడు పైలట్ మండలాల ఎంపిక
## నేడు జాతికి అంకితం
## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అందరి భూములకు భద్రత కల్పించడమే ప్రధాన ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని, భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తున్నామని రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆయన సచివాలయంలోని తన ఛాంబర్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.డాక్టర్ బి.ఆర్ .అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి సోమవారం ఈ భూభారతి చట్టాన్ని, పోర్టల్‌ను ప్రజలకు అంకితం చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో రైతుల భూముల పరిరక్షణ బాధ్యత ఈ ప్రభుత్వానిదే.ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.అధికారంలో వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని మేమిచ్చిన హామీని విశ్వసించి ప్రజలు మాకు అధికారం కట్టబెట్టారు.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ధరణిని బంగాళాఖాతంలో వేసి అందరికీ ఆమోదయోగ్యమైన భూ భారతి చట్టాన్ని తీసుకురావడం ఇందులో రెవెన్యూశాఖ మంత్రిగా తనకు భాగస్వామ్యం అయ్యే అవకాశం వచ్చినందుకు తన జన్మ ధన్యమైందన్నారు.రాష్ట్రంలో తొలుత మూడు జిల్లాలలోని మూడు మండలాలలో ప్రయోగాత్మకంగా భూభారతి చట్టాన్ని అమలుచేయబోతున్నామని,ఈ మూడు మండలాలలో వచ్చిన ఫలితాలను దృష్టిలో పెట్టుకొని జూన్ 2వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు.భూభారతి చట్టం 2029 శాసనసభ ఎన్నికలకు మాకు రిఫరెండమని గతంలో శాసనసభ లోనే ప్రకటించామని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూములపై రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా రైతాంగానికి ఒక భరోసా,భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ చట్టం రూపొందించామన్నారు.గతంలో మాదిరిగా రాత్రికి రాత్రే ఇద్దరు వ్యక్తులు కలిసి చట్టాన్ని రూపొందిస్తే మా ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా రైతులు మేధావులు నిపుణులతో చర్చించి చట్టాన్ని రూపొందించాం.గతంలో చెప్పినట్లుగానే భూ భారతి అమలులోకి వచ్చిన తర్వాత ధరణి ముసుగులో జరిగిన భూ అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామని తెలిపారు.ఒకే సారి పోర్టల్‌లో ప్రవేశించవద్దు ఒకేసారి భూ యజమానులు తమ భూమి వివరాలు తెలుసుకునేందుకు పోర్టల్‌ను సందర్శించవద్దని మంత్రి పొంగులేటివిజ్ఞప్తి చేశారు.దీంతో మొత్తం పోర్టల్ ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు.అంతేగాక కొంతమంది ఉద్దేశ పూర్వకంగా పోర్టల్‌ను స్టక్ చేయాలని భావిస్తే తగు చర్యలు తీసుకోవాలని ఇప్పటికేముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారని మంత్రి తెలిపారు. కేంద్రప్రభుత్వ ఎన్ ఐ సి ఆధ్వర్యంలో నిర్వహించే పోర్టల్ లో ఆధునిక అంశాలను జోడిస్తూ అత్యాధునిక వెర్షన్‌ను ప్రజలకు అందించే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. రిజిస్ట్రేషన్లకు ఆటంకం లేకుండా పోర్టల్ అభివృద్ధి సాగుతుంది.వచ్చేనెల మొదటివారంలో గ్రామ రెవెన్యూ పాలనా అధికారులను అమలులోకి తెస్తామని,ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించామన్నారు. గతంలో ధరణిని తీసుకువచ్చిన సమయంలో దాదాపు 4 నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని,ఇప్పుడాపరిస్థితి లేకుండా క్రమక్రమంగా పోర్టల్‌ను అభివృద్ది చేస్తున్నా మన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా భూ భూభారతి చట్టం, పోర్టల్ అమలుకు సంబంధించి ఎంపిక చేసిన ప్రయో గాత్మక గ్రామాలలో స్వయంగా తాను పర్యటిస్తానని మంత్రి పొంగులేటి వెల్లడించారు. అదేవిధంగా సంబంధిత మంత్రులు కూడా పర్యటిస్తారని తెలిపారు.అదేవిధంగా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులు నిర్వ హించేందుకు నిర్ణయించామన్నారు. భూభారతిలో ఎమ్మా ర్వో స్థాయి నుంచి సిసిఎల్ వరకు సుమారు ఐదు స్థాయి లలో భూ సమస్యల పరిష్కారానికి వీలుగా అధికారాలు వికేం ద్రీకరణ చేశాం. అంతేగాక ప్రజల నుంచి వచ్చే ఫిర్యా దుల సంఖ్య ఆధారంగా ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తాం. తర్వాత కాలంలో సమస్యలు తగ్గితే ట్రిబ్యు నల్స్‌ను కుదిస్తాం. ధరణిలో గతంలో ఉండే 33 మా డ్యూళ్లను ఆరు మాడ్యూల్స్‌కు తగ్గించామని దీంతో అంద రికీ ఈ పోర్టల్ సులభతరంగా ఉంటుందన్నారు.



సన్నబియ్యం భోజనం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

# సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయం

## సరఫరాలో అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు: మంత్రి శ్రీధర్‌బాబు

**కాటారం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మకమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.ఆదివారం కాటారం మండలం, కొత్తపల్లి తండా గ్రామ నివాసి అయిన వాంకుడోతు సమ్మక్క ఇంట్లో సన్నబియ్యంతో చేసిన బోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేషన్ కార్డులున్న నిరుపేదల కుటుంబాలు సన్నబియ్యం ఆహారాన్ని భుజించాలనే సంకల్పంతో ఉగాది పండుగ రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వాంకు డోతు సమ్మక్క కుటుంబ సభ్యులతో ముకాముఖీ.మాట్లాడారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయి, దొడ్డు బియ్యానికి సన్నబియ్యానికి తేడా ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పేదలు కడుపునిండా సన్నబియ్యంతో భోజనం చేయాలని అందుకు సన్న రకం ధాన్యం అవసరమని భావించిన ప్రభుత్వం సన్నరకం ధాన్యం సాగు చేసిన రైతులకు బస్తాకు రూ.500 బోనస్ చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మండల ప్రత్యేక అధికారి, డిఆర్డీఓ నరేష్, తహసీల్దార్ నాగరాజు, ఎంపిడిఓ బాబు, ఎంపివో వీరస్వామి కాంగ్రెస్ పార్టీ కాటారం మండల అధ్యక్షులు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపిపి పంతకాని సమ్మయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాపు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దండు రమేష్, యూత్ కాంగ్రెస్ మంథని నియోజకవర్గ అధ్యక్షులు చీమల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో కెకె మనవడు వీరంగం

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు మనువడు ధృవ్ విప్లవ్ హల్‌చల్ చేశారు. మద్యం మత్తులో ఆదివారం ర్యాష్ డ్రైవింగ్ చేశారు.ఓ ట్రాలీ ఆటోను ఢీకొట్టి..అలాగే దూసుకెళ్లారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ధృవ్ కారును ఛేదించారు. అనంతరం ధృవ్‌ను అదుపులోకి తీసుకొని బ్రీత్ అనలైజర్‌తో బంజారాహిల్స్ పోలీసులు టెస్టులు నిర్వహించారు. ఈ బ్రీత్ అనలైజర్ టెస్టులో 150కి పైగా పాయింట్లు వచ్చినట్లు నిర్ధారణ కావడంతో కారును సీజ్ చేసి ధృవ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

# బిపి మండల్ కమిషన్ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలి

## రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** రాజ్యాంగ బద్ధంగా నియమించిన బిపి మండల్ కమిషన్ సిఫార్సులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా అమలు చేయాలని, రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మండల్ కమిషన్ చేసిన 40 సిఫార్సులలో కేవలం 3 సిఫార్సులు మాత్రమే అమలు చేస్తున్నారని, మిగతా సిఫార్సులను ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. బిపి మండల్ వర్ధంతిని పురస్కరించుకుని యాదవ రాజ్యాధికార సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన బిసి మండల్ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలోని బిసిలను ప్రభుత్వాలు బిచ్చగాళ్ళగా చేశారని ధ్వజమెత్తారు. బిసిల కోసం దేశవ్యాప్తంగా పర్యటించి 40 సిఫార్సులను రూపొందించిన బిపి మండల్ కే ంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డును ప్రకటించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సమావేశంలో బిపి మండల్ మనువడు ప్రొఫెసర్ సూరజ్, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్, బిసి నాయకులు చిన్న శ్రీశైలంయాదవ్, రాందేవ్, రామకృష్ణ, లింగస్వామి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# టిజిపిఎస్సీకి క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు: రాకేశ్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 13:** పూర్తి ఆధారాలతో గ్రూప్1 అవకతవకలు బయట పెట్టామని,టిజిపిఎస్సీకి క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని బిఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి అన్నారు. అవకతవకలపై ప్రశ్నలకు టిజిపిఎస్సీ సమాధానాలు చెప్పట్లేదని,నోటీసులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ అభ్యర్థులకు జవాబివ్వడంలో చూపాలని విమర్శించారు. తానే టిజిపిఎస్సీపై పరువు నష్టం దావా వేయబోతున్నానని తెలిపారు.టాప్ 500లో ఒక్క తెలుగు మీడియం అభ్యర్థి కూడా ఎందుకు లేదు? ప్రిలిమ్స్,మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టిక్కెటున ఎందుకిచ్చారు? మహిళ,పురుషులకు వేర్వేరు కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేశారు? మొత్తం 16 సెంటర్లుంటే 2, 3 సెంటర్ల నుంచే టాపర్స్ ఎందుకు వచ్చారు? రిటైర్డ్,కాంట్రాక్ట్ లెక్చరర్లతో గ్రూప్1 పేపర్లు దిద్దిస్తారా? అని ప్రశ్నించారు. గ్రూప్1 అవతవకలపై పోరాటం కొనసాగిస్తాం, దీనిపై న్యాయ విచారణ జరిపిస్తే అన్ని ఆధారాలు చూపిస్తాం అని పేర్కొన్నారు.

# బాలనగర్‌లో ట్రాఫిక్ పోలీసుల నిరక్ష్యానికి వాహనదారుడు మృతి

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** రోడ్డుపై రన్నింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ చలాన్ విధించేందుకు ఆపే క్రమంలో అదుపుతప్పి ద్విచక్రవాహనం కింద పడింది. దీంతో వెనుక నుండి వచ్చిన ఆర్టీసీ బస్సు అతనిపై నుండి వెళ్లడంతో వాహన చోదకుడు మృతి చెందిన సంఘటన బాలనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివేకానంద నగర్ ప్రాంతానికి చెందిన కార్పెంటర్‌గా పని చేసే జోష్ బాబు (37) ఆదివారం షాపూర్ నగర్ నుండి బాలనగర్‌కు వెళుతుండగా ఐడిపిఎల్ వద్ద విధుల్లో ఉన్న కానిస్టేబుల్ బైకును చలన్ వేసేందుకు ఆపే ప్రయత్నం చేశారు. కానిస్టేబుల్‌కి జోష్‌బాబుకు మధ్య వాగ్వాదం జరిగి తోపులాటకు దారి తీసింది. దీంతో బైక్ నడుపుతున్న జోష్ బాబు కింద పడడంతో బాలనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు జోష్ బాబు తలపై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్థానికంగా ఉన్న వాహన చోదకులు ట్రాఫిక్ పోలీసుల నిరక్ష్యం వల్ల వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడని ఆరోపిస్తూ రోడ్డుపై ధర్నాకు దిగారు. ఆందోళన కారణంగా బాలానగర్ నుండి నర్సాపూర్ వెళ్లే రహదారిలో పూర్తిగా ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. ట్రాఫిక్ పోలీసుల తీరుపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అకారణంగా చలాన్ కోసం ఓ వ్యక్తి మరణానికి కారణమైన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని, అలాగే పోలీసులు ప్రజలపై అమానుషంగా ప్రవర్తించి లాఠీచార్జి చేసేందుకు ప్రయత్నించారని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# వక్ఫ్ చట్టానికి నిరసనగా 19న నిరసన బహిరంగ సభ

## బిజెపి ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకం: ఎంపి అసదుద్దీన్‌ఓవైసీ



**హైదరాబాద్ (చార్మినార్), ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ముస్లింలకు వక్ఫ్ సవరణ బిల్లు వల్ల ఎటువంటి లాభం కలగదని ఐఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. దారు సలాంలోని ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపి అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 19వ తేదీన రాత్రి 7 గంటలు నుంచి 10 గంటలు వరకు దారుసలాంలోని ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో నిరసన బహిరంగ సభ జరగుతుందని తెలిపారు.దారుసలాంలో జరగనున్న నిరసన బహిరంగ సభలో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ప్రముఖ రాజకీయ పార్టీల నాయకులు,ముస్లిం మత ప్రముఖు పాల్గొంటున్నారని ఆయన తెలియజేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ బిల్లును తీసుకు వచ్చిందని,వక్ఫ్ సవరణ బిల్లు వల్ల ముస్లింలకు ఎటువంటి ఉపయోగం లేదని ఆయన తెలిపారు. వక్ఫ్ బిల్లు వల్ల ముస్లింలు తీవ్రంగా నష్ట పోయే అవకాశం ఉందని,కేంద్రంలోని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా పని చేస్తున్నదని ఆయన తెలియజేశారు. ఈ నెల 19వ తేదీన రాత్రి ఏడు గంటలు నుంచి పది గంటలు వరకుదారుసలాంలో ప్రశాంతంగా వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన సభను నిర్వహించనున్నామని ఎంపి అసదుద్దీన్ ఓవైసీ తెలియజేశారు.

# వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని ఉపసంహారించేంత వరకు ఉద్యమం

## వేలాది మంది ముస్లింలు భారీ ర్యాలీ





బషీర్‌బాగ్‌లో రోడ్డుపై బైఠాయించిన ముస్లింలు

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది ముస్లింలు ఆదివారం బషీర్‌బాగ్‌లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది జాతీయ జెండాలను, నల్ల జెండాలను చేబూని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో ముస్లింలు వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలని, బిజెపి, ప్రధాని నరేంద్రమోదీ డౌన్, డౌన్ అంటూ బషీర్‌బాగ్ దద్దరిల్లేలా నినాదాలు చేశారు. బషీర్‌బాగ్‌లో కొంత సేపు రోడ్డుమీద, అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు మీద బైఠాయించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను వివిధ మార్గాలకు మళ్లించారు. ర్యాలీలో కా ంగ్రెస్ పార్టీ నాయకుడు ఉస్మాన్ బింగ్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ఆలీ, పార్లమెంట్ సభ్యుడు ఉస్మాన్‌బింగ్ మహ్మద్‌ఆల్‌అజ్రి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ తదితరులు మాట్లాడారు. దేశంలోని కోట్లాది మంది ముస్లింలకు అన్యాయం జరిగేలా వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ఉందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ముస్లింలు ఈ చట్టాన్ని వ్య తిరేకిస్తున్నారని వారు తెలిపారు. బిల్లును ఉపసంహారించేంత వరకు ఉద్యమాలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# కాంగ్రెస్ పేదల పక్షపాతి.. పాలనలో మహిళలకు ప్రాధాన్యం

## రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి అని మరోసారి నిరూపితమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. సిద్దిపేట జిల్లా అర్బన్ మండలం బూర్గుపల్లిలో గ్రామంలోని దళిత కుటుంబం సడిమెల పద్మ బాలయ్య దంపతుల ఇంట్లో రేషన్ కార్డు ద్వారా తీసుకున్న సన్న బియ్యం భోజానాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి తిన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల కడుపు నింపడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు నిరంతరం కృషి చేస్తుందన్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సర్కారు నిరంతరం కొనసాగిస్తుందన్నారు.

కాంగ్రెస్ సర్కారు మహిళల అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందన్నారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ సర్కారుకు ప్రతి ఒక్కరూ అండగా నిలువాలన్నారు. సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూజల గోపికృష్ణ, కలీం, భిక్షపతి, ఎల్లం యాదవ్, అంజయ్య, వాహబ్, రేణుక, రజిని, మమత, నవీన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, చిత్రంలో విసి ప్రొ.కుమార్

# మహనీయుల సామాజిక స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్ల బిల్లు తెచ్చాం

## మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (తార్నాక), ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** నాలుగు రోజులుగా ఒయులో జరుగుతున్న మహనీయులు జయంత్యుత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ మహనీయుల జీవితాలు, వారు చూపిన మార్గాలపై లోతైన చర్చ జరగాలన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, జగ్జీవన్ రామ్, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ల జీవితం, వారు నడిచిన మార్గం పై విశ్వవిద్యాలయాలు అధ్యయనం చేయాలని కోరారు. మహనీయులు ఇచ్చిన సామాజిక స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ, 42శాతం రిజర్వేషన్ల బిల్లును ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. విశ్వవిద్యాలయాల నుంచి పరిపక్వత కలిగిన భవిష్యత్తు నాయకత్వం ఎన్నికల ద్వారానే సాధ్యమని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల అభ్యున్నతి, ఉద్యోగ కల్పన, నైపుణ్యాల అభివృద్ధి తోనే తెలంగాణ రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధ్యమన్న పొన్నం ప్రభాకర్... ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని అన్నారు. నాలుగు రోజులపాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం చేపట్టిన మహనీయుల జయంత్యుత్సవాల కార్యక్రమాలను ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం వివరించారు. మహాత్మా జ్యోతిబా పూలే జీవితంపై ఓయూలోని ఫూలే పరిశోధనా కేంద్రం తీసుకొచ్చన పలు పరిశోధనా పత్రాలతో కూడిన తొమ్మిది పూస్తకాలను మంత్రి పొన్నం ప్రభాకర్, ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం చేతులమీదుగా ఆవిష్కరించారు.

# సమాజానికి ఆదర్శం.. వనజీవి జీవితం



## ఆయన మరణం బాధాకరం, తీరని లోటు
## కుటుంబసభ్యులను పరామర్శించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ఖమ్మం రూరల్, ప్రభాతవార్త:** వనజీవి రామయ్య మొక్కలు నాటి, చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షి ంచి సమజానికే ఆదర్శవంతంగా నిలిచా రని, ఆయన మరణం తీరని లోటని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలోని వనజీవి స్వగృహంలో ఉంచిన పార్థివ దేహాన్ని సందర్శించి మంత్రి, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డితో కలిసి నివాళులర్పించారు. రామయ్య రెండు రోజుల క్రితం గుండెపోటుతో మరణించిన విషయం విదితమే. ఆయన అంత్య క్రియల కార్యక్రమానికి హాజరైన మంత్రి పొంగులేటి.. వనజీవి కుటుంబ సభ్య లను పరామర్శించారు. సమాజ హితంకోరే రామయ్య జీవించి ఉన్నంతకాలం పర్యావరణ పరిరక్షణ లో తన వంతు పాత్ర పోషించిన ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి మాటా ్లడుతూ... వనజీవి రామయ్య జీవితం స్ఫూర్తి దాయకమని అన్నారు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిగూడెం లో దివంగత పద్మశ్రీ వనజీవి(దరిపల్లి) రామయ్య పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వనజీవి రామయ్య మృతి చాలా దురదృష్టకరం, బాధాకరమని అన్నారు. ప్రభుత్వ పక్షాన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్షాన, స్థానిక శాసనసభ్యునిగా తన పక్షాన వనజీవి రామయ్య ఆత్మ శాంతించాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎన్ని ఇబ్బందులు వచ్చిన, ఎన్ని కష్టాలు ఎదురైనా, ఆర్థికంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్న, వాటన్నిటినీ అధిగమించి, కోటి మొక్కలకు పైగా నాటారని అన్నారు. వేలాది కోట్ల విత్తనాలను, వందలాది ఎకరాల్లో జీవం పోశారన్నారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, రూరల్ తహసిల్దార్ రాం ప్రసాద్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పవన సుతునికి భక్తజన హారతులు



## కొండగట్టులో అర్ధరాత్రి పోటెత్తిన అంజన్న దీక్ష స్వాములు
## ముగిసిన చిన్నహనుమాన్ జయంతోత్సవాలు

**మల్యాల (జగిత్యాల జిల్లా), ప్రభాతవార్త :** రామ లక్ష్మణ జానకి.. జై బోలో హను మాన్‌కి.. జైశ్రీరామ్ జై హనుమాన్ నినాదాలతో తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లాలోని కొండ గట్టు అంజన్న క్షేత్రం దద్దరిల్లిపోయింది. హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా వేలాదిగా దీక్షలు చేపట్టిన భక్తులు మాల విరమణకు శనివారం రాత్రి నుండి వేలాదిగా వాహనాలలో కొండపైకి చేరడంతో అంజన్న క్షేత్రం కాషాయ దండు తో పులకరించిపోయింది, తమ దీక్ష విరమణ కోసం వందలాది కిలోమీటర్ల నుండి పాదయాత్రలు చేస్తూ నగర సంకీర్తనలతో హనుమాన్ నామస్మరణతో కొండపైకి వచ్చిన భక్తులతో శనివారం రాత్రి 8 నుండి తెల్లవారు 4 గంటల వరకు అంజన్న క్షేత్రం ఒక్కసారిగా రద్దీమయం కాగా, దీక్షల విరమణ, కోనేరులో స్నానం, శ్రీ స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూ లైన్ లో వేచి ఉన్నారు,, జయంతి పురస్కరించుకొని దీక్షలు చేపట్టిన భక్తులు మాల విరమణకు వేల సంఖ్యలో కొండగట్టు చుట్టుముట్టడంతో ఒకవైపు భక్తుల రద్దీ, మరొకవైపు దీక్ష స్వాములతో పోటెత్తగా, అదుపు చేసేందుకు అర్ధరాత్రి వేళ జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షి స్తూ జయంతిని సాఫీగా కొనసాగించ్చేదుకు ఎప్పటికప్పుడు వాకీ టాకీలతోచర్యలు తీసుకున్నారు, దొంగల మరి రోడ్డు నుండి వైద్య జంక్షన్ వారికి అర్ధరాత్రి వేళ వాహనాలు భక్తులతో ట్రాఫిక్ జామ్ ఏర్పడగా పోలీసులు వాటిని నియంత్రించేందుకు రెండు గంటలు పట్టింది, గుంపులుగా వచ్చిన దీక్ష చేపట్టిన స్వాములు మాల విరమణ చేసుకుని ముడుపులు చెల్లించుకుని శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా సుమారు రెండు లక్షలకు పైగానే భక్తులు శ్రీ స్వామివారి దర్శించుకున్నట్టు అంచనా వేస్తున్నారు,,

### అంజన్న భక్తుల నగర సంకీర్తన హోరు

జయంతి ఉత్సవాల సందర్భంగా దీక్షలు చేపట్టిన భక్తులు కొండపైకి చేరే సమయంలో నగర సంకీర్తనలు, జైశ్రీరామ్ ,,జై హనుమాన్ నినాదాలతో హోరెత్తించారు, వివిధ ప్రాంతాల నుండి బైక్ ల ద్వారా హనుమాన్ జంటలతో నినాదాలు చేస్తూ ర్యాలీ ద్వారా చేరుకున్నారు, కాలినడకన వచ్చే భక్తులు, సోదర ప్రాంతాల నుండి వాహనాలను వచ్చిన కాషాయ దండు కొండగట్టు శనివారం రాత్రి ఆలయం చుట్టూ ముట్టడంతో కొండగట్టు అంజన్న నామస్మరణతో భక్తులు తమ భక్తి భావాన్ని చాటుకున్నారు.

### శ్రీస్వామివారికి విశేష పూజలు పూజలు

అంజన్న జయంతి ఉత్సవాల భాగంగా మూడవరోజు ఆదివారం శ్రీ స్వామివార్లకు ఆలయ అర్చకులు వేద పండి తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా మూల విరాట్ కి పట్టు వస్త్రాలు అలంకరణతో పాటు ప్రత్యేక అభిషేకాలు, సహస్ర పుష్పాలంకరణ, అరటి పండ్లు సమర్పించి, సహస్ర నాగవల్లి అర్చన, విశేష పూజలను నిర్వహించారు, అదేవిధంగా ఆలయ క్షేత్ర పాలకుడు శ్రీ బేతల స్వామి వారి ఆలయంలో కూడా ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అనేకమంది భక్తులు బేతల స్వామి వారిని కూడా దర్శించుకున్నారు. అక్కడే ఉన్న అల్లుబండ వద్ద కూడా తమ కోరికలను నెరవేరాలని భక్తులు రూపాయి బిళ్ళతో అల్లు బండతో తమ బహారాన్ని స్వామివారికి సమర్పించుకున్నారు,

### కొండగట్టులో మకాం వేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

కాగా జయంతి సందర్భంగా ఎటువంటి ఆవంచనీయ సంఘటనలు జరగకుండా జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్లు శనివారం అర్ధరాత్రి నుండి కొండగట్టులోనే మకాం వేశారు, అర్ధరాత్రి పోటెత్తిన భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షి స్తూ కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు, ఆయనతోపాటు ఆలయ ఈవో శ్రీకాంత్ రావు, డిఎస్పి రఘు చందర్ సిఐ నీలం రవి మల్యాల ఎస్ఐ నరేష్ కుమార్ లతోపాటు 900 మంది సిబ్బంది, వివిధ శాఖల అధికారులు సిబ్బంది అహర్నిశలు ఉత్సవాల విధుల్లో కృషి చేశారు,

### భక్తుల సేవలో ఉత్సవ కమిటీ సభ్యులు

అంతేకాకుండా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచన మేరకు ఎండోమెంట్ కమిషనర్ నియమించిన జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు సంతప్రకాష్ రెడ్డి, కంచర్ల లక్ష్మణ చారిలు కూడా ఉత్సవానికి హాజరైన భక్తులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి తమ సేవలందించారు.

తెర

# చివరి ఇరవై నిముషాలు ప్రేక్షకుల కళ్లలో నీళ్లు తిరుగుతాయి

## అర్జున్ S/o. వైజయంతి ప్రీరిలీజ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్




**నందమూరి కల్యాణ్ రామ్** మోస్ట్ ఎవైటెడ్ మూవీ అర్జున్ S/o. వైజయంతి. ఈ చిత్రంలో విజయ శాంతి పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. ఈ యాక్షన్‌ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఈ రెండు పాత్రలు మధ్య డైనమిక్స్ కీలకంగా వుండబోతు న్నాయి. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించి ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. 'అర్జున్ S/o. వైజయంతి' టీజర్, సాంగ్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా ఏప్రిల్ 18న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ మ్యాసీవ్ ప్రీరిలీజ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. మ్యాన్ అఫ్ మాసెస్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ చీఫ్ గెస్ట్‌గా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది.

ప్రీరిలీజ్ ఈవెంట్లో మ్యాన్ ఆఫ్ మాసెస్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ, చాలామంది గొప్ప సినిమాలు చేసి అద్భుతంగా అలరించారు. కానీ విజయశాంతి సాధించినటువంటి గొప్పతనం ఏ మహిళ సాధించలేదు, కర్తవ్యం, ప్రతిఘటన, మగరాయుడు ఇలా ఎన్నో వైవిధ్యమైనటువంటి పాత్రలు చేశారు. ఈ చిత్రం ఆలోచన కూడా కర్తవ్యంలో ఉన్న పాత్రకు ఒక కొడుకు పుడితే ఎలా ఉంటుందో అనే ఆలోచన నుంచే మొదలయింటుం దని భావిస్తున్నాను. ఈ సినిమా నేను చూశాను. విజయశాంతి లేకపోతే ఈ సినిమా లేదు. ఒక్కొక్కళ్ళు ప్రాణంపెట్టి ఈ సినిమాకు పని చేశారు. సినిమా చూసిన నాకు తెలుసు ఈ సినిమాని వాళ్ళు ఎంత నమ్మారో. 18 తారీఖున మీ అందరి ముందుకు రాబోతుంది ఈ సినిమా. రాసి పెట్టుకోండి. ఆఖరి 20 నిమిషాలు థియేటర్స్‌లో కూర్చున్న ప్రతి ఒక్కరి కళ్ళల్లో నీళ్ల తిరుగుతాయి. అంత అద్భుతంగా మలిచారు. అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి కళ్యాణ్ అన్నకెరీర్‌లో ఒక స్పెషల్ మూవీగా నిలిచిపోతుంది. ఈ సినిమాలో సాంకేతిక నిపుణులకు నటీనటులందరికీ నా అభినందనలు. ఏప్రిల్ 18న అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి సినిమా రిలీజ్ కాబోతుంది. ఆగస్టు 14న వార్ 2 సినిమా రిలీజ్ కాబోతుంది. ఆ సినిమా కూడా చాలా అద్భుతంగా వచ్చింది. తప్పకుండా మిమ్మల్ని అలరిస్తుంది. అర్జున్ సన్ అఫ్ వైజయంతి చిత్రాన్ని భారీ విజయం దిశగా తీసుకెళ్లాలని మిమ్మల్ని అందరిని కోరుకుంటున్నాను అన్నారు.

హీరో నందమూరి కల్యాణ్ రామ్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ సినిమాకి మూడు ఈవెంట్లు చేశాం. ఆ ఈవెంట్స్‌లో మాట్లాడాను. ఈరోజు నేను మాట్లాడటం కన్నా సక్సెస్ మీట్‌లో మాట్లాడాలని అనుకుంటున్నాను. ఏప్రిల్ 18 సినిమా రిలీజ్ అయిన తర్వాత సక్సెస్ మీట్ లో మాట్లాడుతాను. కానీ ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. మనం చాలా సినిమాలు చూస్తాం. థియేటర్ నుంచి బయటికి వెళ్ళగానే మర్చిపోతాం. కానీ కొన్ని సినిమాలే ఇంటికి వెళ్లక కూడా మనసుని హత్తుకు హత్తుకునే ఉంటాయి. అలాంటి సినిమా మా అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి అన్నారు. లేడీ సూపర్ స్టార్ విజయశాంతి మాట్లాడుతూ, ఈ సినిమా అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ మూవీ. ఈ సినిమాలో తల్లి కొడుకు పాత్రల మధ్య జరిగే యుద్ధం రేపు సినిమాచూస్తే మీకు అర్థమవుతుంది. ఈ సినిమాకి పాజిటివ్ రిపోర్ట్స్ వస్తూనే ఉన్నాయి. కచ్చితంగా హిట్టు కొట్టబోతున్నామని ఫిక్స్ అయిపోయాం. ప్రతి ఒక్క తల్లికి ప్రతి ఒక్క మహిళకి ఈ సినిమాని మేము డెడికేట్ చేదల్చుకున్నాం. ఈ సినిమా క్లైమాక్స్ చూసి షాక్ అవుతారు. అభిమానులు ఇచ్చే ఉత్సాహం మాలో 100 రెట్లు బలాన్ని ఇస్తుంది. జూనియర్ ఎన్టీఆర్ కళ్యాణ్ రామ్‌ని చూస్తుంటే రామలక్ష్మణుల్లా ఉన్నారు. చూడ ముచ్చటగా ఉన్నారు మీరు ఇలానే సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను. కళ్యాణ్ రామ్ సపోర్ట్ వల్ల ఈ సినిమాలో నేను ఇంకా అద్భుతంగా చేయగలిగాను. ఈ సినిమాల్లో పనిచేసిన అందరికీ పేరుపేరునా అభినందనలు తెలియజేసుకుంటున్నాను. ఈ సినిమా ఏప్రిల్ 18న రిలీజ్ అవుతుంది. తప్పకుండా సూపర్ హిట్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు.

ప్రొడ్యూసర్ అశోక్ వర్ధన్ ముప్పా మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈవెంట్ కి విచ్చేసిన మా తారక్‌కి స్పెషల్ థాంక్స్. అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా కోసం కల్యాణ్ రామ్ రెండేళ్లు కష్టపడ్డారు. కల్యాణ్, విజయశాంతి వల్లే ఈ సినిమా సాధ్యపడింది. ఈ సినిమాలో పనిచేసిన ప్రతి ఆర్టిస్ట్‌కి టెక్నీషియన్స్‌కి పేరుపేరునా ధన్యవాదాలు. ఏప్రిల్ 18న ఈ సినిమా రిలీజ్ అవుతుంది. తప్పకుండా అందరూ ఈ సినిమాను చూసి మంచి విజయాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. సక్సెస్ మీట్‌కి మళ్లీ తారక్ గారిని ఆహ్వానిద్దాం. అందరికీ థాంక్యు అన్నారు.

సోహెల్‌ఖాన్ మాట్లాడుతూ అందరికీ నమస్కారం. నేను ఎన్టీఆర్ బృందావనం సినిమా చూశాను. అప్పట్నుంచి ఆయనకి అభిమానిగా మారిపోయాను. విజయశాంతికి నేను పెద్ద అభిమానిని. ఆమె అందరికీ స్ఫూర్తి. నన్ను ఈ క్యారెక్టర్‌లో బిలీవ్ చేసిన ప్రదీప్‌కిథాంక్యూ. సినిమా బ్యూటిఫుల్ జర్నీ. సినిమా డెఫినెట్‌గా మీ అందరికీ నచ్చుతుంది అన్నారు. హీరోయిన్ సాయి మంజ్రేకర్ మాట్లా డుతూ, అందరికీ నమస్కారం. ఈ సినిమా యూనిట్ అందరికీ థాంక్యూ డైరెక్టర్ ప్రదీప్ అద్భుతంగా ఈ సినిమాని తీశారు. చాలా గ్రేట్ విజన్‌తో సినిమాని రూపొందించారు. విజయశాంతి మా అందరికీ ఇన్స్పిరేషన్. సినిమాలో పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. అందరూ చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను.

యాక్టర్ పృథ్వీ మాట్లాడుతూ, ఈ సినిమా ఫస్ట్ డే షూటింగ్ అప్పుడు కళ్యాణ్‌ని ఇది పాన్ ఇండియా రేంజ్‌లో చేద్దాం అని చెప్పాను. అందుకు ఆయన నేను తెలుగువాడిని తెలుగులోనే చేద్దాం అని అన్నారు. థాంక్యూ కల్యాణ్ రామ్ మమ్మల్ని ఎంతగానో ఎంటర్టైన్ చేస్తున్న జూనియర్ ఎన్టీఆర్‌కి థాంక్యూ సోమచ్. ఇది బ్యూటిఫుల్ సినిమా. అందరూ ఏప్రిల్ 18న వచ్చి సినిమా చూడండి. కచ్చితంగా మీ అందరికీ నచ్చుతుంది అన్నారు.

డైరెక్టర్ ప్రదీప్ చిలుకూరి మాట్లాడుతూ, నన్ను ఇన్స్పైర్ చేసిన స్టార్ జూనియర్ ఎన్టీఆర్. ఆయన ఈవెంట్‌కి రావడం చాలా ఆనందంగాఉంది. నందమూరి లెగసిని కంటిన్యూ చేయడం ఒక బాధ్యత. అలాంటి బాధ్యతని నిర్వర్తిస్తున్న ఇద్దరు హీరోలు మా ముందు ఉన్నారు. సన్నాఫ్ వైజయంతిగా చాలా బాధ్యత గలపాత్రలో ఈ సినిమాలో కల్యాణ్ రామ్ కనిపించబోతున్నారు. ప్రొడ్యూసర్స్ ఎక్కడ వెనకడుగు వేయకుండా ఈ సినిమాను తీశారు. ఈ కథని ఒప్పుకున్న విజయ శాంతికి థాంక్యూ. అందుకే ఆమె లేడీస్ సూపర్ స్టార్. మా డైరెక్షన్ డిపార్ట్మెంట్ అందరికీ థాంక్యు. మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. అందరికీ థాంక్యు అన్నారు.



## ఏప్రిల్ 18న 'పాడింగ్టన్ ఇన్ పెరూ' ట్రైలర్ రిలీజ్

**పాడింగ్టన్ ఇన్ పెరూ** తాజా ట్రైలర్‌లో అందరికీ ఇష్టమైన ఎలుగుబంటి పెరూ అడవుల గుండా తన గొప్ప సాహసయాత్రకు బయలుదేరినట్లు కనిపిస్తుంది. ఈ ప్రసిద్ధ కుటుంబ వినోదం యొక్క మూడవ భాగం సాహసం, రహస్యాలతో నిండి ఉంది, ప్రేమగల ఎలుగుబంటి అత్త లూసీ, ఎల్ డొరాడోలను వెతుకుతూ ప్రమాదకరమైన అడవులు, అస్థిర నదులు, పురాతన శిథిలాల గుండా ప్రయాణిస్తుంది. పాడింగ్టన్ ఇన్ పెరూకు డౌగల్ విల్సన్ దర్శకత్వం వహించారు, మార్క్ బర్టన్, జాన్ ఫోస్టర్, జేమ్స్ లామోంట్ రాశారు. ఈ చిత్రంలో హ్యూ బోన్నెవిల్లే, ఎమిలీ మోర్టిమర్, జూలీ వాల్టర్స్, జిమ్ బ్రాడ్‌బెంట్, ఇమెల్డా స్టాంటన్ మరియు కార్లా టౌస్ నటించగా, ఒలివియా కోల్మన్, ఆంటోనియో బాండెరాస్ ,బెన్ విన్షా పాడింగ్టన్ గాత్రదానం చేశారు. సోనీ పిక్చర్స్ ఎంటర్టైన్మెంట్ ఇండియా 2025 ఏప్రిల్ 18న భారతీయ సినిమా థియేటర్లలో 'పాడింగ్టన్ ఇన్ పెరూ'ను ప్రత్యేకంగా విడుదల చేస్తుంది.




## 'పోలీస్ వారి హెచ్చరిక్ష ఆడియో లాంచ్!



**అభ్యుదయ దర్శకుడు** బాబ్జీ రూపొందించిన లేటెస్ట్ ఎంటర్‌టైనర్ 'పోలీస్ వారి హెచ్చరిక్ష!. తూలికా తనిష్క్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత బెల్లి జనార్ధన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఏప్రిల్ 12న అనగా శనివారం నాడు ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్ ని అతిథుల మధ్య ఘనంగా నిర్వహించారు.

ఈ ఈవెంట్‌లో తనికెళ్ల భరణి మాట్లాడుతూ,నేను గతంలో బాబ్జీతో కలిసి పని చేశాను. కానీ ఈ చిత్రంలో ఔట్ డోర్‌లో ఉండటం వల్ల చేయలేకపోయాను. కానీ బాబ్జీతో ఉన్న సాన్నిహిత్యం వల్ల ఈ సినిమా ఆడియోలాంచ్ ఈవెంట్‌కి వచ్చాను. ఈ సినిమా కంటెంట్ గురించి విన్నాను. ఆ కంటెంట్ విన్నాక ఈ సినిమాని కచ్చితంగా సపోర్ట్ చెయ్యాలి అనిపించింది. అంత బాగుంది. ఈ సినిమా కంటెంట్‌పై నాకు నమ్మకం ఉంది. ఈ సినిమాని తప్పకుండా మీరు ఆదరిస్తారని కోరుకుంటున్నాను అని అన్నారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ, సమాజంలో జరిగే చెడులను ప్రశ్నించే సినిమాలు రావాలి. ఈ సినిమా కూడా అలాంటి కోవకే చెందిన సినిమా. గతంలో ఎన్టీఆర్, సూపర్ స్టార్ కృష్ణ, మోహన్ బాబు లాంటి నటులు ఎర్ర జెండాను పట్టుకొని కమ్యూనిస్ట్ అంశాలతో చక్కటి సందేశాత్మక చిత్రాలు తీశారు. ఆ సినిమాలను జనాలు ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు బాబ్జీ అలాంటి ఆశయాలతో ఈసినిమా చేశారు. ఇలాంటి సినిమాని అందిస్తున్నందుకు డైరెక్టర్ బాబ్జికి, నిర్మాత బెల్లి జనార్ధన్‌కి అభినం దనలు అన్నారు.

జయసుధ మాట్లాడుతూ, బాబ్జి సినీ పరిశ్రమలోకి వచ్చినప్పటి నుంచి నాకు బాగా పరిచయం. సినిమా కంటెంట్ చాలా బాగుంది. ఈ సినిమా కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని భావిస్తున్నాను. డైరెక్టర్ బాబ్జీ కి, నిర్మాత బెల్లి జనార్ధన్‌కి ఆల్ ది బెస్ట్ అని అన్నారు. ఇక ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ, ప్రజానాట్యమండలి వేదిక నుంచి వచ్చిన బాబ్జీ తీసిన ఈ సినిమా గురించి విన్నప్పుడు ఇది సమాజానికి ఉపయోగపడే అద్భుతమైన సినిమా అని అర్థమయ్యింది. ఇలాంటి సినిమాలు ఇంకా ఎన్నో రావాలి. బాబ్జి మంచి సినిమా తీయడం కోసం ఎంత టైం అయినా తీసుకొని ఆ సినిమా బాగా వచ్చే దాకా కష్టపడతారు. ఇప్పుడు ఆయన బిడ్డతో ఇంత మంచి సినిమా తీశారు. బాబ్జికి, నిర్మాత బెల్లి జనార్ధన్‌కి ఆల్ ది బెస్ట్ తెలుపుతున్నాను అని అన్నారు.

అజయ్ ఘోష్ మాట్లాడుతూ, ఈ సినిమాలో నేను చాలా గొప్ప పాత్రను పోషించాను. ఇలాంటి సినిమాలు మరిన్ని రావాలి. ఈ సినిమా విడుదల తరువాత మాదర్శకుడు బాబ్జీ సక్సెస్ ఫుల్ దర్శకుడిగా సినీ పరిశ్రమలో తనదైన సంతకం చేసేస్తారు. నాకు అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ బాబ్జీకి, ప్రొడ్యూసర్ జనార్ధన్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను .అని అన్నారు. విశిష్ట అతిథులుగా హాజరయిన వివిధ వామ పక్ష పార్టీల నేతలు శాసనసభ సభ్యులు కూనం నేని సాంబశివ రావు, యఎల్ సి సత్యం , సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీలు మాట్లాడుతూ, వామపక్షాల ఐక్యతను చాటేలా యీ సినిమా ఆడియో ఫంక్షన్‌కు మేము హాజరయ్యాము. ఒక గొప్ప సామాజిక లక్ష్యంతో మా ప్రజా నాట్యమండలి బాబ్జీ రూపొందించిన ఈ సినిమాను జనంలోకి తీసుకెళ్లి దీనిని విజయవంతం చేయాలని, తద్వారా రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి చిత్రాలు మరిన్ని రావడానికి రెండు రాష్ట్రాలోని మా పార్టీల, ప్రజా సంఘాల సభ్యులు, అభిమానులు కృషి చేయాలని మేము ఈ వేదిక నుంచి సంయుక్తంగా పిలుపు ఇస్తున్నామని ప్రకటించారు.

## బిజీబిజీగా 'దివి'



**సినిమాల్లో చిన్న చిన్న** పాత్రలు చేసి పాపులర్ అయిన దివి.. ఆతర్వాత విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. సినిమాల పట్ల ఆసక్తితో 2017లో మోడలింగ్‌తో తన కెరీర్‌ను ప్రారంభించింది. ఈ అమ్మడు. 2018లో "లెట్స్ గ్లో అనే లఘు చిత్రంతో నటనలోకి అడుగుపెట్టింది. 2019లో మహేష్ బాబు నటించిన మహర్షి సినిమాతో తెలుగు సినిమా రంగంలోకి ప్రవేశించి సినిమాల్లో చిన్నచిన్న పాత్రలు చేసి పాపులర్ అయిన దివి ఆతర్వాత విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమాలో మహేష్ బాబు ఫ్రెండ్‌గా చిన్న పాత్రలో మెరిసింది. ఆ తర్వాత ఏ1 ఎక్స్‌ప్రెస్ (2019), క్యాబ్ స్టోరీస్ (2021), గాడ్ ఫాదర్ (2022) వంటి సినిమాల్లో నటించింది. మొన్న ఈ మధ్య దివి నటించిన లంబసింగి (2024) సినిమా హీరోయిన్‌గా ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. దివి 2020లో బిగ్‌బాస్ తెలుగు సీజన్ 4లో కంటెస్టెంట్‌గా పాల్గొని విశేషమైన గుర్తింపు పొందింది. ఈ షో ఆమెకు బాగా పాపులారిటీ తెచ్చిపెట్టింది. హైదరాబాద్ టైమ్స్ 2020లో ఆమెను టీవీ రంగంలో మోస్ట్ డిజైరబుల్ వుమెన్‌గా ప్రకటించింది. దివి సోషల్ మీడియాలో చురుకుగా ఉంటూ, తన ఫోటో షూట్‌లతో అభిమానులను ఆకర్షిస్తుంది. ప్రస్తుతం ఆమె సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఫ్యాషన్ ఈవెంట్‌లలో సందడి చేస్తూ కెరీర్‌లో ముందుకు సాగుతోంది. తాజాగా దివి షేర్ చేసిన ఫోటోలు కుర్రాళ్లను కవ్విస్తున్నాయి. ఈ ఫోటోల్లో తన అందంతో ఆకట్టుకుంది.

## వైభవంగా జరిగిన 'టీచ్ ఫర్ చేంజ్' కార్యక్రమం



**షో స్టాపర్‌గా** షోకు నూతనో త్సాహం తీసుకువచ్చిన రియా చక్రవర్తి. ఒక మహోన్నత కార్యక్రమం కోసం ఫ్యాషన్ అంటూ గత కొన్నేళ్లుగా నిధుల సేకరణ కార్యక్రమం కోసం వివిధ రంగాలలో నిష్ణాతులైన వ్యక్తులను ఒకే దరికి తీసుకువచ్చి లక్ష్మీ మంచు నిర్వహిస్తోన్న 'టీచ్ ఫర్ చేంజ్' వార్షిక నిధుల సేకరణ 2025 కార్యక్రమం నేడు జరిగింది. మెరుగైన విద్యను ప్రతి ఒక్కరికీ చేరువ చేయాలనే మహోన్నత లక్ష్యంతో కృషి చేస్తోన్న టీచ్ ఫర్ చేంజ్, పేద పిల్లలకు అభ్యాస అవకాశాలను మార్చడంలో ముందంజలో ఉంది. ఈ సంవత్సరం మరింత పెద్ద ప్రభావాన్ని చూపడానికి ఇది సిద్ధమైనది. తమ వార్షిక నిధుల సేకరణ కార్యక్రమం నోవాటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్‌లో ఉత్సాహంగా జరిగింది. బాలీవుడ్ నటి రియా చక్రవర్తి షోస్టాపర్‌గా రన్‌వేకు కొత్త సొబగులద్దారు. ఈ సంవత్సరం ఫ్యాషన్ షోకేస్‌లో ప్రఖ్యాత డిజైనర్ స్వాతి వెల్దండి రూపొందించిన అద్భుతమైన కలెక్షన్‌ను ప్రదర్శించారు. ఆభరణం నుండి అద్భుతమైన ఆభరణాలు కూడా ఈ షోలో భాగంగా ప్రదర్శించారు. టీచ్ ఫర్ చేంజ్ వార్షిక నిధుల సేకరణ కార్యక్రమంలో భాగంగా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను పెంపొందించాలనే లక్ష్యంతో సినిమా, క్రీడలు, ఫ్యాషన్ రంగాలలోని ప్రముఖ వ్యక్తులు రన్‌వేపై నడిచారు.

ఈ కార్యక్రమం గురించి లక్ష్మీ మంచు మాట్లాడుతూ, టీచ్ ఫర్ చేంజ్ వార్షిక నిధుల సేకరణ కార్యక్రమం ఫ్యాషన్ కార్యక్రమం కంటే ఎక్కువ. ఇది విద్య ద్వారా జీవితాలను మార్చడానికి కృషి చేసే ఉద్యమం. రియా చక్రవర్తి, స్వాతి వెల్దండి, ఆభరణంతో పాటుగా పరిశ్రమ భాగస్వాములందరి నుండి లభించిన అద్భుతమైన మద్దతు పట్ల మేము చాలా సంతోషంగా వున్నాము. వారి దాతృత్వం, ఓ మహోన్నత కారణం కోసం చూపుతున్న నిబద్ధత అత్యంత అవసరమైన పిల్లలకు మెరుగైన విద్యా అవకాశాలను అందించాలనే మా లక్ష్యానికి తోడ్పడతాయి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొనడం పట్ల తన సంతోషం వ్యక్తం చేసిన రియా చక్రవర్తి మాట్లాడుతూ, మెరుగైన భవిష్యత్తుకు విద్య కీలకం. చిన్న పిల్లల జీవితాలపై అర్థవంతమైన ప్రభావాన్ని చూపే కార్యక్రమంలో భాగం కావటం గౌరవంగా భావిస్తున్నాను అని అన్నారు. నోవాటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్. హెచ్ఐసిసి జనరల్ మేనేజర్ రూబిన్ చెరియన్ మాట్లాడుతూ, టీచ్ ఫర్ చేంజ్ తో భాగస్వామ్యం చేసుకోవడం సంతోషంగా ఉంది. నోవాటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ వద్ద మేము మన సమాజంలోని ప్రతి ఒక్కరినీ ఉద్ధరించాలని కోరుకుంటున్నాము. మన దేశంలోని పిల్లల ఉజ్వలమైన భవిష్యత్తు కోసం సృజనాత్మకత, కరుణను కలిపే కార్యక్రమం నిర్వహించడం గౌరవంగా భావిస్తున్నాము అని అన్నారు.

లక్ష్మీ మంచు, సైనా నెహ్వాల్, ఈషా రెబ్బా, హెబ్బాపటేల్, శివానీ రాజశేఖర్, శివతి రాజశేఖర్, శివత్మిక రాజశేఖర్, సాన్వి మేఘానా, అవంతికా మిశ్రా, రాశి సింగ్, కవితా తాపార్, సంధ్య రాజూ దక్షా నాగర్కర్, అనసూయ భరాద్వజ్, జాస్మిన్ భాసిన్, కేటికా శర్మ, అక్షర గౌద, పాయల్ రాజ్‌పుత్, వాసుకి, శ్రీమాయి రెడ్డి, ఇషా రావు నాగరం, మనసా వారణాసి, లిలిక్తా యలమాంచాలి, సినీ హీరోలు ప్రియతం, మిష్కత్ వర్మ, సౌరాబ్ ధింగ్రా, అరవింద్ కృష్ణ, కశ్యప్ పరుపల్లి, ఆదిత్ అరుణ్, ప్రిన్స్ సిసిల్, నిఖిల్ విజయేంద్ర సింహా కొడురి, నవ్‌దీప్, శివ కందూకురి, అఖిల్ సార్థాక్, వరున్ సాందూష్, వరుణ్ నోథేన్. ఫ్యాషన్ వాక్ తో అదరగొట్టారు. ప్రముఖ స్పాన్సర్లు, భాగస్వాముల మద్దతుతో, టీచ్ ఫర్ చేంజ్ వార్షిక నిధుల సేకరణ 2025 ఒక మరపురాని రాత్రిగా నిలిచింది.

## 'ఆయనతో నటించడం అదృష్టంగా భావిస్తున్నా..' : సంయుక్త



**హీరోయిన్ సంయుక్త** రీసెంట్‌గా గుంటూరులో సందడి చేసింది. నగరంలోని లక్ష్మీపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ గోల్డ్ షాక్ ఓపినింగ్‌కి వెళ్లిన ఆమె.. ప్రారంభోత్సవం అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'అఖండ2 సినిమాపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. అఖండ2 సినిమాలో హీరోయిన్‌గా నటించడం ఆనందంగా ఉంది. బాలయ్యతో స్క్రీన్ షేర్ చేసుకోవడం నా అదృష్టం అని చెప్పుకొచ్చింది. కాగా 'అఖండ2 సినిమా బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకున్న 'అఖండ2 కు సీక్వెల్‌గా రాబోతున్న విషయం తెలిసిందే. నందమూరి నట సింహం బాలకృష్ణ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్నాడు. ఇందులో సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తుంది. బాలయ్య రెండో కూతురు తేజస్విని సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా దసరా కానుకగా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతోంది. ఇప్పటికే బాలయ్య బోయపాటి కాంబోలో వచ్చిన అన్ని సినిమాలు బ్లాక్ బస్టర్ హిట్ అయ్యాయి. అలాగే 'అఖండ2 కూడా సూపర్ సక్సెస్ అందుకోవడంతో అఖండ2పై నందమూరి ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల్లో కూడా భారీ అంచనాలు ఉన్నాయి.

## స్టన్నింగ్‌లుక్స్‌లో ప్రణీత



**టాలీవుడ్ హీరోయిన్** ప్రణీత శుభాష్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించింది. తన అందం, అభినయంతో ఆకట్టుకుంది. కానీ, అనుకున్నంత స్టార్ డమ్ అయితే రాలేదు. దీంతో సినిమాల్లో సెకెండ్ హీరోయిన్‌గా నటించసాగింది. అయినప్పటికీ నో యూజ్. ఇక కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే పెళ్లి చేసుకుంది. అంతేకాకుండా ఒక పాప, బాబుకు కూడా జన్మనిచ్చింది. ప్రస్తుతం మ్యారీడ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తుంది. ఇదిలా ఉంటే.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ లేటెస్ట్ ఫొటో షూట్స్‌తో అభిమానులకు దగ్గరవుతూ ఉండేది ఈ బ్యూటీ. ఈ క్రమంలో ఈ ముద్దుగుమ్మ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా ప్రణీత తన ఇన్‌స్టాగ్రామ్వేదికగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో వైట్ కలర్ డ్రెస్ వేసుకుని స్టన్నింగ్ లుక్స్‌తో ఫొటోస్‌కి స్టిల్స్ ఇచ్చింది. దీంతో ఈ పిక్స్ కాస్త నెట్టింట వైరల్‌గా మారాయి.

# ముఖ సౌందర్యాన్ని ఇనుమడింపచేసే పసుపు

ముఖ సౌందర్యాన్ని ఇనుమడింపజేయడంలో పసుపుది కీలక పాత్ర. అందుకే ఫేస్‌ప్యాక్, స్క్రబ్.. వంటివి తయారుచేసే క్రమంలో దీన్ని విరివిగా వాడుతుంటాం. ఇందులోని సుగుణాలు, ఔషధ గుణాలు పలు చర్మ సంబంధిత సమస్యల్ని దూరం చేసి మోముకు మెరుపును అందిస్తాయి. అయితే దీన్ని వాడే క్రమంలో మనం చేసేకొన్ని పొరపాట్లు చర్మ అందాన్ని, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయంటున్నారు సౌందర్య నిపుణులు. మరి, అవేంటో తెలుసుకొని సరిదిద్దుకుందాం రండి.



పసుపు రోజ్‌వాటర్, పాలు, నీళ్లు.. వంటి పదార్థాల్లో కలుపుకొని ముఖానికి పూతలు వేసుకోవడం మనకు అలవాటే! అయితే ఈ క్రమంలో కొంతమంది ఎక్కువ మెరుపు రావాలన్న ఉద్దేశంతో నిర్ణీత సమయం కంటే ఎక్కువ సేపు ఆ ప్యాక్ తొలగించకుండా అలానే ఉండిపోతారు. నిజానికి పసుపు కలిపిన ఫేస్‌ప్యాకన/ స్క్రబ్ ఏదైనా సరే. 20 నిమిషాలకు మించి ఉంచుకోవదదని చెబుతున్నారు నిపుణులు. ఒకవేళ అంతకంటే ఎక్కువ సమయం పాటు శుభ్రం చేసుకోకుండా ఉండిపోతే.. ముఖంపై పసుపు రంగు మాదిరి మచ్చలు ఏర్పడటంతో పాటు మొటిమలు కూడా వచ్చే ప్రమాదం ఉందట.

**సబ్బు వాడొద్దు!....** సాధారణంగా ముఖం కడుక్కోవాలనుకున్నప్పుడు సబ్బు ఉపయోగించడం మనకు అలవాటే! ఫేస్‌ప్యాక్/స్క్రబ్ వేసుకున్నా, తొలగించుకునే క్రమంలో సబ్బుతో రుద్దుకుని మరీ శుభ్రం చేసుకుంటాం. అయితే పసుపుతో వేసుకున్న ఫేస్‌ప్యాక్/స్క్రబ్.. వంటివి తొలగించుకునే క్రమంలో సబ్బు వాడద్దంటున్నారు నిపుణులు. అయితే మూడు నాలుగ్గంటల తర్వాత మాత్రం గాఢత తక్కువగా ఉండే ఫేస్‌వాష్‌తో ముఖాన్ని శుభ్రం చేసుకోమంటున్నారు. ఈ విషయంలో మీకేమైనా సందేహాలుంటే నిపుణుల సలహాలు తీసుకోవచ్చు. అలాగే ముఖం కడుక్కున్నాక మాయిశ్చరైజర్ రాసుకోవడం మర్చిపోకండి.

**ఈ విషయంలో జాగ్రత్త!...** కళ్ల కింద నల్లటి వలయాలు,క్యారీ బ్యాగుల్ని దూరం చేసుకోవడానికి..కంటి అలసట తగ్గించడానికి కొంతమంది కొన్ని ఐ ప్యాక్స్ వేసుకుంటారు. అయితే ఇలాంటి వాటిలో పసుపు వాడకపోవడమే మంచిదం టున్నారు నిపుణులు. వీటితో పాటు పసుపు ఉపయోగించి తయారు చేసే ఫేస్‌ప్యాక్స్ ముఖంపై సమానంగా పరచుకునేలా వేసుకోవడం, పూర్తి తొలగి పోయేలా శుభ్రం చేసు కోవడమూ ముఖ్యమే! అలాగే ఈ క్రమంలో వేడినీటి కంటే చల్లటి/ గది ఉష్ణోగ్రత వద్ద నీటినే వాడమంటున్నారు. నిపుణులు.

# అదుపు లేని మనసు!

మానవుని మనసు ఎప్పుడూ నిలకడగా ఉండదు. పరి పరి విధాలుగా పరి భ్రమిస్తూ ఉంటుంది. మనసు లయ తప్పినప్పుడు ఎన్నో అరాచకాలు జరిగిపోతుంటాయి. దీనికి కారణం ఎవరూ అని ప్రశ్నించు కుంటే మనసే అనే సమాధానం వస్తుంది. అందుకే మనసును అదుపులో ఉంచు కోవాలి. ప్రఖ్యాత ఇటలీ తత్వ వేత్త మాకీయవెల్లి మానవుని మనసు ఊసరవెల్లి లాంటిదని అభివర్ణించాడు. రంగులు మార్చే ఊసర వెల్లికి మానవునికి దగ్గర సంబంధం ఉందని చెప్పడం గమనార్హం. ఊసర వెల్లి తనకు హాని జరుగుతుందని భయంతో రంగులు మారిస్తే మానవుడు అలా కాకుండ ఇచ్చిన మాట మీద నిలబడక ఏవో సాకులు చెప్పే వాళ్ళు కోకొల్లలు. మరియు సాయం సంధ్యా సమయంలో ఆకాశం వైపు చూసి బారులుగా వెళుతున్న పక్షుల ను చూసి నేను కూడా పక్షి మాదిరి రూపాంతరం చెందితే బాగుండు అనుకుని ఇంతలో మనసు మారి వేగంగా పొదలలోకి వెళుతున్న జింక పిల్లలా మారిపోతే బాగుండును అనుకుంటాడు. ఆ జింక పై ఏదైనా క్రూరమృగం దాడి చెస్తే ఆమ్మో అనుకుని మనసును అదుపులో ఉంచుకుంటాడు. అంతవరకు బాగానే ఉన్నా క్రూర మృగంను చూసి నప్పుడు మనిషి మనసు మేల్కొంటుంది. అప్పుడే దైవం గుర్తు వచ్చి తనకు తెలియకుండా వేడుకుంటాడు. మనసు ఆ విధంగా మారుతున్నది తద్వారా ఆధ్యాత్మికతకు లోనైభగవంతుని దర్శిస్తాడు. అదే క్రమంగా అలవడి రోజు దైవ చింతనలో గడుపుతాడు. వ్యక్తికి చంచల మనసుకు అంత తేడా ఉంది. చంచల మనసును అదుపులో పెట్టుకోకపోతే కొన్ని నేరాలు కూడా జరిగి పోతుంటాయి. అందుకే మనసు ఎప్పుడూ నిబ్బరంగా ఉంచు



# పనులను సమన్వయం చేసుకోవాలి

ఇటు ఇంటి పనైనా, అటు ఆఫీస్ వర్క్ అయినా సమయానికి పూర్తి కావాలంటే ముందుగా ప్రాథమ్యాలను నిర్ణయించుకోవడం ముఖ్యమన్నది తెలిసిందే. ఇందుకోసం ఆ రోజు చేయాల్సిన పనులేంటి? వాటిలో అత్యంత ప్రాధాన్యమున్నవేంటి? ఇలా ఓ జాబితా తయారుచేసుకోవాలి. ఈ సూత్రం ఆఫీస్ పనులకే కాదు..
ఇంటి పనులకూ వర్తిస్తుంది.
విరామం కావాల్సిందే..! నిరంత రాయంగా పని చేసినా తీవ్ర ఒత్తిడి ఎదురవుతుంది. తద్వారా ఆపై అటు ఆఫీస్ పని, ఇటు ఇంటి పనిపై దృష్టి పెట్టలేరు. ఫలితంగా దాని ప్రభావం చివరికి వర్క్-లైఫ్ బ్యాలన్స్ పైనే పడుతుంది. కాబట్టి ఏ పనైనా,
ఎంత బిజీగా ఉన్నా నిర్ణీత వ్యవధుల్లో కొద్దిసేపు విరామం తీసుకోవడం మంచిది. దానివల్ల మనసు తిరిగి ఉత్తేజితమవుతుంది. అలాగని కాఫీ/టీలు తెగ తాగేయడం వల్ల ఆరోగ్యానికే నష్టం. కాబట్టి ఈ క్రమంలో పని ప్రదేశాన్ని వదిలికాసేపు నడవడం, మీకు నచ్చిన వారితో ఫోన్లో మాట్లాడడం, ఉన్న చోటే మెడిటేషన్ చేయడం ఆహ్లాదకరంగా ఉంటే మొక్కలు లేదా బొమ్మల్ని చూడడం..వంటివి చేయచ్చు. ఎంతైనా..మనకుకు ఒత్తిడిగా అనిపించినప్పుడు నచ్చిన పని చేస్తే ఆ ఆనందమే వేరుకదా!
ఇలా ఎప్పటికప్పుడు మనసును ప్రశాంతపరచుకుంటే చాలు..
ఏ పనైనా చకచకా పూర్తి చేసేసుకోవచ్చు.
ఆరోగ్యంతో.. ఇటు ఇంటి పని చేయాలంటే శరీరం సహకరించాలి. అటు ఆఫీస్ పనులు పూర్తి చేయాలంటే మనసు ప్రశాంతంగా ఉండాలి. ఈ రెండూ సాధ్యం కావాలంటే ముందు మనం ఆరోగ్యంగా ఉండడం ముఖ్యం. ఇందుకోసం తీసుకునే ఆహారం, చేసే వర్కవుట్స్ కీలకమని చెప్పచ్చు. చాలామంది మహిళలు బిజీ బిజీ అంటూ తమ కోసం కాస్త సమయమైనా కేటాయించుకోలేరు. ఆహారం విషయంలోనూ శ్రద్ధ వహించరు. వేళకు భోజనం చేయరు. తద్వారా ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి ఎంత బిజీగా ఉన్నా సమయానికి భోజనం చేయడం ముఖ్యం అలాగే రోజూ ఓ అరగంట పాటు వ్యాయామం, ధాన్యం.. వంటివి చేస్తే మనసుకూ ఉల్లాసంగా ఉంటుంది. ఇక కుటుంబంతో కలిసి చేస్తే వారితో మరింత సమయం గడిపిన వారవుతారు. ఇలా సంపూర్ణ ఆరోగ్యం సొంతమైతే వర్క్-లైఫ్ బ్యాలన్స్ చేయడం పెద్ద కష్టమనిపించదు. కావాలంటే ట్రై చేసి చూడండి.

# ఫ్రిజ్‌లో పెట్టే వస్తువుల పట్ల జాగ్రత్త!

చాలా వరకూ స్కిన్ కేర్ ఉత్పత్తులపై ఎండ తగలని, చల్లగా ఉండే ప్రదేశాల్లో ఉంచమనే ఉంటుంది. చర్మానికి చల్లగా వేసే ప్యాక్‌లు ఎంత హాయిగా అనిపిస్తాయో! అలాంటప్పుడు వీటినీ ఫ్రిజ్‌లో పెట్టి వాడుకుంటే..? ఆహార పదార్థాలు త్వరగా పాడవకుండా ఫ్రిజ్‌లో పెడతాం కదా! అది స్కిన్ కేర్ ఉత్పత్తులకూ వర్తిస్తుంది. సహజ, సేంద్రియ ఉత్పత్తుల్లో నిల్వ కారకాలు వాడరు. దీంతో త్వరగా పాడయ్యే అవకాశమెక్కువ. ఇలాంటప్పుడు వాటిని ఫ్రిజ్‌లో పెడితే త్వరగా పాడవ్వవు. కళ్లు ఉబ్బ డం, మంట పుట్టడం లాంటివి జరిగితే చల్లని నీటిలో తడిపి, పిండేసిన వస్త్రాన్ని కళ్లపై ఉంచుతాం. కీర, బంగాళదుంప ముక్కల్ని చల్లగా ఉంచినా త్వరగా ప్రయోజన ఉంటుంది గమనించారా? ముఖం మంటగా ఉంచినప్పుడు, ఏవైనా అలర్జీలు వచ్చినా చల్లగా ఏదైనా ఉంచితే ఎంత హాయిగా ఉంటుంది? అన్నీ ప్రయోజనాలే. ఇంకెందుకు ఆలస్యం.. క్రీములన్నీ ఫ్రిజ్‌లో పెట్టేద్దాం అంటారా? ఆగండాగండి..చల్లదనం చర్మానికి మంచిదే!కానీ అన్నింటికీ ఒకే మంత్రం అంటేఎలా? ఐ క్రీములు అలసిన కళ్లను సేదతీరుస్తాయి. ఉబ్బు,గీతలు వంటివీ తగ్గస్తాయి. వీటిని పెడితే ప్రయోజనమే. జెల్ ఆధారిత, షీట్ మాస్క్‌లుకూడా చల్లగా ఉన్నప్పుడు మరింత ప్రయోజ నాన్ని అందిస్తాయి. పైగా చర్మానికి తాజా లుక్‌ని ఇస్తాయి. వీటినీ పెట్టొచ్చు. ఇక సీరమ్‌లు.. ముఖ్యంగా విటమిన్ సి ఉన్నవి ఆక్సిడేషన్‌కి గురయ్యే అవకాశమెక్కువ.

# టొమాటో పొడి

కొన్నిసార్లు టొమాటోలు ఎక్కువ ధర ఉంటాయి. అంతధర పెట్టి కొనాలంటే కష్టంగానే అనిపిస్తుంది. అలాంటప్పుడు కొన్ని మాత్రమే కొని వాటిని జాగ్రత్తగా వాడుతుంటాము. అటువంటి సందర్భాలలో టమాటా రుచిని పొందాలంటే వాటిని పొడి చేసుకుని నిలువ పెట్టుకుని రసం, చారు, కూరల్లో వాడుకుంటే టమాటో రుచి పొందవచ్చు. అది ఎలాగో చూద్దామా! మరీ పచ్చివి,మిగుల పండినవి కాకుండా దోర టమాటోలను తీసుకోవాలి. వాటిని కడిగి, తడి లేకుండా తుడిచి సన్నటి ముక్కలుగా తరగాలి. పళ్లెంలో శుభ్రమైన వస్త్రం పరిచి దాని మీద టొమాటో ముక్కలను పరవాలి. రాత్రికి ఫ్యాన్ కింద, పగలు ఎండలో ఇలా మూడు రోజులపాటు ఎండబెట్టాలి. బాగా ఎండిపోయాక మెత్తడి పొడి చేసి గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. ఇక ఈ పొడిని రసం, చారు, కూర ఎందులోనైనా వేసుకోవచ్చు. ఈసారి టొమాటోలు ఎక్కువగా ఉన్నప్పుడు పాడైపోతాయనే బెంగ లేకుండా ఇలా చేసి చూడండి.



# సి- విటమిన్ పుష్కలంగా ఉండే పండ్లు

శరీరానికి సి-విటమిన్ ఎంతో అవసరం. కణాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తెల్ల రక్తకణాల సంఖ్యను పెంచి.. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే గుణం సి-విటమిన్‌కు ఉంది. ఇంతకీ ఏయే పండ్లలో సి-విటమిన్ ఎక్కువ దొరుకుతుందో తెల్చుకుందాం. వందగ్రాముల నారింజలో 53 మిల్లీ గ్రాముల సి-విటమిన్ ఉంటుంది. గుప్పెడు నల్లద్రాక్ష తింటే 181 మి.గ్రా సి.విటమిన్ లభ్యమవుతుంది. అంటే నారింజ పండ్లకంటే మూడు రెట్లు ఎక్కువ. కివి పండ్లలో మినరల్స్, ఫైబర్ కంటెంట్ ఎక్కువ. వంద గ్రాముల కివి పండ్లలో 93 మి.గ్రా. విటమిన్-సి దొరుకుతుంది. స్ట్రాబెర్రీస్ లో అధికంగా ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. కనీసం వందగ్రాముల స్ట్రాబెర్రీలను తింటే 58 గ్రాములు సి- విటమిన్ శరీరానికి అందుతుంది. బరువు తగ్గటానికి, జీర్ణక్రియ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడే బొప్పాయి.

# తెలుగు రాష్ట్రాలతో సహా 21రాష్ట్రాల్లో వందశాతం పూర్తయిన రైల్వే విద్యుద్దీకరణ

## 2026నాటికి దేశవ్యాప్తంగా వందశాతం పూర్తి

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 13,ప్రభాతవార్త:** ఓ పక్క భారత స్వాతంత్ర్య మహాసంగ్రామం ఉదృతంగా సాగుతున్న సమయం. మరోపక్క నాటిపాలకులు తమ స్వప్రయోజనాల కోసమో లేక అభివృద్ధి కోసమో వేసిన బాటలు నేటి తరానికి మార్గదర్శకంగా మారాయి. తొలినాళ్లలో స్టీమ్ ఇంజన్లతో ప్రారంభమైన రైల్వే శకం,క్రమేణా డీజిల్ ఇంజన్లుగా కొనసాగుతూ ప్రస్తుతం విద్యుత్ రైలు ఇంజన్‌ల ప్రస్థానం నడుస్తోంది.

**విద్యుత్ రైలు ఇంజన్‌లకు విద్యుత్ సరఫరా ఎలా అవుతుంది:** ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన విద్యుత్ శాఖల పవర్ గ్రిడ్‌ల నుంచి ఉత్పత్తి అయ్యే 220కేవీ విద్యుత్‌ను రైల్వే శాఖ కొనుగోలు చేసి 132కెవి విద్యుత్‌ను రైల్వే సబ్‌స్టేషన్‌లకు దిగుమతి చేసుకుని ట్రాన్స్‌ఫర్‌ల ద్వారా 25కెవి స్టెప్ డౌన్‌లోడ్‌తో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్(ఓహెచ్ఇ)కు రైలు మార్గానికి ఇరువైపులా అవసరం మేరకు 25-30కి.మీలు చొప్పున విద్యుత్ రైలు ఇంజన్‌ల ద్వారా వినియోగిం చుకుంటారు.

**విద్యుత్ రైలు ఇంజన్లు వాటి రకాలు:** విద్యుత్ రైలు ఇంజన్లు ముఖ్యంగా బ్రాడ్ గేజ్ రైలు మార్గంలో వినియోగిస్తారు. వీటిని ట్రాక్షన్ డిసిగా వ్యవహరిస్తారు. వీటిలో గూడ్స్ రైలు సర్వీసులను వినియోగించే ఇంజన్‌లకు డబ్ల్యూడిజిగాను, పాసింజర్ రైలు సర్వీసులకు ఉపయోగించే ఇంజన్‌లకు డబ్ల్యూడిపిగాను,షంటింగ్ నిర్వహణ నిమిత్తం ఉపయోగించే ఇంజిన్‌లకు డబ్ల్యూడిఎస్‌గాను, గూడ్స్,పాసింజర్ రైలు సర్వీసులకు ఉపయోగించే సర్వీసులకు డబ్ల్యూడిఎం(మిక్స్‌డ్)గా పరిగణిస్తారు. వందేళ్ల క్రితం బొంబాయి వీటి-మద్రాసు ప్రధాన రైలు మార్గంలో ప్రారంభించిన విద్యుత్ రైలు మార్గంలో స్వాతంత్రానికి పూర్వం 1925-47మధ్య 388రూట్ కి.మీలను(ఆర్‌కెఎం) విద్యుధీకరించగా, నేడు ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాలలో రైల్వే విద్యుదీకరణ, వందశాతం మైలురాయికి చేరుకుంది. వందేళ్ల విద్యుత్ రైలు మార్గం ప్రస్థానంలో రాయలసీమలో అంచెలంచెలుగా పూర్తి అయిన రైల్వే విద్యుదీకరణ వివరాలు ఇలా ఉన్నాయి. 1948-2014 మధ్య 21,413కి.మీలను విద్యుదీకరించగా 2014-19ఐదేళ్లలో 13,647ఆర్‌కేఎంలు 2019-24ఐదేళ్లలో 27,968ఆర్‌కెఎంలను విద్యుదీకరించడం ద్వారా ఈ ఏడాది మార్చి 1నాటికి 64,982ఆర్‌కెఎంలను విద్యుదీకరించారు.

**రాష్ట్రాలవారిగా వందశాతం విద్యుదీకరణ పూర్తి అయిన వివరాలు :** ఆంధ్రప్రదేశ్‌లో 3,841కి.మీ,తెలంగాణలో 1,940కి.మీ, బీహార్-3,855 కి.మీ,చండీఘడ్-16కి.మీ, చత్తీస్‌ఘడ్-1,296 కి.మీ, ఢిల్లీ-183కి.మీ, హర్యానా-1,780కి.మీ,హిమాచల్ ప్రదేశ్-67కి.మీ,జమ్మూకాశ్మీర్-413కి.మీ,జార్ఖండ్-2,577కి.మీ,కేరళ-1,046కి.మీ, మధ్యప్రదేశ్-4,970కి.మీ, మహారాష్ట్ర-5,815 కి.మీ, మేఘాలయ-9కి.మీ, నాగాలాండ్-11కి.మీ, ఒరిస్సా-2,918కి.మీ,పాండిచ్చేరి-21కి.మీ,పంజాబ్-2,288కి.మీ, ఉత్తరప్రదేశ్-8,546కి.మీ,ఉత్తరఖండ్-347కి.మీ,త్రిపుర-271కి.మీలను పూర్తిస్థాయిలో విద్యుదీకరణ వందశాతం మైలు రాయిని అధిగమించింది. అలాగే పశ్చిమ బెంగాల్‌లో 98.64శాతం, రాజస్థాన్- 97.38శాతం, గుజరాత్-97.19శాతం, కర్ణాటక-96.49శాతం, తమిళనాడు- 93.87శాతం,గోవా-88.17శాతం, అస్సాం-66.27శాతం చొప్పున రైలు మార్గాన్ని విద్యుదీక రించారు. అరుణాచల్ ప్రదేశ్‌లో 12కి.మీ, మణిపూర్-13కి.మీ,మిజోరంలో 2కి.మీల మేర పూర్తి చేయాల్సి ఉంది. వెరసి మొత్తంగా 66,546బ్రాడ్‌గేజ్ రూట్ కిలోమీటర్లకు గాను ఫిబ్రవరి 28వరకు మొత్తంగా 64,982కి.మీ లను(97.64శాతం) విద్యుదీకరించగా



మిగిలిన 1,564కి.మీల రైలు మార్గాన్ని 2026నాటికి దేశవ్యాప్తంగా వందశాతం విద్యుదీకరించనున్నట్లు రైల్వే బోర్డు అధికార వర్గాలు తెలిపాయి.

**రాయలసీమలో రైల్వే విద్యుదీకరణ ప్రస్థానం :** రాయలసీమలో ప్రప్రథమంగా గూడూరు- రేణిగుంట-తిరుపతి(సింగల్ లైన్‌ను) 1984 నవంబరు 11న రేణిగుంట-నందలూరు సింగల్ లైన్ రైలు మార్గాన్ని 2004సెప్టెంబరు 11న, గూడూరు-రేణిగుంట-తిరుపతి డబుల్‌లైన్ మార్గాన్ని 2004డిసెంబరు 15న విద్యుదీక రించారు. తిరుపతి-కాట్పాడి సింగిల్ లైన్‌ను 2007డిసెంబరు 8న, రేణిగుంట-నందలూరు డబుల్ లైన్‌ను 2008జూలై 30న, నందలూరు-కమలాపురం డబ్లింగ్ రైలు మార్గాలను 2010 డిసెంబరు 29న, కమలాపురం-ముద్దనూరు డబ్లింగ్ రైలు మార్గాన్ని 2011డిసెంబరు 31న,ముద్దనూరు-తాడిపత్రి డబ్లింగ్ రైలు మార్గాన్ని 2013 మార్చి 31న, తాడిపత్రి-వేములపాడు డబుల్ లైన్ రైలు మార్గాన్ని 2013జూన్ 30న, వేములపాడు-జక్కలచెరువు డబుల్ లైన్ రైలు మార్గాన్ని 2013 సెప్టెంబరు 8న, జక్కల చెరువు-గుత్తి డబుల్ లైన్ రైలు మార్గాన్ని 2013 నవంబర్ 7న, గుత్తి-గుంతకల్లు డబుల్ లైన్ మార్గాన్ని 2013 డిసెంబరు 5న విద్యుదీకరించారు. గుత్తి-ధర్మవరం సింగిల్ లైన్ రైలు మార్గాన్ని 2015మే 28న, గుంతకల్లు-నంచర్ల డబుల్ లైన్ మార్గాన్ని 2014 ఏప్రిల్ 5న,వాడి-చిక్‌సాగూర్ డబుల్ లైన్ రైలు మార్గాన్ని 2016సెప్టెంబరు 11న, నంచర్ల-ఆదోని డబుల్ లైన్ రైలు మార్గాన్ని 2017 ఫిబ్రవరి 2న,చిక్‌సాగూర్-రాయచూర్ డబుల్ లైన్ మార్గాన్ని 2017 మార్చి 4న,ఆదోని- మంత్రాలయం-రాయచూర్ యార్డ్ డబుల్ లైన్ రైలు మార్గాన్ని 2017 మార్చి 14/15వ తేదీల్లో, రాయచూరు-మంత్రాలయం డబుల్ లైన్ రైలు మార్గాన్ని 2017 ఏప్రిల్ 27న, గుంతకల్లు-డోన్,గుత్తి-పెండేకల్లు సింగిల్ లైన్ రైలు మార్గాలను 2017 జూన్ 24న, డోన్-పాణ్యం సింగిల్ లైన్ రైలు మార్గాన్ని 2017నవంబరు 27న,గుంతకల్లు- గూళ్యపాలెం, ఖాదర్‌పేట్-కల్లూరు సింగిల్ లైన్, గూళ్యపాలెం-ఖాదర్‌పేట్ డబుల్ లైన్ రైలు మార్గాలను 2018నవంబరు 13న, గుంతకల్లు-బళ్లారి డబుల్ లైన్ రైలు మార్గాన్ని 2019 ఫిబ్రవరి 9న, గార్లదిన్నె-కల్లూరు రెండో రైలు మార్గాన్ని 2019 సెప్టెంబరు 25న, గుంతకల్లు-గూళ్యపాలెం(ఎగువ), ఖాదర్‌పేట్- కల్లూరు(అప్‌అండ్ డౌన్), గుంతకల్లు బైపాస్ లైన్ రైలు మార్గాలను 2020 జనవరి 22న,డోన్-పెండేకల్లు రెండో రైలు మార్గాన్ని 2020మార్చి 9న,చిగిచెర్ల-జంగాలపల్లి రెండో రైలు మార్గాన్ని 2020జూన్ 22న,గుత్తి యార్డ్ ఆధునీకరణ పనులు,సిఅండ్‌డబ్ల్యు ప్రత్యా మ్నాయ రైలు మార్గాన్ని 2020జూలై 14న,తాటిచెర్ల-గార్లదిన్నె రైలు మార్గాన్ని 2020నవంబరు 6న, తిరుచానూరు,బొమ్మ సముద్రం రైల్వే స్టేషన్లను అప్ గ్రేడ్ స్టేషన్‌కు రైలు మార్గాన్ని 2020డిసెంబరు 26,31తేదీల్లో, ఎద్దులదొడ్డి-పెండేకల్లు రైలు మార్గాన్ని 2021 జనవరి 8న,నక్కనదొడ్డి యార్డ్ ఆధునీకరణ,ఐఓసి సైడింగ్ రైలు మార్గాలను 2021 జనవరి 30న, ధర్మవరం-కదిరి రైలు మార్గాన్ని 2021మార్చి 14న,చంద్రగిరి రైల్వేస్టేషన్‌లో అదనపు లూప్ లైన్ పనులను 2021మార్చి 26న, తిరుపతి యార్డ్ ఆధునీకరణ పనులను 2021ఏప్రిల్ 8న, విద్యుత్ లోకో షెడ్డులో పిట్/వీల్ లేథ్ పనులను 2021జూన్ 28న, గుత్తి-కల్లూరు రెండో రైలు మార్గం పనులను 2021అక్టోబరు 5న,రాయచూరు లోని యర్మరాస్ థర్మల్ పవర్ స్టేషన్ సైడింగ్ లైన్ రైలు మార్గాన్ని 2021డిసెంబర్ 24న, ప్రసన్నా యపల్లియార్డ్ పనులను 2022 ఫిబ్రవరి 1న, ఎద్దులదొడ్డి-మద్దికెర రైలు మార్గం పనులను 2022 ఫిబ్రవరి 22న, పాకాల-కలికిరి, కదిరి- తుమ్మనంగుట్ట రైలు మార్గాలను 2022మార్చి 16న,ఎర్రగుంట్ల- నంద్యాల రైలు మార్గాన్ని 2022మార్చి 29న, తుమ్మనంగుట్ట- తకలికిరి రైలు మార్గాన్ని 2022 ఆగస్టు 8న, తాటిచెర్ల-జంగాలపల్లి రైలు మార్గాన్ని 2022 ఆగస్టు 18,గుత్తి బైపాస్ రైల్వే లైన్‌ను 2022 నవంబర్ 28న, కృష్ణా యార్డ్ ఆధునీకరణపనులకు 2023 ఫిబ్రవరి 6న, ధర్మవరం- చిగిచెర్ల రెండో లైన్‌ను 2023 ఫిబ్రవరి 22న, తిమ్మనచెర్ల ఎఫ్‌సిఐ సైడింగ్ రైలుమార్గాన్ని 2023మార్చి 16న, బేతంచర్ల-మల్కాపురం రెండో రైలు మార్గాన్ని 2023మార్చి 26న, దాల్మియా సైడింగ్ రైలు మార్గాన్ని 2023 మార్చి 29న, గుంతకల్లు-మద్దికెర రైలు మార్గాన్ని 2023 జూలై 25న, మల్లప్ప గేట్ రోడ్ 1,4లూప్ లైన్లను 2023 ఆగస్టు 8,11తేదీల్లో, గుంతకల్లు యార్డులో స్లిప్ కోచింగ్ సైడింగ్ రైలు మార్గాన్ని 2023 అక్టోబరు 11న, మల్కాపురం-డోన్ రెండో రైలు మార్గాన్ని 2023 నవంబరు 21న, బేతంచెర్ల-బుగ్గానపల్లి రెండో రైలు మార్గాన్ని 2024మార్చి 31న,బుగ్గానపల్లి-పాణ్యం రెండోరైలు మార్గాన్ని 2024డిసెంబరు 25న, తిరుపతి సిఆర్ఎస్ఎస్ రైలు మార్గాన్ని 2025జనవరి 6న విద్యుదీకరించారు. వీటితో పాటు మరికొన్ని చోట్ల సైడింగ్ రైలు మార్గాలను ప్రైవేటు భాగస్వామ్యంతో విద్యుదీకరించారు. మొత్తంగా చూస్తే రాయలసీమలో సింగల్ లైన్ రైలు మార్గాన్ని సైతం వందశాతం విద్యుదీకరించారు. వీటితో పాటు విద్యుత్ రైలు ఇంజన్‌లకు మరమత్తులు నిర్వహించేందుకు ట్రిప్ షెడ్డు,విద్యుత్ లోకో షెడ్డులు, అందుబాటులను గుంతకల్లులో ఏర్పాటు చేశారు.

# విశాఖ-బెంగళూరు మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 13,ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని ఉంచుకుని రైల్వే శాఖ విశాఖపట్నం-బెంగళూరు-విశాఖపట్నంల మధ్య ఆదివారం నుంచి మరికొన్ని వేసవి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. విశాఖపట్నం నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 08581ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల13నుంచి మే 25వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.20గంటలకు విశాఖనుంచి బయలుదేరి, సోమవారం మధ్యాహ్నం ఉదయం 12.45గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బెంగళూరు నుంచి విశాఖపట్నం వెళ్లే నెంబర్ 08582ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 14నుంచి 26వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 3.50గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం 1.30గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. మార్గ మధ్యంలో ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి,యలమంచిలి,సామర్లకోట,రాజమండ్రి, ఏలూరు,విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు,రేణిగుంట,జోలార్‌పేట్,కుప్పం,బంగారుపేట్, క్రిష్ణరాజాపురం స్టేషన్లలో నిలుస్తాయి.



వెస్టన్ లవ్ అనే సినిమాకు క్లాప్ కొడుతున్న మంత్రి కందుల దుర్గేష్

# ఎపిలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు

## త్వరలోనే కొత్త ఫిల్మ్ పాలసీ: మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,ఏప్రిల్13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ప్రత్యేకంగా చలనచిత్ర నిర్మాణాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నూతన ఫిల్మ్‌పాలసీని తీసుకు వస్తున్నామని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని ప్రోత్సాహకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని శ్రీ శేష సాయి కళ్యాణ వేదికలో వారాహి ఆర్ట్స్ అండ్ శక్తి క్రియేషన్స్ రూపొందించిన వెస్టన్ లవ్ అనే సినిమా పూజ ముహూర్త మహోత్సవానికి తొలి క్లాప్ కొట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందులదుర్గేష్ మాట్లాడుతూ సినిమా షూటింగ్‌లకు ఆంధ్రప్రదేశ్ అనువైన ప్రాంతమని పేర్కొన్నారు. ఏపీలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి జరగాలన్నారు. రాష్ట్రంలో స్టూడియోలు ఉన్నప్పటికీ వినియోగంలో లేవని తెలిపారు. రాష్ట్రంలో భారీగా షూటింగ్ లు జరుగుతున్నప్పటికీ మౌలిక సదుపాయాల కొరత ఉందన్నారు. హైదరాబాద్ తరహా స్టూడియోలు, రికార్డింగ్ థియేటర్లు, రీరికార్డింగ్ థియేటర్లు తదితర మౌలిక సదుపాయాలు రాష్టంలో కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చలనచిత్ర పరిశ్రమ రాష్ట్రం అభివృద్ధి చెందితే స్థానికంగా యువతకు, సిబ్బంది కి ఉపాధి లభిస్తుంది అన్నారు.

ఏపీ లో సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందడానికి అవసరమైన అంశాలపై చర్చించి నిర్మాతలతో కలిసి కొత్త సినిమా పాలసీని రూపొందిస్తామన్నారు. ఇప్పటికే సంబంధిత పాలసీ కి సంబంధించి రూపకల్పన చేస్తున్నామని త్వరలోనే పాలసీని ప్రకటిస్తామన్నారు.వెస్టన్ లవ్ సినిమా నిర్మాణానికి అవసరమైన సిబ్బందిని బయట ప్రాంతాల నుంచి కాకుండా స్థానికంగా ఉన్న సాంకేతిక నిపుణులు, ఇతర సిబ్బందితో నిర్మించనున్నామని చిత్ర దర్శకులు ఎం ఆర్ కాకర్ల, నిర్మాతలు రావి సౌజన్య,ఎం ఆర్ కాకర్ల లు తెలిపారని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందాన్ని మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. సినిమా కథ విన్నానని, వెస్టన్ లవ్ సినిమా యువతకు మంచి సందేశాన్ని ఇచ్చే చిత్రంఅన్నారు. హీరో, హీరోయిన్‌గా నటించిన రావి రామ్‌చరణ్, మాహిలు చూడ డానికి అందంగా ఉన్నారని తెలిపారు. సినిమా తప్పనిసరిగా విజయం సాధించాలని మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు.

## వరల్డ్ బిలియర్డ్స్‌లో పంకజ్‌కు రజతం



**న్యూఢిల్లీ:** వరల్డ్ మ్యాచ్‌ప్లే బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత దిగ్గజం పంకజ్ అద్వానీ రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నమెంట్ ఫైనల్లో పంకజ్ హోరాహోరీగా పోరాడి ఓడాడు. ఐర్లాండ్ వేదికగా జరిగిన తుదిపోరులో పంకజ్ 7-8 (100-19, 100-0, 47-100, 52-100, 100-19, 0-100,100-49, 3-100, 100-34, 100-4, 85-100, 100-31, 53-100, 43-100, 28-100) ఫ్రేమ్‌ల తేడాతో ఇంగ్లండ్‌కు చెందిన డేవిడ్ కాసియర్ చేతిలో పరాజయం పాలయ్యాడు. బిలియర్డ్స్, స్నూకర్ క్రీడాంశాల్లో వివిధ విభాగాల్లో కలిపి 28 సార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన పంకజ్ బెస్ట్ ఆఫ్ 15 పోరులో ఆరంభంలో చక్కటి ఆధిపత్యం కనబర్చినా, చివర్ల పుంజుకున్న ఇంగ్లండ్ క్యూయిస్ట్ విజయం సాధించాడు.

## వరల్డ్‌కప్ ఆర్చరీలో జ్యోతి, రిషభ్ జోడీకి పసిడి

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నమెంట్‌లో భారత్ ఖాతాలో పసిడి పతకం చేరుకుంది. ఇప్పటికే రెండు పతకాలు ఒక రజతం, ఒక కాంస్య భారత్‌కు రాగా, తజాగా స్వర్ణ పతకం లభించింది. ఈ టోర్నీలో భాగంగా కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత ద్వయం జ్యోతి సురేఖ-రిషభ్ యాదవ్ 153-151 పాయింట్ల తేడాతో చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ ఐజు-చెన్ చియే లున్ జంటపై విజయం సాధించింది. తుది పోరులో ఆదో సీడ్‌గా బరిలోకి దిగిన భారత్ జోడీ రెండో సీడ్ చైనీస్ తైపీని వెనక్కి నెడుతూ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. తొలి రెండు సిరీస్‌లను 37-38, 38-39తో కోల్పోయిన భారత ఆర్చర్లు మూడో సెట్‌లో 39-38తో తిరిగి పోటీలోకి వచ్చారు. నాలుగో సిరీస్‌లో 39-36తో సునాయాసంగా నెగ్గి పసిడి పతకం చేజిక్కించుకున్నారు. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీ కాంపౌండ్ విభాగాన్ని చేర్చిన అనంతరం ఈ విజయం విశ్వ క్రీడల్లో భారత్ పతక ఆశలను మరింత పెంచింది. ఇక ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు ఇది మూడో పతకం కావడం విశేషం. అంతకు ముందు కాంపౌండ్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత్ జట్టు కాంస్య పతకాన్ని నెగ్గగా, రికర్వ్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత్ జట్టు ఫైనల్‌కు చేరి కనీసం రజత పతకం ఖాయం చేసుకుంది.





## రాయల్ ఛాలెంజర్స్ నాలుగో విక్టరీ

### రాజస్థాన్ రాయల్స్‌పై 9 వికెట్ల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 18వ సీజన్‌లో సొంతగడ్డపై చతికిలపడుతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జైపూర్‌లో అదరగొట్టింది. ఆదివారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 9 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. 174 పరుగుల ఛేదనలో ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (65) విధ్వంసక అర్ధ శతకంతో మెరిశాడు. సాల్ట్ మెరుపులతో విజయానికి పునాది వేయగా, ఆ తర్వాత విరాట్ కోహ్లీ (62 నాటౌట్) సైతం బౌండరీలతో చెలరేగాడు. సందీప్ శర్మ వేసిన 4వ ఓవర్లో కోహ్లీ గాల్లోకి లేపిన బంతిని అందుకున్న రియాన్ పరాగ్ ఒడిసిపట్టుకోలేక వదిలేశాడు. పవర్ ప్లేలో ఆర్సీబీ వికెట్ కోల్పోకుండా 65 రన్స్ చేసింది. లైఫ్ లభించడంతో రెచ్చిపోయిన సాల్ట్ సందీప్ వేసిన 6వ ఓవర్లో సిక్సర్ బాదాడు. 7వ ఓవర్లో బౌండరీతో అర్ధ శతకం సాధించిన సాల్ట్ ఆ తర్వాత మరింత స్పీడ్ పెంచాడు. అయితే కుమార్ కార్తికేయ బౌలింగ్‌లో పెద్ద షాట్ ఆడి యశస్వీ చేతికి చిక్కాడు. దాంతో, 92 వద్ద బెంగళూరు మొదటి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్(40 నాఔటట్) బౌండరీలతో చెలరేగాడు. సందీప్ వేసిన 18వ ఓవర్ మూడో బంతికి ఫోర్ కొట్టిన పడిక్కల్ జట్టుకు 9 వికెట్ల విజయాన్ని అందించాడు. ఫలితంగా ఆర్సీబీ నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. ఈ విక్టరీతో బెంగళూరు జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ నిదానంగా మొదలైంది. పవర్ ప్లేలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు.

దాంతో, రాజస్థాన్ ఓపెనర్లు సంజూ శాంసన్(15), యశస్వీ జైస్వాల్(75 47 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లు)లు ధాటిగా ఆడలేకపోయారు. ఓవర్‌కు ఒక బౌండరీ చొప్పున సాధించగా 45 రన్స్ మాత్రమే వచ్చాయి. అయితే శాసన్‌ను కృనాల్ పాండ్యా వెనక్కి పంపాడు. అతడి బౌలింగ్‌లో వికెట్ కీపర్ జితేశ్ శర్మకు క్యాచ్ ఇచ్చి సంజూ ఔటవ్వడంతో తొలి వికెట్ 49 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత రియాన్ పరాగ్(30) సహకారంతో యశస్వీ దూకుడుగా ఆడాడు. కృనాల్ పాండ్యా బౌలింగ్‌లో సింగిల్ తీసి యశస్వీ అర్ధ శతకం సాధించాడు. రియాన్ పరాగ్(30)తో 55 పరుగుల కీలక భాగస్వామ్యం నిర్మించాడు. వీళ్లిద్దరూ దూకుడుగా ఆడడంతో 13 ఓవర్లకు రాజస్థాన్ వికెట్ నష్టానికి 104 రన్స్ చేసింది. యశ్ దయాల్ బౌలింగ్‌లో పరాగ్ కవర్స్‌లో విరాట్ కోహ్లీకి సులవైన క్యాచ్ ఇచ్చాడు. అర్ధ శతకం తర్వాత జోరు పెంచి ఆడుతున్న యశస్వీని హేజిల్‌వుడ్ ఎల్బీగా ఔట్ చేసి రాజస్థాన్ భారీ స్కోర్ ఆశలపై నీళ్లు చల్లాడు. చివర్లో ధ్రువ్ జురెల్(35 నాటౌట్), హెట్‌మైర్(9)లు ధాటిగా ఆడారు. 20వ ఓవర్లో ఆఖరి బంతిని నితీశ్ రానా(4 నాటౌట్) బౌండరీ సాధించడంతో రాజస్థాన్ నిర్ణీత ఓవర్లలో 173 పరుగులకే పరిమితమైంది.

# చెన్నై సూపర్ కింగ్స్ ఔట్!

### ఐపిఎల్‌లో ఏదైనా అద్భుతం జరిగేనేతే ప్లే ఆఫ్ ఛాన్స్



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, 18వ సీజను నుండి చెన్నై సూపర్ కింగ్స్ నిష్క్రమించడం దాదాపు తప్పనిసరి కానుంది. ఈ ఐపీఎల్ సీజనులో చెన్నై జట్టు ఇప్పటివరకు చాలా నిరాశ కలిగించింది. ప్రారంభ 6 మ్యాచ్‌లలో 5 ఓటములు చవి చూసింది. ఈ సీజన్‌లో మొదటి మ్యాచ్‌లో గెలిచిన తర్వాత, వరుసగా 5 మ్యాచ్‌లలో ఓడిపోయింది. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా ఇన్ని మ్యాచ్‌లలో ఓడిపోవడం ఇదే తొలిసారి. చివరకు సొంత మైదానంలో కూడా జట్టు గెలవలేకపోతోంది. చెపాక్‌లో గత మూడు మ్యాచ్‌లలో ఓడిపోయింది. ఈ నేపథ్యంలో ఈ అవమానకరమైన ప్రదర్శన తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్లే ఆఫ్ రేసు నుండి నిష్క్రమించిందా? ముంబై ఇండియన్స్ లాంటి అద్భుతం పునరావృతం అవుతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐపీఎల్ 2025 పాయింట్ల పట్టికలో సూపర్ కింగ్స్ జట్టు ప్రస్తుతం 6 మ్యాచ్‌లలో 1 విజయం, 2 పాయింట్లతో 9వ స్థానంలో ఉంది. దాని నెట్ రన్ రేట్ మైనస్ 1.554గా ఉంది. అయితే, ఈ పేలవమైన ప్రదర్శన తర్వాత కూడా జట్టు ప్లే ఆఫ్ రేసు నుండి నిష్క్రమిం చలేదు. కానీ, ప్లే ఆఫ్‌కు చేరుకోవడం అనేది చెన్నై జట్టుకు అద్భుతం కంటే తక్కువేమీ కాదు. ఐపీఎల్ లీగ్ దశలో అన్ని జట్లు 14-14 మ్యాచ్‌లు ఆడతాయి, కాబట్టి చెన్నై సూపర్ కింగ్స్‌కు ఇంకా 8 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ మిగిలిన మ్యాచ్‌లలో జట్టు బాగా ఆడితే, సీజన్‌లో పునరాగమనం చేయవచ్చు. అయితే చెన్నై సూపర్ కింగ్స్‌కు ఈ సీజన్‌లో పునరాగమనం చేయడం అంత సులభం కాదు. ఐపీఎల్ చరిత్రలో ప్రారంభ 6 మ్యాచ్‌లలో 5 మ్యాచ్‌లు ఓడిపోయి ప్లే ఆఫ్‌కు అర్హత సాధించి, టైటిల్ గెలిచిన జట్టు ఒక్కసారి మాత్రమే ఉంది. ఈ అద్భుతం 2015లో ముంబై ఇండియన్స్ జట్టు చేసింది. ఐపీఎల్ 2015లో ముంబై ఇండియన్స్ జట్టు ప్రారంభ 6 మ్యాచ్‌లలో 5 మ్యాచ్‌లు ఓడిపోయింది. ఆ తర్వాత జట్టు పునరాగమనం చేసి తర్వాతి 8 మ్యాచ్‌లలో 7 మ్యాచ్‌లు గెలిచి ప్లే ఆఫ్‌లో స్థానం సంపాదించింది. ఆ తర్వాత క్వాలిఫయర్, ఫైనల్ మ్యాచ్‌లలో చెన్నై జట్టును ఓడించి టైటిల్ గెలిచింది. మళ్లీ ఈ సీజనులో అటువంటి అద్భుతం చెన్నై సూపర్ కింగ్స్‌కు జరిగిన ప్లే ఆఫ్‌కు చేరుకుంటుందా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న అయింది.

## ఛాంపియన్ సూపర్ జెయింట్స్



**న్యూఢిల్లీ:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)-2024-2025లో మోహన్ బగాన్ సూపర్ జెయింట్స్ ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్స్‌లో బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్‌తో జరిగిన హోరాహోరీ పోరులో సూపర్ జెయింట్స్ జట్టు 2-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. 2024-25 సీజన్ లీగ్ దశలో అద్వితీయ ఆట తీరుతో పాయింట్ల పట్టికలోఅగ్రస్థానంలో నిలిచి లీగ్‌షీల్డ్ దక్కించుకున్న సూపర్ జెయింట్స్ జట్టు ఫైనల్లోనూ అదే జోరు కనపరచింది. తుది పోరులో సూపర్ జెయింట్స్ జట్టు తరఫున జాసన్ కమిన్స్ 72వ నిముషంలోను, జేమీ మెక్‌లారెన్ 96వ నిముషంలోనూ చెరో గోల్ చేశారు. మోహన్ బగాన్ జట్టు స్ట్రయికర్ అల్బెర్టో రోడ్రిగ్జ్ 49వ నిముషంలోనే బెంగళూరు గోల్స్ ఖాతా తెరవగా, ద్వితీయార్ధంలో చెలరేగిపోయిన సూపర్ జెయింట్స్ జట్టు రెండు గోల్స్‌తో విజయ పతాకాన్ని ఎగురవేసింది. జూపర్ జెయింట్స్ జట్టు 20 షాట్స్ ఆడగా, అందులో ఆరింటిని ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై సంధించగలిగింది.ఇకబెంగుళూరు జట్టు 18 షాట్స్‌లో నాలుగింటిని ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పైకి కొట్టింది. మ్యాచ్‌లో అత్యధిక శాతం బంతిని తమ నియంత్రణలో ఉంచుకోగలిగిన బెంగళూరుఫినిషింగ్ లోపాలతోగోల్స్ చేయలేకపోయింది. స్టార్ స్టయికర్ సునీల్ ఛెత్రి స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడం బెంగుళూరు విజయావకాశాలపై ప్రభావం చూపింది. ఓవరాల్‌గా మ్యాచ్లట 62 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకున్న బెంగళూరు జట్టు 512 పాస్‌లు కొట్టగా, 38 శాతం బంతిని నియంత్రించిన మోహన్ బగాన్ జట్టు 318 పాస్‌లు ఇచ్చుకుంది. పాస్‌ల కచ్చితత్వంలోనూ బెంగుళూరు 78 శాతంతో మెరుగైన ప్రదర్శన కనబర్చగా, సూపర్ జెయింట్స్ 65 శాతంతో వెనుకబడింది. ఇక 2022-23 సీజన్‌లోనూ ఈ రెండు జట్ల మధ్యే ఐఎస్ఎల్ ఫైనల్ మ్యాచ్ జరగ్గా అప్పుడు కూడా బెంగుళూరుపై సూపర్ జెయింట్స్ జట్టు గెలుపు సాధించి టైటిల్‌ను దక్కిందించుకుంది.

# పెరుగుతున్న క్రెడిట్ కార్డు బకాయిలు: ఆర్‌బిఐ


**ముంబై, ఏప్రిల్ 13:** గత కొన్ని సంవత్సరాలుగా క్రెడిట్ కార్డ్ వినియోగం గణనీయంగా పెరిగింది. ప్రధానంగా వినియోగదారుల వ్యయం పెరగడం, డిజిటల్ చెల్లింపులకు పెరుగుతున్న ప్రజాదరణ దీనికి కారణం. అయితే, డిసెంబర్ 2024తో ముగిసిన 12 నెలల కాలంలో క్రెడిట్ కార్డ్ విభాగంలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎలు) కూడా 28.42 శాతం పెరిగి రూ.6,742 కోట్లకు చేరుకున్నాయని తాజా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) డేటా చెబుతోంది. ఆర్‌బిఐ డేటా ప్రకారం డిసెంబర్ 2023లో రూ.5,250 కోట్ల నుండి ప్రస్తుత స్థాయికి స్థూల ఎన్‌పిఎలు పెరిగాయి. ఇది దాదాపు రూ.1,500 కోట్ల



పెరుగుదల ఉంది. ఇది డిసెంబర్ 2024లో వాణిజ్య బ్యాంకుల క్రెడిట్ కార్డ్ విభాగంలో ఉన్న రూ.2.92 లక్షల కోట్ల స్థూల రుణంలో దాదాపు 2.3 శాతం. ఇది గత సంవత్సరం ఉన్న రూ.2.53 లక్షల కోట్ల క్రెడిట్ కార్డ్ బకాయిలలో 2.06శాతంగా ఉంది. ఆర్థిక సవాళ్లు, దూకుడుగా రుణ విధానాలు, తక్కువ ఆర్థిక అక్షరాస్యత కారణంగా భారతదేశ క్రెడిట్ కార్డ్ రుణం వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా గిగ్ వర్కర్లు, ఎంఎస్ఎంఇలలో క్రమరహిత ఆదాయాలు సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. ఉదాహరణకు, 2023లో 8 మిలియన్లకు పైగా ఉద్యోగాలు పోయాయి. ఆదాయ అస్థిరత 2024 వరకు కొనసాగింది. ఈ అస్థిరత వల్ల చాలా మంది అవసరమైన ఖర్చుల కోసం క్రెడిట్ కార్డులపై ఆధారపడవలసి వస్తుందని రుణ చెల్లింపు వేదిక అయిన జావో వ్యవస్థాపకుడు కుందన్ షాహి చెప్పారు. బ్యాంకులు దూకుడుగా కార్డులు జారీ చేస్తున్నాయి. 2024లో 102 మిలియన్లకు పైగా కొత్తవి ఉన్నాయి. తరచుగా తక్కువ ఆదాయం ఉన్నవారిని లేదా మొదటి సారి రుణగ్రహీతలను లక్ష్యంగా చేసుకుని బల మైన క్రెడిట్ తనిఖీలు లేకుండానే జారీ చేస్తు న్నాయి. ఈ సులభమైన యాక్సెస్ హఠాత్తుగా ఖర్చు చేయడానికి ఆజ్యం పోస్తుంది. కానీ చాలా మందిని రుణ ఉచ్చులకు గురి చేస్తుందని జావో నుండి షాహి చెబుతున్నారు. ఆర్థిక అక్షరాస్యత లేక పోవ డం కూడా పరిస్థితిని మరింత దిగజార్చుతుం ది. కొంత మంది విని యోగదారులు క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపుల చివరి తేదీలకు కట్టుబడి ఉండటం ప్రాముఖ్యతను అర్థం చేసుకోరు. యువ వినియోగదారులు ముఖ్యం గా అనవసరమైన ఖర్చు లకు గురవుతారు. రూపే క్రెడిట్ కార్డులతో యుపిఐని అనుసంధానించడం వల్ల లావాదేవీలు సజావుగా జరి గాయి. అయితే ఖర్చు పర్యవేక్షణ కూడా తగ్గింది" అని షాహి చెప్పారు. ఆర్థిక విద్య, రుణ నిబంధనలను పరిశీలించక పోతే ఈ విభాగంలో హద్దులేని వృద్ధి దీర్ఘ కాలిక పరిణామాలను కలిగిస్తుంది. జోక్యం చేసుకోకపోతే, పెరు గుతున్న డిఫాల్ట్‌లు, ఆర్థిక ఒత్తిడి కారణంగా లోతైన రుణ సంక్షోభం పెరిగే ప్రమాదంఉంది. అయితే, స్కోరును మెరుగుపరచుకోవడానికి మీకు తగినంత సమయం అవసరం. అయితే, పేలవమైన క్రెడిట్ స్కోరుకు కారణమైన కారణాలను మీరు ముందుగా గుర్తించాలి. క్రెడిట్‌కార్డును పొందడంలో, అనుకూలమైన నిబంధనలపై వ్యక్తిగత రుణాన్ని పెంచడంలో క్రెడిట్ స్కోరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

## ఆరోగ్య బీమాతో ఆర్థిక ధీమా..

**ముంబై, ఏప్రిల్ 13:** సాధారణంగా 20 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయసులో ఆరోగ్య బీమాను తీసుకోవడం ప్రారంభించాలి. చిన్న వయస్సులో ఎక్కువ కవరేజ్ ఎంచుకోవడం వల్ల ఎక్కువ వయస్సులో పెద్దబీమా మొత్తం లభిస్తుంది. రెగ్యులర్ చెకప్‌లు, టీకాలు, వెల్నెస్ బెనిఫిట్లను అందించే ప్లాన్లను తీసుకోవాలి. చాలా సంస్థలు ఎన్సీబీని అందిస్తాయి. అంటే ప్రతి క్లెయిమ్ రహిత సంవత్సరానికి మీ బీమా మొత్తం పెరుగుతూ ఉంటుంది. కాలక్రమీణాఎక్కువ ప్రయోజనాలను పొందటానికి ఇది మంచి మార్గం. 30ఏళ్ల నుంచి 40ఏళ్లలోకి అడుగుపెట్టేసరికీ బాధ్యతలు పెరుగుతాయి. వివాహం, పిల్లలు కారణంగా ఖర్చులు ఎక్కువవుతాయి. ఈ సమయంలో ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడు కొన్ని విషయాలను పరిశీలించాలి. వ్యక్తిగత పాలసీలకు బదులుగా భార్య, పిల్లలకు కలిపి ఒకే బీమాను అందించే ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ ఎంచుకోవాలి. ఈ పాలసీలు ఇంకా నిర్ధారణ కాని వ్యాధులకు కూడా కవరేజీ అందిస్తాయి. ప్రినేటల్, ప్రసవానంతర ఖర్చులు, డెలివరీ ఖర్చులు, నవజాత శిశువులకు టీకాలు వేసి పాలసీలను తీసుకోవాలి. క్యాన్సర్, గుండె జబ్బులు, మూత్ర పిండాల వైఫల్యం తదితర వాటికి ఒకేసారి చెల్లింపులను అందించే యాడ్ - ఆన్ లను పరిగణించాలి. కీమోథెరపీ, డయాలసిస్ వంటి డేకేర్ చికిత్సలు, ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ) ఖర్చులను కవర్ చేసే పాలసీని తీసుకోవాలి. కొన్ని పాలసీలు మధ్యంతర కాలంలో, పునరుద్ధరణ సమయంలో కొత్త సభ్యులను చేర్చుకునే అవకాశం కల్పిస్తాయి. సాధారణంగా 40 నుంచి 50 ఏళ్లకు మధ్య వయస్సుగా పరిగణిస్తారు. ఈ సమయంలో హైపర్ టెన్షన్, డయాబెటీస్, గుండె వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. వీటి కవరేజీ పాలసీలను తీసుకోవాలి. దీర్ఘకాలికవ్యాధులకు వైద్యచికిత్సలు ఖరీదుగా ఉంటాయి. కాబట్టి అధికమొత్తం బీమా మొత్తం కలిగిన పాలసీని ఎంపిక చేసుకోవాలి. చాలా బీమా సంస్థలు వార్షిక ఆరోగ్య పరీక్షలు, వెల్నెస్ ప్రోత్సాహకాలను అందిస్తాయి. బీమా సంస్థలు 60 ఏళ్లు పైబడిన వ్యక్తుల కోసం ప్రత్యేక పాలసీలను అందిస్తాయి. వయస్సు సంబంధిత వ్యాధులను కవర్ చేస్తాయి.




## వాణిజ్యం

## స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో భారత్ రికార్డు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** భారతదేశంలో గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 54 శాతం పెరిగాయి. ఈ వృద్ధి వరల్డ్ వాల్యూ చైన్‌లో భారత దేశానికి సంబంధించిన ఏకీకరణను ప్రతిబింబిస్తుందని, అలాగే భారీ ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని కేంద్రమంత్రి వైష్ణవ్ తెలిపారు. భారతీయ ఎంఎస్ఎంఈలు ఇప్పుడు ప్రపంచంలో కీలకంగా మారుతున్నాయని వివరించారు. దేశీయ ఎలక్ట్రానిక్స్ తయారీ పర్యావరణ వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. భారతదేశ ఎగుమతుల పెరుగుదలకు ప్రధానంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎల్ఐ స్కీమ్ ప్రధానం కారణమని ఆయన పేర్కొన్నారు. పీఎల్ఐ స్కీమ్ వల్ల స్థానిక ఉత్పత్తిని గణనీయంగా పెరిగిందని వివరించారు. ముఖ్యంగా భారతదేశం దిగుమతి చేసుకున్న స్మార్ట్‌ఫోన్‌లపై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయపడింది. ప్రస్తుతం భారతదేశంలో అమ్ముడవుతున్న స్మార్ట్‌ఫోన్‌లలో దాదాపు 99 శాతం దేశీయంగా తయారవుతున్నాయని తెలిపారు. ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ అంచనాలు 2025 ఆర్థిక సంవత్సరంలో స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 20 బిలియన్ యూఎస్ డాలర్లకు చేరుకుంటాయని అంచనా వేస్తున్నారు. అయితే తుది సంఖ్య ఈ అంచనాను సులభంగా అధిగమించింది. దీన్ని బట్టి ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీలో భారతదేశ పాత్రను అర్థం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

భారతదేశ స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో ఆపిల్ అగ్రస్థానంలో ఉంది. మొత్తం షిప్‌మెంట్‌లలో దాదాపు 70శాతం వాటాతో అగ్రగామిగా ఉంది. ముఖ్యంగా తమిళనాడు లోని ఫాక్స్‌కాన్ సౌకర్యం ఒక ప్రధాన ఎగుమతి కేంద్రంగా మారింది. భారతదేశం నుంచి ఎగుమతైన ఐఫోన్ షిప్‌మెంట్‌లలో దాదాపు సగం ఎగుమతులు



ఫాక్స్‌కాన్ నుంచే ఎగుమతయ్యాయి. అలాగే ఈ ఎగుమతులు సంవత్సరానికి 40 శాతం వృద్ధిని నమోదు చేస్తుంది. అలాగే టాటా ఎలక్ట్రానిక్స్ కూడా స్మార్ట్‌ఫోన్ రంగంలో తన మార్క్‌ను చూపిస్తుంది. కర్ణాటకలోని విస్ట్రాన్ సౌకర్యంలో దాని వాటా, పెగాట్రాన్ తమిళనాడు యూనిట్‌లో 60 శాతం వాటా భారతదేశంలో ప్రధాన ఐఫోన్ తయారీదారుగా దాని స్థానాన్ని బలోపేతం చేసుకున్నాయి. అలాగే సుంకాల విషయంలో అమెరికా తీసుకున్న నిర్ణయం వలల్ భారతదేశం నుంచి ఐఫోన్‌ల ఎగుమతులు మరింత పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పెట్రోల్ బంకుల్లో పెరుగుతున్న మోసాలు..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** కారు, బైక్‌లో పెట్రోలు నింపే ముందు, తర్వాత పంపుపై మీటర్ రీడింగ్‌ను గమనించాలి. మీకు కొనుగోలు చేసిన ఇంధన పరిమాణం దానిలో చూపిన అంకెలతో సరిపోయిందో, లేదో చూసుకోండి. డిస్‌ప్లేలో ముందుకు దూకినట్టు అనిపించినా, అస్తవ్యస్తంగా కనిపించినా వేరే పంపు కోసం అడగండి. అక్కడి స్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేయండి. నాణ్యమైన ఇంధనంతో మీ వాహనం మన్నిక, మైలేజీ బాగుంటాయి. తక్కువ నాణ్యత గల ఇంధనాన్ని వాడితే అనేక సమస్యలు వస్తాయి. వాహనం మైలేజీ తగ్గడం, ఇంజిన్ హార్డ్‌గా మారడం, పరుగులో తేడా కనిపిస్తాయి.



కాబట్టి నమ్మకమైన పెట్రోలు బంకుకు వెళ్లడం చాలాముఖ్యం. సాధారణంగా పెట్రోలు ధర అన్ని చోట్లా ఒకేలా ఉంటుంది. కానీ చుట్టుపక్కల బంకుల కంటే తక్కువ ధరకు ఇంధనం అందిస్తుంటే అప్రమత్తంగా ఉండాలి. అది మిమ్మల్ని మోసం చేయడానికి చేసే ప్రయత్నం కావచ్చు. కాబట్టి ఎల్లప్పుడూ ధరలను గమనించాలి. మీ వాహనంలో ఇంధనం నింపే సహాయకుడి చర్యలను గమనించాలి. అతడు పంపును తారుమారు చేయకూడదు, సరైన అనుమతి లేకుండా మీటర్‌ను సర్దుబాటు చేయకూడదు. పెట్రోల్ బంకులో సహాయకుడి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉంటే అప్రమత్తమవ్వాలి. పెట్రోలు బంకులో ఇంధనం కొట్టించుకున్న తర్వాత రశీదును తీసుకోవడం మర్చిపోవద్దు. కొలతల్లో వ్యత్యాసాలు, సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి రశీదు ఎంతో ఉపయోగపడుతుంది.

## టెక్ రంగంలో మహిళలకు డిమాండ్

**ముంబై, ఏప్రిల్ 13:** భారత్‌లో టెక్, బిజినెస్ రంగాల వృద్ధి కొనసాగుతూనే ఉంది. దీంతో ఈ రంగాల్లో నియామకాలు కూడా ఫుల్ జోష్ లో ఉన్నాయి. తాజాగా టీమ్‌లీజ్ డిజిటల్ విడుదల చేసిన నివేదికలో ఈ రెండు రంగాల్లో మహిళలకు అధిక డిమాండ్ ఉన్న ఉద్యోగాల జాబితాను వెల్లడించింది. అనుభవం, నైపుణ్యానికి పెద్దపేట వేస్తూ అధిక జీతాలతో ఆకర్షణీయమైన కొలువులు ఈ రంగాల్లో మహిళలకు స్వాగతం పలుకుతున్నాయి. ముఖ్యంగా ఫ్రెషర్స్ నుంచి అనుభవజ్ఞులైన నిపుణుల వరకు.. డేటా సైన్స్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, క్లౌడ్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాల్లో మహిళలకు కెరీర్ అవకాశాలు దండిగా ఉన్నాయి. భారత్ టెక్ రంగంలో ఒక ప్రొడక్ట్‌ను దాని ప్రారంభ దశ నుంచి కస్టమర్ వరకు నడిపించడంలో ప్రొడక్ట్ మేనేజర్ కీలక పాత్ర పోషిస్తారు. వారు కస్టమర్ అవసరాలు, వ్యాపార లక్ష్యాలు రెండింటికీ అనుగుణంగా ఉండేలా ప్రొడక్ట్‌ను పోటీ కంటే ముందుండేలా చేస్తారు. ఈ రంగంలో అడుగుపెట్టే ఫ్రెషర్లకు (0 నుంచి 3 యేళ్లకు) రూ. 22.1లక్షల వార్షిక ఆదాయం లభిస్తుంది. కెరీర్ ప్రారంభంలో ప్రొడక్ట్ మేనేజర్లు, మార్కెట్ రీసెర్చ్, వినియోగదారు అవసరాలను గుర్తించడం, వారి ఆలోచనలకు ప్రాణం పోసేందుకు డెవలప్‌మెంట్ టీంకు మద్దతుతెల్పడం వంటి అంశాలపై దృష్టిసారించవల్సి ఉంటుంది. అనుభవం పెరిగేకొద్దీ వీరి జీతం అంటే 8 యేళ్ల అనుభవం ఉన్న సీనియర్ ప్రొడక్ట్ మేనేజర్లు, డైరెక్టర్లకు రూ.160 లక్షల వరకు వార్షిక ఆదాయం పొందొచ్చు. ముడి డేటానువిలువైన అంతర్దృష్టులుగా మార్చడంలో డేటా సైంటిస్టులు కీలకపాత్ర పోషిస్తారు. కంపెనీలు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి డేటాపై ఎక్కువగా ఆధారపడటంతో, ఈ రంగం అత్యంత ప్రతిఫలదాయకమైన కెరీర్ ఆప్షన్‌లలో ఒకటిగా మారింది. డేటా సైన్స్ రంగంలో ఫ్రెషర్లకు రూ.18 లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తుంది. ఇందులో కొత్త డేటా సైంటిస్టులు పెద్ద డేటాసెట్‌లను ఎలా నిర్వహించాలో, ప్రాథమిక యంత్ర అభ్యాస పద్ధతులను ఎలా వర్తింపజేయాలో, డేటా ఆధారిత పరిష్కారాలతో వాస్తవ ప్రపంచ సమస్యలను ఎలా పరిష్కరించాలి వంటి వాటిని నేర్చుకుంటారు. అలా 8 యేళ్ల తర్వాత సీనియర్ డేటా సైంటిస్టులకు రూ. 150లక్షల వార్షిక వేతనం లభిస్తుంది. పిఎంఒ (ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఆఫీస్) నిపుణులు బడ్జెట్‌ను మించకుండా సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేయడానికి, సంస్థాగత లక్ష్యాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తారు. ప్రాజెక్ట్ ప్రక్రియలను క్రమబద్ధీకరించడంలో, సామర్థ్యాన్ని నిర్ధారించడంలో వీరి నైపుణ్యాలు ఏ వ్యాపారానికైనా కీలకంగా ఉంటాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.